ఆదివారం
గతి సారాంశాలపై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

డిజిపిగా హరీష్ కుమార్ గుప్తా బాధ్యతల స్వీకరణ

సంజయ్ సస్పెన్షన్‌ను పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ 7లో

రాజమహేంద్రవరం
fb.com/vaartha
Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
1-2-2025 శనివారం సంపుటి: 30 సంచిక: 364 పేజీలు: 12 వెల: 6.50



## 6.8% ఆర్థిక వృద్ధి అంచనా

### లోక్‌సభలో ఆర్థిక సర్వే సమర్పించిన మంత్రి నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ, జనవరి 31:** భారత్ ఆర్థికవృద్ధి 6.3శాతంనుంచి 6.8శాతంగా ఉంటుందని, ద్రవ్యోల్బణం స్థిరంగానే నియంత్రణలో ఉంటుందని ఆర్థికసర్వేలో ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వ ప్రధాన ఆర్థికసలహాదారు అనంత నాగేశ్వరన్ ఆధ్వర్యంలోరూపొందించిన కొత్తసంవత్సర ఆర్థికసర్వే నివేదికను మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. దేశీయంగా ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉందని, నిరుద్యోగిత రేటు తగ్గుతోందని, ద్రవ్యోల్బణం స్థిరంగా ఉంటూనే మరికొన్ని సంస్కరణలు ప్రవేశపెట్టాలని >>7



## ప్రపంచంలో 3వ ఆర్థిక వ్యవస్థగా మారుతున్న భారత్ : రాష్ట్రపతి ముర్ము

**న్యూఢిల్లీ,జనవరి 31:** ఎన్డీయే ప్రభుత్వం గత ప్రభుత్వాల పాలనతో పోలిస్తే మూడురెట్లు వేగంగా పనిచేస్తోందని త్వరలో ప్రపంచంలోమూడో ఆర్థికవ్యవస్థగా భారత్ మారనున్నదని రాష్ట్రపతి ద్రౌపదిముర్ము అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో గ్లోబల్ ఇన్నొవేషన్ పవర్‌హౌస్‌గా భారత్ మారిపోతోందని రాష్ట్రపతి అన్నారు. వక్ఫ్ చట్టాలకు సవరణలు, ఒకే దేశం ఒకే ఎన్నిక వంటి అంశాలపై ప్రభుత్వం కీలక నిర్ణయాలు ప్రకటించిందని అన్నారు. బడ్జెట్ సమావేశాల ప్రారంభం రోజున ఉభయసభలనుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించారు. సంస్కరణలు, పనితీరు, పరివర్తనం అన్న మూడు అంశాల ఆధారంగా మరింత పురోగతివైపు భారత్ పయనిస్తోందని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా భారత్ కొత్తపాలన నమూనాకు పర్యాయపదంగా మారాయని ఆమె అన్నారు. జి20, బ్రిక్స్ >>7

## రిజిస్ట్రేషన్ విలువలు నేటి నుంచి పెంపు

### రాష్ట్రమంతా కిటకిటలాడిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు


**విజయవాడ, జనవరి 31 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా భూముల రిజిస్ట్రేషన్లకు సంబంధించి కొత్త మార్కెట్ విలువలు శనివారం నుంచి అమల్లోకి రాబోతున్నాయి. సీఆర్డీ పరిధిలో మినహాయించి రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద రదీ ్ద వాతావరణం ఉంది. రిజిస్ట్రేషన్లు అధికంగా ఉండటంతో సర్వర్‌పై ఒత్తిడి పెరిగింది. దీనివల్ల రిజిస్ట్రేషన్ల నిర్వహణకు అధిక సమయం పట్టింది. చలానాల చెల్లింపులకూ నిరీక్షించాల్సి వచ్చింది. దీంతో క్రయ, విక్రయదారులు అవస్థలు పడ్డారు. సాయంత్రం నుంచి క్రమంగా సర్వర్‌పై ఒత్తిడి తగ్గడంతో రిజిస్ట్రేషన్లు ఊపందుకున్నాయి. కొన్ని కార్యాలయాల్లో రాత్రి పొద్దుపోయే వరకు రిజిస్ట్రేషన్లు కొనసాగాయి. నివాస భవనాల విభాగంలో అపార్టుమెంట్ ప్లాట్‌కు రూ.1490, రూ.1270, రూ.900 చొప్పున ఖరారు చేశారు. ఇదేవిధంగా మూడో అంతస్తు ఆపైన వాటికి అదనంగా రూ. 30, రూ.25, రూ.20గా నిర్ణయించారు. వాణిజ్యభవనాల విభాగంలో గ్రౌండ్ ఫ్లోర్‌కు రూ. 1800, రూ.1540, రూ.1060 చొప్పున నిరణయించారు. మొదటి అంతస్తుకు రూ.1700, రూ.1480, రూ.1010, రెండో అంతస్తు, ఆపైన ప్రతి ఫ్లోర్‌కు రూ.1590, రూ.1380, రూ.950 చొప్పున చెల్లించాలి. సినిమా హాళ్లు కర్మాగారాలకు చదరపు అడుగుకు రూ.950, రూ.880, రూ.690 చొప్పున ఖరారు చేశారు. పెంకుటిల్లు రేకులషెడ్లు, ఇతర వాటికి రూ.740, రూ.590,రూ.420 చవిటి మిద్దెలకు రూ.420, రూ.320, రూ.240 చొప్పున ఖరారు చేశారు. వీటితోపాటు మరికొన్ని నిర్మాణాలు విలువలు కూడా పెరిగాయి. భూముల రిజిస్ట్రేష్టన్లు కోసం ఆయా ప్రాంతాల అభివృద్ధి ప్రతిపాదికన 10% నుంచి 20% వరకు ఇవి పెరిగాయి. కొన్నిచోట్ల పెంపు కాస్త ఎక్కువగానే ఉంది. కొత్త మార్కెట్ విలువల అమలుకు ఏర్పాట్లు చేసుకోవాలని ప్రభుత్వం రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖను ఆదేశించింది. భూములతోపాటు నిర్మాణాల విలువలపెంపు కూడా ఫిబ్రవరి 1నుంచే అమల్లోకి రానుంది. ఇందుకు సంబంధించిన వివరాలనూ రిజిస్ట్రేషన్లశాఖ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపింది. ప్రస్తుతం అమల్లో ఉన్న నిర్మాణాల >>7

## గాడిన పడుతున్న రాష్ట్రం

### ప్రతి ఎన్నిక ఫలితం సుస్థిరపాలనపై నమ్మకం కలిగించేలా ఉండాలి

### ఎప్పుడు ఎన్నికలొచ్చినా గెలుపు ప్రణాళికలు పకడ్బందీగా రూపొందించాలి

### గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై సిఎం చంద్రబాబు దిశానిర్దేశం



**విజయవాడ.జనవరి31,ప్రభాతవార్తప్రతినిధి:** ఏ ఎన్నిక వచ్చినా గెలిచినప్పుడే ప్రజలల్లో మనం ఎంత విశ్వసనీయత ఉందో స్పష్టమవుతుందని ఏపీ సీఎం చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో సుస్థిర పాలనపై నమ్మకానికి గుర్తుగా ఉంటుందన్నారు. ఎన్డీయే కూటమి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై నేతలకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఉభయ గోదావరి జిల్లాలు, ఉమ్మడి కృష్ణా , గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పేరాబత్తుల రాజశేఖర్,ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను కూటమి అభ్యర్థులుగా బలపరిచామన్నారు. ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ వస్తుందన్నారు. అదే నెల 27న ఎన్నికలు, మార్చి 3న ఓట్లు లెక్కింపు జరుగుతాయని తెలిపారు. ప్రతి గ్యాడ్యుయేట్‌ను కలిసి భారీ మెజారిటీ సాధించాలన్నారు.. చదువుకున్న వాళ్లంతా కూటమితోనే ఉన్నారని చెప్పారు. ఎవరూ ఓవర్ కాన్ఫిడెన్స్‌లో ఉండొద్దని నేతలకు సూచించారు.అతి విశ్వసనీయత వలన మన నుంచి ప్రజలు ఏం కోరుకుంటున్నారో గుర్తించలేమన్నారు. ఎన్డీయే పక్షాలతో సమన్వయ సమావేశాలు పెట్టుకుని పని చేయాలని వెల్లడించారు. క్లస్టర్, యూనిట్, బూత్, ఇంచార్జ్‌లతోపాటు, జనసేన, బీజేపీ కమిటీల నేతలతో ముందుకెళ్లాలని నిర్దేశించారు. ఈ ఎన్నికలు ఏక పక్షంగా జరగాలన్నారు.ప్రజల్లో మన పట్ల మరింత ఆదరణ పెరుగుతుందని చెప్పారు. మొదటిసారి గెలిచిన ఎమ్మెల్యేలు, కొత్తగా రాజకీ యాల్లోకి వచ్చిన నేతలు మరింత చిత్తశుద్ధితో పని చేయాలని తెలిపారు. కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిం చాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన 7నెలల్లో ఇబ్బందులు అధిగమించి సుపరిపాలన వైపు అడుగులు వేస్తున్నామని, ప్రజలకు ఇబ్బంది లేని పాలన సాగిస్తున్నామని పేర్కొన్నారు. రాత్రికి రాత్రి అన్నీ జరిగిపోతాయని మనం చెప్పడం లేదని గాడి తప్పిన వ్యవస్థలను సరిదిద్దుతు న్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ సాయంతో విశాఖ స్టీల్ ప్లాంట్, రాజధాని అమరావతికి ఆర్థిక సాయం, పోలవరానికి నిధులు, రైల్వే జోన్‌తో పాటు ఇతర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. జాబ్ ఫస్ట్ విధానంతో నూతన ఇండస్ట్రియల్ పాలసీలు తీసుకొచ్చామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక దాదాపు రూ.7 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకొచ్చామని.. ఈ పెట్టుబడుల ద్వారా 4,10,125 ఉద్యోగాలు యువతకు వస్తాయని అన్నారు. త్వరలోనే 16,347 టీచర్ పోస్టులకు డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తున్నామన్నారు.

ఇవన్నీ ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ఉందన్నారు. మూడు పార్టీల నేతలు సార్వత్రిక ఎన్నికలకు ముందు సమన్వయంతో పని చేసినట్లుగానే ఇప్పుడూ అదేవిధంగా పని చేయాలని సూచనలు చేశారు. జరిగే ప్రతి ఎన్నికల్లో గెలిచేందుకు ప్రణాళిక రూపొందించుకోవాలని సీఎం చంద్రబాబు అన్నారు. కూటమికి యూటీఎఫ్ మినహా >>7

## 'ఆప్'కు ఏడుగురు ఎమ్మెల్యేలు గుడ్‌బై

### తాజా ఎన్నికలకు పార్టీ టిక్కెట్లు రాకపోవడమే కారణం

### 5న ఢిల్లీ పోలింగ్

**న్యూఢిల్లీ, జనవరి 31:** అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆమ్ ఆద్మీపార్టీకి భారీ షాక్ తగిలింది. ఒకేసారి ఏడుగురు ఎమ్మెల్యేలు శుక్రవారం రాజీనామాచేసారు. అరవింద్ కేజ్రివాల్‌తోపాటు పార్టీపైనా తమకు నమ్మకం పోయిందని వారంతా తమతమ రాజీనామా లేఖల్లో ప్రకటించారు. పార్టీలో ప్రాథమిక సభ్యత్వాలకు రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్యేలు భావనాగౌర్, మదన్ లాల్‌లు కేజ్రీవాల్ పైనా, పార్టీపైనా తమకు నమ్మకం లేదని అన్నారు. ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రివాల్‌కు వేరువేరుగా లేఖలు పంపించారు. మీపట్ల పార్టీపట్ల విశ్వాసం లేదని అందువల్లనే ఈనిర్ణయం తీసుకున్నా దయచేసి నా రాజీ నామాను ఆమోదించాలని భావనాగౌర్ తన లేఖలో వివరించారు. ఎమ్మెల్యేలు మెహ్రౌలి నుంచి నరేష్ యాదవ్, త్రిలోక్‌పురి రోహిత్ కుమార్, జనక్‌పురి రాజేష్ >>7

## నేడు ఢిల్లీ ఎన్నికల ప్రచారానికి సిఎం

**విజయవాడ,జనవరి31,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫిబ్రవరి1న ఢిల్లీకి వెళ్లనున్నారు. ఫిబ్రవరి 5న ఢిల్లీ అసెంబ్లీకి సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి పక్షాన ఆయన ప్రచారం చేయనున్నారు. ఎన్డీయే పొత్తులో భాగంగా బీజేపీ తరఫున ప్రచారం చేయాలని టీడీపీ నిర్ణయించింది. ఈ మేరకు ఢిల్లీకి చంద్రబాబు రేపు వెళ్లనున్నారు. బీజేపీకి మద్దతుగా తెలుగువారున్న ప్రాంతాల్లో ఆయన ప్రచారం చేయనున్నారు. దీనికి సంబంధించి శుక్రవారం ఢిల్లీలో ఆంధ్ర అసోసియేషన్‌తో టీడీపీ ఎంపీలు సమావేశం అయ్యారు. ఇక ఆదివారం రోజు ఎంపీలతో కలిసి బీజేపీ తరఫున చంద్రబాబు ప్రచారం చేయనున్నారు.?ఉభయ గోదావరి జిల్లాలు, ఉమ్మడి కృష్ణా గుంటూరు జిల్లాల నేతలతో నేడు ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్యాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పేరాబత్తుల రాజశేఖర్, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను కూటమి అభ్యర్థులుగా బలపరిచామని తెలిపారు. ఫిబ్రవరి 27న జరిగే ఎన్నికల్లో వారిని భారీ మెజార్టీతో గెలిపించేలా చూడాలని ఆదేశించారు.

## గత ప్రభుత్వ వైఫల్యాలు విస్తృతంగా ప్రజల్లోకి




శుక్రవారం టిడిపి పొలిబ్యూరో సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

### వైఎస్సార్సీపీ హయాంలో తప్పులు చేసిన వారిని శిక్షించేందుకు ప్రత్యేక ట్రిబ్యునల్

### టిడిపి పొలిట్‌బ్యూరో సమావేశంలో పలుకీలక నిర్ణయాలు

### లోకేష్‌కు డి.సిఎంపైనా ప్రస్తావన

### 3విడతల్లో అన్నదాత సుఖీభవ చెల్లింపు

**విజయవాడ,జనవరి31,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను, గత ప్రభుత్వ వైఫల్యాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలని ఏపీ చంద్రబాబు అన్నారు.పార్టీని పటిష్టం చేసేందుకు ప్రతి క్రియాశీలక కార్యకర్త ఇచ్చే సలహాను పరిగణనలోకి తీసుకుంటామన్నారు.ఏపీ సీఎం చంద్రబాబు అధ్యక్షతన టీడీపీ పొలిట్ బ్యూరో సమావేశం శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగింది. వైఎస్సార్సీపీ హయాంలో స్థానిక సంస్థల్లో తగ్గిన బీసీ కోటా రిజర్వేషన్ పునరుద్ధరించేలా చట్టపరమైన అంశాలు పరిశీలించాలని నేతలకు సూచించారు. చంద్రబాబు అధ్యక్షతన జరిగిన పొలిట్ బ్యూరో సమావేశంలో చర్చించారు. నాలుగున్నర గంటల పాటు ఈ సమా వేశం జరిగింది.వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో జరిగిన పొరపాట్లను సరిదిద్దాలని నిర్ణయించారు. తెలుగుదేశం పార్టీ పరంగా అత్యున్నత నిర్ణాయక వేదిక పొలిట్ బ్యూరో ఉంది,ప్రస్తుతం పొలిట్ బ్యూరోలో పలువురు సీనియర్ నేతలు ఉన్నారు. వారంతా కేబినేట్‌లో మాదిరిగానే పొలిట్ బ్యూరోలో కూడా సీనియర్లు, జూనియర్లకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.వారు ఈ అంశంలో కొంత చర్చ జరగాలన్నారు. అప్పుడే బ్యాలెన్స్ కుదురుతుందని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ భావిస్తున్నారు.అదే విషయాన్ని ఆయన సమావేశంలో ప్రస్తావించారు.అందుకే ప్రస్తుతం పొలిట్ బ్యూరోలో రాజకీయంగా క్రియశీలంగా నలుగురైదుగురి స్థానే నూతన ఆలోచన విధానంతో ఉన్నవారికి అవకాశం కల్పించాలని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నారా లోకేశ్ నూతన ప్రతిపాదనలు చేసారు. పోలిట్‌బ్యూరో సహా ఇతర సంస్థాగత వ్యవస్థలో కీలక బాధ్యతలను మూడు పర్యాయాల పనిచేసిన వారికి >>7

## టీచర్ల బదలీల్లో పారదర్శకత కోసం ట్రాన్స్‌ఫర్ యాక్ట్

### విద్యామంత్రి లోకేష్



**విజయవాడ,జనవరి31,ప్రభాతవార్తప్రతినిధి:** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం విషయంలో ప్రభుత్వం ఎప్పటికప్పుడు స్దిర కార్చచరణ తీసుకుంటుందని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయంలోనూ టీచర్ల అభిప్రాయ సేకరణ ఉంటోందన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో మంత్రి నారా లోకేశ్ మీడియాతో ఇష్టాగోష్టిలో పాల్గొన్నారు.విద్యాశాఖ కమిషనర్ ప్రతి శుక్రవారం టీచర్ల సమస్యలు వింటున్నారని వివరించారు. ఆ దిశలో చర్యలు తీసుకున్నామన్నారు.టీచర్ల బదిలీ పారదర్శకంగా ఉండేందుకు ట్రాన్స్‌ఫర్ యాక్ట్ తీసుకొస్తున్నట్లు తెలిపారు. విద్యా వ్యవస్థ అంటే అనాలోచిత నిర్ణయాలు తీసుకునే వ్యవస్థ కాదని నిరూపిస్తున్నామని తేల్చి చెప్పారు. అందులో భాగస్వామ్యులైన వారందరితో చర్చించాకే నిర్ణయం తీసకుంటూ ప్రజాస్వామ్య విలువలు చాటుతున్నామన్నారు. రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని మార్చిలో ప్రక్రియ ప్రారంభించి విద్యాసంవత్సరం ప్రారంభంలోనే టీచర్ల భర్తీ పూర్తి చేస్తామన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, నవ్యాంధ్రలోనూ 80శాతానికిపైగా టీచర్ల నియా >>7

## లిక్కర్ స్కాం నిందితుడు వాసుదేవరెడ్డి డిప్యుటేషన్ పొడిగింపు

### ప్రభుత్వం ఆదేశాలు

**విజయవాడ,జనవరి31,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణంలో కీలక నిందితుడు, ఐఆర్ టీఎస్ అధికారి డి.వాసుదేవరెడ్డి డిప్యుటేషన్ పొడిగిస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. రాష్ట్రంలో ఆయన డిప్యుటేషన్‌ను మరో ఆరు నెలల పాటు పొడిగిస్తున్నట్టుగా రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. మద్యంకేసు విచారణ జరుగుతున్నందున ఆయన్ని రాష్ట్రం నుంచి రిలీవ్ చేయకుండా, డిప్యుటేషన్‌పై కొనసాగిస్తున్నారు. మద్యం సీసాలపై ముద్రించే సెక్యూరిటీ హాలోగ్రామ్‌ల తయారీ, సరఫరా విషయంలో వాసుదేవరెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని చెన్నైకి చెందిన సీనియర్ పాత్రికేయుడు వి.శివరామన్ గతేడాది నవంబరు 23వ తేదీన ఫిర్యాదు చేశారు. తద్వారా కుంభత్ హాలోగ్రాఫిక్స్ సంస్థ, హోలిస్టిక్ ఇండియా, అల్ఫాలేజర్ టెక్ సంస్థలను టెండర్ ప్రక్రియలో పాల్గొనేందుకు నాటి ఏపీఎస్‌బీసీఎల్ ఎండీ వాసుదేవరెడ్డి అవకాశమిచ్చారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. వి.శివరామన్ ఫిర్యాదు ఆధారంగా సీఐడీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం వాసుదేవరెడ్డి ఇప్పటికే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.ఐఆర్ టీఎస్ అధికారిగా ఉన్న డి.వాసుదేవరెడ్డిపై జరుగుతున్న విచారణ దృష్ట్యా డిప్యుటేషన్‌పై ఏపీలోకొనసాగించేందుకు అనుమతిస్తూ రైల్వేశాఖ ఏపీ ప్రభుత్వానికి >>7

## ప్రజాస్వామ్యానికి బిజెపి తూట్లు

### మార్చి 23 నుంచి దేశవ్యాప్త ఉద్యమం: సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా




శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డి.రాజా

**విశాఖపట్నం, జనవరి 31, ప్రభాతవార్త :** కేంద్రంలో ప్రజావ్యతిరేక పాలన సాగుతోందని, ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తోందని మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెడుతున్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని దీనికోసం వామపక్ష, లౌకికపార్టీలతో కలిసి పనిచేస్తాయని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా వెల్లడించారు. విశాఖలో గురు, శుక్రవారాల్లో జరిగిన పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశాల అనంతరం శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రజావ్యతిరేక పాలనపై భగత్ సింగ్ వర్ధంతి మార్చి 23వ తేదీ నుంచి అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14 వరకు దేశవ్యాప్తంగా రాజకీయ ప్రచార ఉద్యమాన్ని నిర్వహిస్తామని తెలియజేశారు. దేశంలో ప్రజల మధ్య ఐక్యత, శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలంటే బిజెపిని అధికారం నుంచి దించాలని అన్నారు. సిపిఐ శతజయంతి ఉత్సవాల సందర్భంగా విజయవాడలో డిసెంబర్ 24, 25 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తామని, దీనికి ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో ఉన్న కమ్యూనిస్టు పార్టీల ప్రతినిధులను ఆహ్వానిస్తామని తెలిపారు. డిసెంబర్ 25న శతవార్షికోత్సవాల ముగింపు సభను ఖమ్మంలో నిర్వహించనున్నట్టు చెప్పారు. దేశంలో ప్రస్తుతం సంక్లిష్ట పరిస్థితులు నెలకొన్నాయని, ఆర్థిక పరిస్థితి అధ్వానంగా ఉందని, విదేశీ అప్పు 700 బిలియన్ డాలర్లకు చేరుకుందని, రూపాయి విలువ భారీగా పడిపోతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగం పెరిగి యువతలో నిస్పృహ అలుముకుంటోందని, ధరలు విపరీ తంగా పెరుగుతున్నాయని బిజెపి చెపుతున్న వికసిత భారత్ ఎక్కడా కనిపించడం లేదని రాజా విమర్శించారు. రైతు ప్రయోజనాలకు వ్యతి రేకంగా మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చిందని, కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను అనుసరి స్తోందని తెలిపారు. బిజెపి పాలనలో రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి పెనుముప్పు మంచి ఉందని, దేశ ప్రజలు రాజ్యాంగాన్ని, ప్రజాస్వా మ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌పై >>7

# 'శారీ' సెకండ్ లిరికల్ వీడియో సాంగ్

విలక్షణ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ లేటెస్ట్ మూవీ శారీ లాగ్ లైన్: టూ మచ్ లవ్ కెన్ బి స్కేరీ. గిరి కృష్ణకమల్ దర్శకత్వంలో,ఆర్జీవిఆర్వి ప్రొడక్షన్స్ ఎల్ఎల్పి బ్యానర్‌పై ప్రముఖ వ్యాపారవేత్త రవి శంకర్ వర్మ నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా మూవీగా తెలుగు, హిందీ, తమిళ, మరియు మళయాళ భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. సత్య యాదు, ఆరాధ్య దేవి హీరో హీరోయిన్లుగా పలు నిజజీవిత సంఘటనల ఆధారాలతో సైకలాజికల్ థ్రిల్లర్‌గా శారీ మూవీ రూపొందుతోంది. శారీ చిత్రానికి సంబంధించిన సెకండ్ లిరికల్ వీడియో సాంగ్ ఎగిరే గువ్వలాగా.. విడుదల చేసారు. ఆర్జీవీ డెన్ మ్యూజిక్ ద్వార సెకండ్ లిరికల్ సాంగ్ ఎగిరే గువ్వలాగా... రిలీజ్ చేసామని రామ్ గోపాల్ వర్మ తెలిపారు. ఈ పాట రాకేష్ పనికెళ్ళ ట్యూన్ చేసి లిరిక్ కూడా అతనే ఇచ్చాడని, పాటలో సాహిత్యం ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని, ఈ పాటను సింగర్ సాయి చరణ్ పాడారని ఆయన తెలిపారు. నిర్మాత రవి శంకర్ వర్మ మాట్లాడుతూ, మా శారీ చిత్రంలోని తొలి లిరికల్ సాంగ్ ఇటీవల విడుదల చేసిన ఐ వాంట్ లవ్‌కి విశేష స్పందన లభించింది. సెకండ్ లిరికల్ సాంగ్ ఎగిరే గువ్వలాగా... రిలీజ్ చేసాము. ఇంకా హిందీ, తమిళ, మళయాళ భాషల్లో కూడా ఈ సెకండ్ లిరికల్ సాంగ్ విడుదల చేసాము. ప్రస్తుతం సెన్సార్ కార్య క్రమాలు జరుగుతున్నాయ్, కొన్ని అనివార్య కారణాల వలన విడుదల ఆలస్యం అయింది త్వరలోనే విడుదల తేది ప్రకటిస్తాము అన్నారు.

బ్యానర్: ఆర్జీవీ ఆర్వీ ప్రొడక్షన్స్ ఎల్ఎల్పి, నటీనటులు: సత్యా యాదు, ఆరాధ్య దేవి, సాహిల్ సంభవాల్, అప్పాజీ అంబరీష్, కల్పలత తదితరులు, సినిమాటో గ్రఫీ: శబరి, మ్యూజిక్: రాకేశ్ పనికెళ్ళ, పాట రచన, బాణీ: రాకేశ్ పనికెళ్ళ, నిర్మాత: రవి శంకర్ వర్మ, దర్శకత్వం: గిరి కృష్ణ కమల్.



# 'తండేల్'లో నటించడం నా అదృష్టం: నాగ చైతన్య

యువ సామ్రాట్ అక్కినేని నాగచైతన్య, స్టార్ హీరోయిన్ సాయి పల్లవి జంటగా నటించిన చిత్రం 'తండేల్'. 'కార్తికేయ2' లాంటి బంపర్ హిట్ కొట్టిన డైరెక్టర్ చందూ మొండేటి దర్శకత్వంలో సక్సెస్‌ఫుల్ మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ సమర్పణలో గీతాఆర్ట్స్ బ్యానర్‌పై ఫ్యాషనేట్ ప్రొడ్యూసర్ బన్నీవాసు నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 7న ప్రపంచ వ్యాప్తంగా భారీగా విడుదల కానుంది. చిత్ర యూనిట్ ఇప్పటికే ప్రమోషన్స్ ఓ రేంజ్‌లో చేస్తుంది. తాజాగా గురువారం ఈ మూవీ తమిళ ట్రైలర్‌ను చెన్నైలో విడుదల చేశారు. కోలీవుడ్ స్టార్ కార్తి ముఖ్య అతిథిగా హాజరై ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజ్, డైరెక్టర్ వెంకట్ ప్రభు సహా చిత్ర యూనిట్ పాల్గొన్నారు. ఈ చిత్రాన్ని తమిళంలో డ్రీమ్ వారియర్ పిక్చర్స్ డిస్ట్రిబ్యూట్ చేస్తోంది. ఈ సందర్భంగా, డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ఎస్.ఆర్.ప్రభు మాట్లాడుతూ, ఇప్పుడు మన ఇండియన్ సినిమాల్లో భాషా పరమైన హద్దులు చెరిగిపోతున్నాయి. అందుకు సినిమాలకు పెడుతున్న టైటిల్స్.. వాటిని ఆదరిస్తోన్న ప్రేక్షకులే. బాహుబలి రిలీజ్ తర్వాత మనకు ఇది అలవాటుగా మారిపోయింది. బాహుబలి రిలీజ్ సమయంలో ఆ టైటిల్ అర్థమేంటని ఎవరూ అడగలేదు. ఇప్పుడు తండేల్ సినిమా విషయంలోనూ అలాగే ఎవరూ టైటిల్‌కు అర్థమేంటని ఎవరూ అడగటం లేదు. ప్రేక్షకులు సినిమాకు మంచి ఆదరణను చూపిస్తున్నారు. 'తండేల్' అంటే లీడర్ అని అర్థం. ఆ విషయాన్ని మనం ట్రైలర్‌లోనే చూపించారు. సినిమాను ఎంతో ప్యాషనేట్‌గా ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా తెరకెక్కించారని చూస్తుంటేనే అర్థమవుతుంది. ఇక ఈ మూవీని తమిళంలో విడుదల చేసే అవకాశం కలిగించిన అల్లు అరవింద్‌కి థాంక్స్. కానీ ఆయన ఐదు దశాబ్దాలుగా నిర్మాతగా కొనసాగుతున్నారు. ఇది సాధారణమైన విషయం కాదు. ఎన్నో గొప్ప సినిమాలను నిర్మించిన సినిమాను తెలుగులో విడుదల చేసే అవకాశం మాకు ఇచ్చినందుకు అరవింద్‌కి థాంక్స్. నేను నాగచైతన్యగారితో కలిసి పని చేయాలని అనుకుంటాను. అందుకని నేను కథలు విన్న ప్రతీసారి వాటిని చైతన్యకి పంపుతుంటాను. సాయిపల్లవి ఓ సినిమా చేసిందంటే చాలా మంచి సినిమా అయ్యుంటుందనే నమ్మకాన్ని ఆమె ఈరోజు అందరి మనసుల్లో సంపాదించుకున్నారు. తండేల్ ఆ కోవలో ప్రేక్షకులను మెప్పిస్తుందని గట్టిగా నమ్ముతున్నాను. ఇందులో నటించిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు అభినందనలు. దర్శకులు చందూ మొండేటికి, మ్యూజిక్ డైరెక్టర్ దేవిశ్రీప్రసాద్‌గారికి థాంక్స్. ప్రేమకథా చిత్రాలకు సంగీతాన్ని అందించటానికి మ్యూజిక్ డైరెక్టర్స్ ఎప్పుడూ ప్రత్యేకమైన ఆసక్తిని చూపిస్తుంటారు. దేవిశ్రీ తనదైన శైలిలో అద్భుతమైన సంగీతాన్ని అందించారు. ఫిబ్రవరి 7న తండేల్ సినిమా రిలీజ్ అవుతోంది. తప్పకుండా సినిమా అందరినీ మెప్పిస్తుంది అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ, తండేల్ సినిమాను డైరెక్టర్ చందూ మొండేటి, నిర్మాత బన్నీ వాసు వన్ లైనర్స్‌గా చెప్పినప్పుడు ఎంతగానో నచ్చేసింది. ఓ ఇంట్రెస్ట్ క్రియేట్ అయ్యింది. అది సినిమా అంతా కొనసాగుతూ వచ్చింది. ఈ జర్నీని నేను ఎంతో ఎంజాయ్ చేశాను. అల్లు అరవింద్‌గారికి నేను చిన్నప్పటి నుంచే తెలుసు. చాలా మంచి వ్యక్తి. ఆయనకు స్పెషల్ థాంక్స్. చైతన్య నాకు చాలా మంచి స్నేహితుడు. ఈ సినిమా కోసం తను పూర్తిగా మారారు. తన పోస్టర్‌ను ముందుగా చూసినప్పుడు ఇది నాకు తెలిసిన చైతన్య కాదే అనిపించింది. చాలా కష్టపడ్డారు. సాయి పల్లవి పేరు చెబితే చాలు. అద్భుతంగా నటించింది. ఆమె డాన్స్‌కు నేను పెద్ద అభిమానిని. విజువల్స్ చాలా గొప్పగా ఉన్నాయి. చక్కటి కథ. ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా వచ్చిన కార్తికి థాంక్స్. వెంకట్ ప్రభు, కార్తీక్ సుబ్బరాజ్‌కి థాంక్స్. వివేకన్ అద్భుతమైన లిరిక్స్‌ను అందించారు. ట్యూన్స్‌కు ఆయన తన సాహిత్యంతో ప్రాణం పోశారు. తండేల్ చిత్ర యూనిట్‌కు స్పెషల్ థాంక్స్. సినిమాను ఫిబ్రవరి 7న థియేటర్స్‌లో చూసి ఎంజాయ్ చేయండి అన్నారు. హీరోయిన్ సాయి పల్లవి మాట్లాడుతూ, మా తండేల్ చిత్ర యూనిట్‌ను ఆశీర్వదించటానికి ఇక్కడకు వచ్చిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు. ఈ కథను ఓ రియల్ స్టోరీలాగా ముందుగా చెప్పారు. తర్వాత దాన్ని అందమైన ప్రేమ కథగా మార్చారు.




# ఒకప్పుడు ఐఏఎస్..ఇప్పుడు హీరోయిన్

డాక్టర్ కాబోయి..యాక్టర్ అయ్యాను అనే సామెత చాలాకాలం నుంచి మనం వింటూనే ఉన్నాం. కానీ ఓ హీరోయిన్ కలెక్టర్ కాబోయి హీరోయిన్‌గా మారింది. ఆ హీరోయిన్ మరెవ్వరో కాదు రాశి ఖన్నా. అవును ఇది నిజం. రాశి ఖన్నా కలెక్టర్ కాబోయి హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. ఆ వివరాల్లోకి వెళ్తే, రాశి ఖన్నా 1990 నవంబరు 30న న్యూఢిల్లీలో జన్మించారు. రాశి ఖన్నా మొదటి నుంచి కూడా బ్రిలియంట్ స్టూడెంట్. స్కూల్లో, కాలేజీలో టాపర్. మధ్యతరగతి కుటుంబానికి చెందిన రాశి ఖన్నా,తొలుత ఉద్యోగం చేయలని భావించింది. అందుకే కలెక్టర్ చదవాలని కోరుకుంది. కొంతకాలం ట్రైనింగ్ తీసుకొని పరీక్షలు కూడా రాసింది. కానీ విఫలం అవ్వడంతో ఆ తర్వాత నటనపై ఆసక్తి పెంచుకొని సినీ రంగం వైపు అడుగులు వేసింది.రాశి ఖన్నా తెలుగు, తమిళం, హిందీ సినిమాలలో నటించారు. ఆమె తన అందం, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఊహలు గుసగుసలాడే సినిమాతో తెలుగు ఇండస్ట్రీకి పరిచయమైంది. మొదటి సినిమాతోనే మంచి మార్కులు కొట్టేసింది. జోరు, జిల్, బెంగాల్ టైగర్, శివం, సుప్రీం, హైపర్, జై లవ కుశ, టచ్ చేసి చూడు, తొలిప్రేమ, శ్రీనివాస కళ్యాణం తదితర సినిమాల్లో నటించారు.అందానికి అందం, టాలెంట్‌కు టాలెంట్ రాశి ఖన్నా సొంతం. కెరీర్ స్టార్ చేసి పుష్కరకాలం అయినప్పటికీ అమ్మడు కెరీర్‌లో పెద్దగా హిట్లు లేవనే చెప్పాలి. కారణాలు తెలియదు కానీ స్టార్ హీరోలతో నటించే అవకాశం రాశి ఖన్నాకు దక్క లేదనే చెప్పాలి. ఎన్టీఆర్ మినయిస్తే మిగిలిన హీరోలెవ్వరూ కూడా రాశి ఖన్నా వైపు కన్నెత్తి చూడలేదు పోలవరంపై కేంద్రం సంచలన ప్రకటన ఇక సెకండ్ గ్రేడ్ హీరోలతో రాశి ఖన్నా నటించిన సినిమాలన్నీ కూడా బాక్సాఫీస్ వద్ద బొల్తా కొట్టాయి. దీంతో బాలీవుడ్ బాట పట్టిన ఈ అమ్మడుకు అక్కడ కూడా నిరాశే ఎదురైంది. బాలీవుడ్‌లో బికినీ, లిప్‌లాక్ వంటి సన్నివేశాల్లో నటించినప్పటికీ పెద్దగా లాభం లేకపోయింది. రాశి ఖన్నా ప్రస్తుతం హిందీలో వెబ్ సిరీస్‌తో పాటు యోధ సినిమాలో యాక్ట్ చేస్తోంది. తెలుగులో పద్ధతి కనిపించే రాశి ఖన్నా.. బాలీవుడ్‌లో మాత్రం హాట్‌గా కనిపిస్తోంది. అక్కడి హీరోలతో లిప్‌లాక్‌లు ఇస్తూ రెచ్చిపోతుంది. ఇలా ఐఏఎస్ కావాల్సిన రాశి ఖన్నా హీరోయిన్‌గా మారింది.




# స్ట్రీమ్ కానున్న 'కాఫీ విత్ ఏ కిల్లర్'

ఆర్ పి పట్నాయక్ కథ రచనా దర్శకత్వంలో సెవెన్ హిల్స్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సతీష్ నిర్మాతగా ఆహా ఓటిటిలో ప్రేక్షకులకు అందుబాటులో ఉండనున్న చిత్రం కాఫీ విత్ ఏ కిల్లర్. టెంపర్ వంశీ, శ్రీనివాసరెడ్డి, సత్యం రాజేష్, రవిబాబు, అంబటి శ్రీను, శ్రీరాప, జెమిని సురేష్ తదితరులు కీలకపాత్ర పోషిస్తున్న ఈ చిత్రం క్రైమ్ జోనర్ లా అనిపి స్తుంది. అనుష్ గోరక్ ఈ చిత్రానికి డిఓపి, ఎడిటర్, డిఐగా వ్యవహరించగా తిరుమల డైలాగులు రాశారు. ఆహాలో స్ట్రీమ్ కానున్న సందర్భంగా ఈ చిత్ర యూనిట్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఈ విధంగా స్పందించారు. ఈ సందర్భంగా నటుడు అంబటి శ్రీను మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. ఈ చిత్రం చాలా అద్భుతంగా ఉండబోతుంది. మంచి కాఫీ తాగే ఫీల్ కలిగిస్తుంది. ఈ చిత్రంలో నాకు మంచి పాత్రను ఇచ్చిన ఆర్ పి పట్నాయక్‌కి నా కృతజ్ఞతలు. ఆయన అంటే నాకు ఎంతో అభిమానం. నేను ఆయన పాటలకు వీరాభిమానిని. ఆర్‌పి పట్నాయక్ అభిమానులు ఆయన నుండి ఒక యూత్ ఫుల్ లవ్ స్టోరీ రావాలని కోరుకుంటున్నారు. అలాగే ఈ చిత్రం నిర్మాత సతీష్‌కి, గౌతం పట్నాయక్‌కి నా కృతజ్ఞతలు. ఈ సినిమాలో నటించిన నటీనటులు ఎవరికీ కూడా ఈ చిత్ర కథ ఏంటి అనేది తెలీదు. కాబట్టి చిత్రాన్ని అందరూ తప్పకుండా ఆహ్వానం చూసి ఎంజాయ్ చేయండి అన్నారు. నటి శ్రీరాప మాట్లాడుతూ, మీడియా వారికి పెద్దలకు అందరికీ నమస్కారం. కాఫీ విత్ ఏ కిల్లర్ సినిమా గురించి మాట్లాడాలి అంటే ముందుగా నేను గౌతమ్ గురించి మాట్లాడాలి. ఆయన ఈ చిత్రానికి ఎంత ముఖ్యమైన వ్యక్తి. నాకు ఈ చిత్రంలో నటించే అవకాశం ఇచ్చిన వారికి నా కృతజ్ఞతలు. అలాగే ఆర్ పి పట్నాయక్ అంటే తెలియని వారు లేరు. ఆయన సంగీత దర్శకుడుగా అలాగ దర్శకుడిగా ఎంతో మంచి పేరు ఉన్న వ్యక్తి. ఆయన దర్శకత్వంలో పనిచేయడం ఎంతో ఆనందంగా అనిపించింది అన్నారు. నటుడు జెమిని సురేష్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. ఈ చిత్రంలో నటించిన నేను ఎంతో అదృష్టంగా భావిస్తున్నాను. నేను ఈ చిత్రంలో కాఫీ షాప్ మేనేజర్ పాత్ర పోషిస్తున్నాను. సినిమా అంతా నా చుట్టూ తిరుగుతూనే ఉంటుంది. ఈ సినిమాలో కిల్లర్ ఎవరు? ఎవరిని చంపుతాడు? అనే విషయాలు తెలుసుకోవాలంటే ఖచ్చితంగా ఆహాలో ఈచిత్రాన్ని చూడాల్సిందే. ఈచిత్రం ఎంతో ప్రత్యేకం. తెలుగుచిత్ర పరిశ్రమలో ఉన్న ఎంతోమంది కమెడియన్స్ అంతా కలిసి చాలా కాలం తర్వాత నటించిన చిత్రం. చిత్రంలో ప్రతి సీన్ ఎంటర్టైన్మెంట్‌గా ఉంటుంది. చిత్రానికి సాంకేతిక బృందం ఎంతో ప్రత్యేకమైనది. ఈ చిత్రానికి పని చేసిన సాంకేతిక నిపుణులు అందరూ చాలా టాలెంటెడ్. ఈ రోజుల్లో ఒక సినిమా తీసి బయటికి వెళ్లాలంటే ఎంతో ఛాలెంజ్ అయిపోయింది. అటువంటి పరిస్థితుల్లో సతీష్ ఈ చిత్రాన్ని నిర్మించి ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు. ఈ చిత్రంలో నా పాత్ర మీకు గుర్తుండిపోతుంది. అలాగే ఎన్నో మంచి సినిమాలు అందిస్తున్న ఆహాలో ఈ చిత్రం ఇంకా మంచి సినిమాగా నిలిచిపోతుంది. ఈ చిత్ర టీం అందరికీ నా ధన్యవాదాలు అన్నారు. నిర్మాత సెవెన్ హిల్స్ సతీష్ మాట్లాడుతూ, మా ఆహ్వానాన్ని మన్నించి ఇక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు. ఒక మంచి సినిమా చేశాము. అందరికీ ఎంతో ఇష్టమైన సంగతి దర్శకుడు అలాగే ప్రతిసారి ప్రత్యేకమైన చిత్రాలతో ప్రేక్షకులకు ముందుకు వచ్చే దర్శకుడు ఆర్పి పట్నాయక్. ఆయన చేసిన చిత్రం ఈ కాఫీ విత్ ఏ కలర్ నేటినుండి ఆహాలో స్ట్రీమ్ అవుతుంది. రెండు గంటలపాటు మిమ్మల్ని ఎక్కడికి కదలకుండా చేసే ఒక ప్రత్యేకమైన చిత్రంగా ఉండబోతుంది. తిరుమల నాగ్ డైలాగ్స్ చాలా బాగుంటాయి. శ్రీనివాస్ రెడ్డి పాత్ర ఎంతో అద్భుతంగా ఉండబోతుంది. ఈ చిత్రానికి సాంకేతిక బృందం చాలా కష్టపడి పనిచేశారు.




# 'అగత్యా' రిలీజ్ డేట్ పోస్ట్‌పోన్

కోలీవుడ్ నటుడు జీవా, యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా నటిస్తున్న తాజా చిత్రం 'అగత్యా'. వేల్స్ ఫిలిం ఇంటర్నేషనల్ పతాకంపై ఐసరి గణేష్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ప్రముఖ గీత రచయిత పా.విజయ్ కథ, దర్శకత్వ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంతో పాటు మంచి థ్రిల్లింగ్ కాన్సెప్ట్‌తో రూపొందుతున్న ఈ సినిమాలో రాశీఖన్నా హీరోయిన్‌గా నటిస్తోంది. ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నుంచి రీసెంట్‌గా విడుదలైన సెకెండ్ సాంగ్ బాగా ఆకట్టుకుంది. నేలమ్మ తల్లి అంటూ సాగే ఈ పాట అర్జున్‌ను హైలెట్ చేస్తూ ఉంది. జీవా నటించిన గత చిత్రం బ్లాక్ కూడా మంచి విజయం అందుకుంది. ఇప్పుడు అగత్యాతో తమిళం, తెలుగు, హిందీ ప్రేక్షకులను పలకరించేందుకు రెడీ అవుతున్నారు. ఈ సినిమా అద్భుతమైన సీజీ వర్క్‌తో భారీ బడ్జెట్‌తో తెరకెక్కనుంది. ఇందులో మన సంస్కృతి, మానవ అనుబంధాలను దర్శకుడు బలంగా స్పృశిస్తున్నారు. మార్వెల్ చిత్రాల తరహాలో ఒక కొత్త ప్రపంచాన్ని సృష్టించి ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని కలిగించేందుకు చిత్ర యూనిట్ కృషి చేస్తోంది. ఈ నేపథ్యంలో వీఎఫ్ఎక్స్ వర్క్ కోసం మరికొంత సమయం కేటాయించాలని భావించిన మేకర్స్.. సినిమా విడుదలను జనవరి 31 నుంచి ఫిబ్రవరి 28కి పోస్ట్ పోన్ చేసినట్లు అధికారికంగా ప్రకటించారు. అవేంజర్స్ తరహాలో ప్రేక్షకులను వేరే ప్రపంచానికి తీసుకెళ్లే ఊహాత్మక కథ చిత్రంగా ఉంటుందని మేకర్స్ తెలిపారు.



# నిర్మాత వేదరాజు టింబర్ మృతి

అల్లరి నరేష్‌తో 'మడత కాజా', 'సంఘర్షణ' వంటి చిత్రాలను నిర్మించిన నిర్మాత వేదరాజు టింబర్ (54) శుక్రవారం ఉదయం స్వర్గస్తులయ్యారు. సినిమాలపై ఇష్టంతో ఓ వైపు కన్‌స్ట్రక్షన్ రంగంలో బిజీగా ఉంటూనే మరోవైపు సినిమాలను నిర్మించిన నిర్మాత వేదరాజు టింబర్. త్వరలో మరో చిత్ర నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్న సమయంలోనే ఈ సంఘటన జరిగింది. గత కొంతకాలంగా ఊపిరితిత్తులకు సంబంధించిన అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఎ ఐ జి హాస్పిటల్‌లో ఆయన చికిత్స తీసుకుంటున్నారు. త్వరలోనే కోలుకుని వస్తారు అని సన్నిహితులు, కుటుంబ సభ్యులు భావిస్తున్న తరుణంలో ఇలా జరగటం వారందరిలో విషాదాన్ని నింపింది. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. అంత్య క్రియలు శుక్రవారమే జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.



# హర్యానా భామకు తెలుగులో మరో ఛాన్స్

హర్యానా భామ యుక్తి తరేజాకు తెలుగులో ఓ మంచి ఛాన్స్ దక్కింది. తను హీరోయిన్‌గా నటించిన మలయాళీ సినిమా మార్కో భారీ హిట్‌గా నిలిచింది. ఆ సినిమా హిట్ అవడంతో యుక్తికి ఇప్పుడు తెలుగులో మరో అవకాశం దక్కింది. ఎందుకంటే యుక్తి తరేజా ఇప్పటికే తెలుగులో ఓ సినిమా చేసింది. కానీ ఆ సినిమా హిట్ కాకపోవడంతో తర్వాత టాలీవుడ్ లో కనిపించకుండా పోయింది. నాగశౌర్య హీరోగా 2023లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన రంగబలి సినిమాలో యుక్తినే హీరోయిన్. రంగబలి సినిమా తర్వాత యుక్తికి తెలుగులో వరుస ఆఫర్లు వస్తాయని అందరూ అనుకున్నారు కానీ అమ్మడికి లక్ కలిసిరాకపోవడంతో టాలీవుడ్ నుంచి ఆఫర్లు రాలేదు. ఈ గ్యాప్‌లో యుక్తి మలయాళంలో చేసిన మార్కో సినిమా రీసెంట్‌గా రిలీజై మంచి హిట్ అందుకుంది. ఇప్పుడు మార్కో సినిమా హిట్ అవడంతో అందరి ఫోకస్ యుక్తి తరేజా వైపు మళ్లింది. ఈ నేపథ్యంలో అమ్మడిని కిరణ్ అబ్బవరం సినిమాలో హీరోయిన్‌గా ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. రాజేష్ దండా నిర్మించనున్న కె ర్యాంప్ సినిమా కోసం యుక్తిని తీసుకున్నట్లు సమాచారం. కె ర్యాంప్ కథ బాగా వచ్చిందని ఆల్రెడీ టాక్ వినిపిస్తుంది. ఈ సినిమా కూడా హిట్ అయితే యుక్తికి తెలుగు నుంచి అవకాశాలు క్యూ కట్టే ఛాన్సుంది. 2019లో మోడలింగ్‌తో కెరీర్ ను స్టార్ట్ చేసిన అమ్ముడు తర్వాత ఎంటీవీ సూపర్ మోడల్ ఆఫ్ ది ఇయర్‌లో 4వ ప్లేస్ సాధించి అందరినీ ఆకర్షించింది. తర్వాత ఎన్నో కమర్షియల్ యాడ్స్‌లో నటించగా ఆ టైమ్‌లోనే యుక్తికి నాగశౌర్య సరసన నటించే అవకాశం దక్కింది. హర్యానాకు దగ్గరలోని కైతల్ ప్రాంతంలో పర్వీన్ తరేజా, రీటా తరేజా జంటకు 2000వ సంవత్సరంలో జన్మించిన యుక్తి తరేజా యాక్టింగ్‌పై ఉన్న ఇంట్రెస్ట్ తో మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత ఇమ్రాన్ హాష్మీ చేసిన లూట్ గయే మ్యూజిక్ ఆల్బమ్ లో మొదటిసారిగా కనిపించింది. ఆ సాంగ్ లో తనకు స్క్రీన్ స్పేస్ తక్కువైనప్పటికీ తర్వాత మాత్రం అమ్మడికి పలు ఆఫర్లు దక్కాయి.





# అరబ్‌లో తెలగమ్మాయి ఘనత!




ఈ కాలం పిల్లలు మొబైల్, వీడియోగేములంటూ కాలక్షేపం చేస్తారు. చుట్టూ ఉండే ప్రపంచాన్ని పట్టించుకోరు అనేది చాలామంది ఫిర్యాదు. అలాంటి వాళ్లకి అక్కినేని మోనికని చూపించాలి. ప్రపంచ సమస్యలు, పర్యావరణం గురించి ఆలోచించడమే కాదు... వాటికి పరిష్కారం చూపి, అరుదైన పురస్కారాన్నీ అందించింది. మోనికా స్వస్థలం ఏలూరు. అమ్మ స్వీటీ, నాన్న భూపేష్, తండ్రి వృత్తిరీత్యా ఈమె కుటుంబం అబుదాబిలో స్థిరపడింది. అక్కడి మెర్రీలాండ్ ఇంటర్నేషనల్ స్కూల్లో పదో తరగతి చదువుతోంది. మోనిక సస్టెయినబిలిటీ అంటే ఆసక్తి దానికి సంబంధించి పరిశోధనలు చేస్తూనే ఉంటుంది. నీటిలో దొరికే ఆల్గేతో కర్బన ఉద్గారాలు తగ్గించేలా ప్రాజెక్టులూ చేసింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్... ఏటా 'జాయెద్ సస్టెయినబిలిటీ ప్రైజ్'లు అందుకున్నారు.. ప్రపంచ పర్యావరణానికి సంబంధించి సవాళ్లకు పరిష్కారాలు చూపినవారికి వీటిని అందిస్తారు. వివిధ కేటగిరీలూ ఉంటాయి. ప్రపంచ దేశాలకు చెందినవారు ఈ పోటీలో పాల్గొంటారు. విద్యార్థులూ తమ ఆలోచనలను పంచుకోవచ్చు. దానికి తన ఆలోచనను పంపింది మోనిక ఇల్లు, తరగతులు వంటి చోట్ల కర్బన ఉద్గారాలు తగ్గించి, స్వచ్ఛమైన గాలిని అందించాలనే ప్రతిపాదన. గతంలో అల్గేతో నేను చేసిన ప్రాజెక్టునే ఇందుకు ఉదాహరణ. నా ఆలోచన 'జాయేద్ సస్టెయినబిలిటీ'కి ఎంపికైంది. అయితే తరవాతి దశలో అది ప్రయోగాత్మకంగా ఎలా నిరూపితమవుతుందో రుజువు చేయాలి. దీనితో స్కూలు సాయంతో ఓ సంస్థతో కలిసి పనిచేశా. ఈసారి అల్గేతోపాటు కొబ్బరిపీచు, సహజ రబ్బరులను ఉపయోగించి బయోడిగ్రేడబుల్ టైల్స్ రూపొందించబడింది. ఇవి మనం వదిలే కార్బన్ డై అక్సైడ్ని పీల్చుకోవడమే కాదు... గాలి స్వచ్ఛతనూ పెంచుతాయి' అంటోంది 15 ఏళ్ల మోనిక ప్రపంచవ్యాప్తంగా ఆరువేల మందికి దరఖాస్తు చేసుకుంటే తుది పోటీకి 33 మంది ఎంపికయ్యారు. అందులో మోనిక ఒకరు. దీని కోసం ఈ అమ్మాయి అయిదు నెలలు కష్టపడింది. ప్రయోగాత్మకంగా స్కూల్లోనూ ఉపయోగించి విజయం సాధించింది. తాజాగా తన 'బయోడిగ్రేడబుల్ టైల్స్' జాయేద్ స్టెయినబిలిటీ నుంచి బెస్ట్ కాన్సెప్ట్ ఆఫ్ ద ఇయర్ అవార్డునూ దక్కించుకుంది. యూఏఈ ప్రెసిడెంట్ షేక్ మొహమ్మద్ బిన్ జాయేద్ అల్ నహ్యాన్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకుంది మోనిక చిన్నవయసులో పర్యావరణ హితం కోసం ఆలోచిస్తూ అందరిచేతా శభాష్ అనిపించుకుంటోంది. భవిష్యత్తులో డాక్టర్ అవ్వాలన్నది తన కల. □

# సవాళ్లే పాఠాలు నేర్పాయి!



**ఏటా రైలు పట్టాల్ని పనిచెయ్యడానికి వందల కోట్లు ఖర్చవుతుందట. కానీ జవ్వాది వెంకట అనూష చాలా తక్కువ మొత్తంతో ఆ పని పూర్తి చేసారు.** ఇదొక్కటే కాదు... ఇలాంటి ఎన్నో అసాధ్యాలను, సాధ్యం చేశారు. ఇందుకుగాను 63వ రైల్వే సేవా పురస్కారాల్లో ఆమె 'అతి విశిష్ట రైల్వే సేవా పురస్కారం' అందుకున్నారు. రైల్వేలో ఏ పని జరగాలన్న అనుమతులు, బడ్జెట్ నిధులు అంటూ ప్రతిదానికీ వేచి చూడాలి. వేల మొత్తంతో ఏ పని జరగదు. రూ.కోట్లు కావాలి. అందుకే ఈ జాప్యం.అయితే నా స్థాయిలోనైనా ఇది మారాలనుకున్నా. 15 ఏళ్లుగా ప్రయత్నించనే ఉన్నా. అందులో ఒకటే ఇది. రైళ్ల రాకపోకలతో పట్టాల కింద ఉన్న మట్టి వదులైపోతుంది. సంవత్సరానికోసారైనా దానికి ఫార్మేషన్ ట్రీట్మెంట్ చేయాలి. అప్పుడు ఒక కి.మీ.కి రూ.56 లక్షల వరకు ఖర్చవుతుంది. కానీ నేను జియోగ్రిడ్, జియోసెల్ ఉపయోగించి, రూ.3 లక్షల పూర్తి చేయొచ్చని ప్రయోగాత్మకంగా నిరూపించాను. ఈ వంటలలో మట్టిపై ఐరన్ గ్రిడ్స్ వేస్తారు. దాంతో పాటూ పాయింట్లు, క్రాసింగ్‌లు మార్చడానికి టి.28 మెషీన్లను వాడేవాళ్లం. సాధారణ క్రేన్లను ఉపయోగించే ఆ పని పూర్తి చేశాను. దీనివల్ల 80-90 శాతం ఖర్చు తగ్గింది. సమయమూ ఆదా అయ్యింది. రైల్వే సేవా పురస్కారాన్ని అందుకోవడానికి ఇవే కారణాలు అని అనూష, ఈ రెండు అమలైతే రైల్వేకు రూ.వందల కోట్లు ఆదా అవుతుంది. ఇవే కాదు, బ్రహ్మపుత్ర నదిపై వంతెన,



రాజమహేంద్రవరం యార్డు రీమోడలింగ్, రెండు గూడ్స్ రైళ్ల ఒకేసారి ట్రాక్ మీద ఉండే విధంగా బిక్కవోలులో లాంగర్లూ నిర్మించారు. ఇందుకు రెండుసార్లు జీఎం అవార్డునూ అందుకున్నారు. ప్రస్తుతం గుంటూరు రైల్వే డివిజన్‌కి సీనియర్ డివిజనల్ ఇంజినీరు(కోఆర్డినేషన్)గా పనిచేస్తున్నారు. దేశంలో ఈ బాధ్యత చేపడుతున్న తొలి మహిళ కూడా అనూషనే. అయితే ఇవన్నీ సాధించడానికి కారణం తన వృత్తి ప్రారంభంలో పడిన బలమైన పునాదులేనంటారు. ఈమె సొంతూరు పిఠాపురం, ఉస్మానియా యూనివర్సిటీ నుంచి సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. నా మొదటి పోస్టింగ్ అసోంలో, అక్కడి పరిస్థితులు అంత సానుకూలంగా ఉండవు. కమ్యూనికేషన్ సరిగ్గా ఉండేది కాదు. క్షేత్రస్థాయిలో పనిచేసే వాళ్లలో ఒక తెగకు చెందిన వారే ఎక్కువ. ఆడపిల్ల మాకు చెప్పడం ఏంటి అన్నట్లు చూసేవారు. వీటన్నింటిని అధిగమించ డానికి చాలా సమయమే పట్టింది. కొన్ని సార్లు ఒత్తిడిగానూ అని పించేది. కానీ దీని ప్రభావం విధులపై పడకుండా జాగ్రత్త పడ్డాను. ఆరేళ్లు అక్కడే పనిచేశా. పనిపట్ల నిబద్ధత, నాయకత్వ లక్షణాలు, వినూత్న ఆలోచనలూ అన్నీ అసోం అనుభవాల నుంచి నేర్చుకున్న పాఠాలే. తర్వాత విజయవాడలో పని చేశా. ఇప్పుడు గుంటూరు, నాకు ఇద్దరు పిల్లలు, మావారు జవ్వాది వెంకట నాగ సుబ్రహ్మణ్యం, ఐఏఎస్, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు డెప్యూటేషన్‌పై ఢిల్లీ వెళ్లారు.వృత్తిరీత్యా ఇద్దరం పిల్లలకు అందుబాటులో లేమనే బాధ వెంటాడుతూ ఉంటుంది. కానీ వాళ్లు నా పరిస్థితిని అర్థం చేసుకున్నారు. నేను సివిల్ ఇంజినీరింగ్‌లోకి రావడానికి నాన్నే కారణం. అయితే దీన్లో రాణించడానికి అమ్మ అందిం చిన సాయం మరచిపోలేనిది. నా పిల్లల్ని చూసుకోవడానికి ఆమె తన లా ప్రాక్టీసీని వదులు కున్నారు. సహకారంతోనే ముందుకెళ్తున్నా' అంటారు అనూష. □

# మగువ సౌకర్యమే ఫ్యాషన్!

ఫ్యాషన్ ఫ్యాషన్



ఫ్యాషన్.. మహిళలు.. అలాగే చూడటం కష్టం కదూ! అన్నట్టు ఈ మనం మనసుపడ్డ ఫ్యాషన్ దుస్తులేవో తెలుసా కాపాస్ సమ్మర్ బెస్ట్ సెల్లర్ ఇదేనంటూ ప్రముఖ ఫ్యాషన్ మేగజీన్ వోగ్ ప్రకటించింది కూడా పొడమైన వదులు చేతులు... కింది నుంచి పైదాకా లూజుగా ఉంటుంది ఆస్థానంలో నిలిచిందబ్బా అన్న సందేహమొచ్చిందా? ఇంట్లో ఉన్నా.. పనులు చేసుకుంటున్నా ఎక్కువ అందంగా కనిపించే దుస్తులేని కక్కుమని నైటీ అన్న సమామెడిగింది పింగ్ పార్టీ ఏదైనా ముగించుకుని ఇంటికి రాగానే వైట్ వేసుకుంటే కానీ ఊడిరి ఇడినట్లు ఉండదు. చాలామందికి. ఇక పదులు అందుకే నిద్రించడానికి ఎంత అనుకలు దూ నైటీలోనే అని అడిగినా మహిళల ఓటు మాత్రం వాటికీ పగలు, రాత్రి అన్న తేడా లేకుండా వాటిల్లో దర్శనమిచ్చేస్తుంటారు. ఇప్పుడు కాస్తాన్ని నైటీసీ పోల్చండి ఇది శరీరాన్ని చుట్టేసినట్టు ఉండదు. పైగా పనులు మన నైటీ తరహా ప్రయోజనాలే ఇక మనసు దోచకుండా ఉంటుందా? ఏదైనా అత్యవసరమనుకోండి. ఉన్నపళంగా జుట్టు రబ్బర్‌బ్యాండ్‌లో తగిలించుకుని చక్కగా ఆ దుస్తుల్లో వెళ్లిపోవచ్చు కాబట్టి ఈ పశ్చిమాసియా దుస్తులు మనల్ని అంతగా అనించాయి, వైరటీలన్నా వంటి కొద్ది రోజుల్లోనే దొరుకుతాయి. కాపాస్ అయితే కేసు, వెర్వెట్, కార్గెట్... కోరుకున్న కాస్ వస్త్రరకంలో ఎంచుకోవచ్చు. వేడుకలకీ దానిలో సిద్ధమైపోవచ్చు. అందుకే కాఫీ లంటూ చిన్నరకాల్లో విందులూ తీసుకొచ్చారు. ఆహ్లాదకరమైన, స్టైల్‌లు ఆకర్షించే డిజైన్‌లు ఇన్ని కలగలిశాయి కాబట్టి ఈ ఏడాది గ్లోబల్ మార్కెట్‌ని ఏలేసింది..





# స్త్రీ శక్తితో ఏక్తా కుమారి





యువజన దళం... జాతీయ సేన... ఎన్సీసీ పేరేదైనా... విద్యార్థి దశనుంచే దేశభక్తినీ, ధైర్యసాహసాల్నీ ప్రదర్శించే అర్హత, బాధ్యత వీరికే సొంతం. త్రివిధ ప్రదర్శనకు దీటుగా మువ్వన్నెల జెండాకు గౌరవ వందనం చేసే అధికారమూ వీళ్లకే ఉంటుంది. ఇందుకు గడ్డకట్టే చలిలో ఆరునెలల ముందునుంచీ శిక్షణ తీసుకుంటారు. ఈసారి ఈ క్యాంప్‌కు 2316మంది హాజరుకాగా అందులో 917 మంది బాలికలే. ఈ మహిళా శక్తిని నడిపించే బాధ్యతను ఏక్తా కుమారి అందుకున్నారు. ఈమెది జమ్మూలోని అఖ్నూర్. తండ్రి రిటైర్డ్ సైనికుడు, ఏక్తా ఆయన్నుంచే దేశభక్తిని పుణికిపుచ్చుకుంది. గాంధీనగర్ ప్రభుత్వ మహిళా కళాశాలలో బీఎస్సీ చదువుతోంది. జమ్మూకశ్మీర్ నేవల్ యూనిట్‌లో ప్రధాన క్యాడెట్ ఈమె. 'కర్తవ్యపర్లో ఆల్ ఇండియా గర్ల్స్ కంటింజెంటు కమాండర్‌గా వ్యవహరించడం గర్వంగా ఉంది. ఇది నాకు కాదు, మా నాన్నకు దక్కిన విజయం, సమయపాలన, క్రమశిక్షణతో నాకిచ్చిన బాధ్యతలను నిర్వర్తిస్తా అంటున్నారు □

# టి.బి. లింఫాడినైటిస్

ఆరోగ్య భాగ్యం



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

ఇది శరీరంలో మెడ, చంకలు, గజ్జల్లో ఉండే లింఫ్ గ్రంథుల వాపు. ఇది ఎక్స్‌ట్రా పల్మోనరీ టి.బి వల్ల 15-20% కేసుల్లో వస్తుంది. పిల్లల్లో 8% మందిలో వస్తుంది. ఇది మైకోబ్యాక్టీరియం బ్యాకీరియాతో కలుషితమైన గాలిని పీల్చడం వల్ల వస్తుంది. ఇది ఇన్స్‌మేషన్ టైప్‌ని పోలి ఉండడం వల్ల లింఫాడినైటిస్ అంటారు. ఇది లింఫాడ్ అనే గ్రీక్ పదం నుండి వచ్చింది. ఎడిమాస్ (గ్లాండ్), పెటిరియా (డిస్‌ఈజ్) అనే పదాల నుండి రావడంతో దీన్ని ఎడినోపతీ అని అంటారు. ఇది నాన్ స్పెసిఫిక్‌గా 43% మందిలో వస్తుంది. లింఫ్‌గ్రంధులతో పాటు లింఫాటిక్ వెసల్స్‌లో కూడా వాపు రావడం వల్ల దీన్ని లింఫా జైటిస్ అని అంటారు. 18వ శతాబ్దంలో యూరోప్‌లో కింగ్స్ ఈవిల్, తరచుగా వచ్చే రుగ్మతగా పిలిచేవారు. ఈ వ్యాధిని నయం చేయడానికి ఏకైక మార్గం రాజకుటుంబానికి చెందిన సభ్యునిచే తాకడం అని భావించేవారు. (రాజు యొక్క చెడు) ఎందుకంటే లింఫ్‌గ్రంథుల్లో చెడురక్తం గడ్డకట్టడం వల్ల సంభవిస్తుందని, వంశపారంపర్యంగాను, తల్లిదండ్రుల్లో చికిత్స చేయని వెనిరియల్ ఇన్ఫెక్షన్స్ (సుఖవ్యాధులు) వల్ల సంభవిస్తాయని నమ్మేవారు. దీన్నే స్క్రోఫులా అని కూడా అంటారు. ఇది లాటిన్ పదం బ్రూడ్‌సౌ నుండి వచ్చింది. ఇన్ఫెక్షన్ తర్వాత ఒక సంవత్సరం తర్వాత వస్తే దీన్ని పోస్ట్ ప్రైమరీ ఇన్ఫెక్షన్ అని అంటారు. దీన్నే పెరిఫెరల్ టి.బి. లింఫాడినైటిస్ లేదా ఎపిథిలాయిడ్ గ్రాన్యులోమా అని అంటారు. ఇది పిల్లల్లో యుక్త వయస్కుల్లో 11-30 సంవత్సరాల మధ్య వారిలో ఎక్కువ. ఇది పురుషుల కన్నా స్త్రీలలోనే ఎక్కువ ఇది అభివృద్ధి చెందిన దేశాల్లో ఎక్కువ. ఇది లాటెంట్ ఇన్ఫెక్షన్ రీ ఆక్టివేషన్ వల్ల వస్తుందని చెప్పవచ్చు.



**కారణాలు :** కారణాల్ని బట్టి టి.బి. లింఫాడినైటిన్స్ 3 రకాలుగా విభజించవచ్చు.

**అక్యూట్ రకం :** ఇన్ఫెక్షన్స్ : ఇబివి, సిఎమ్‌వి,, స్ట్రెప్టోస్టఫలో కాకస్, హెచ్‌ఐవి, టాక్సోప్లాస్మోసిస్ ఇన్ఫెక్షన్స్ ముఖ్యమైనవి. నోటికుహరం నుండి వచ్చే లాడ్‌విగ్ ఎంజైనా, గాయాలవల్ల వచ్చే హెమటోమా, సూడో అన్యూరిజమ్ (ఎ.వి.పిస్టులా మొదలైనరవి అక్యూట్ ఇన్ఫెక్షన్స్‌కి చెందినవి.

**సబ్‌అక్యూట్ :** కేన్సర్స్ (హెచ్‌పవివి వల్కల వచ్చే కేన్సర్స్, స్వామస్‌సెల్ కార్సినోమా, లింఫోమా, పరోటిడ్ ట్యూమర్స్, న్యూరోబ్లాస్టోమా) సిస్టమిక్ డిసీజెస్ (అమెలాయిడోసిస్, సార్కయిడోసిస్, సోర్జెన్స్ సిండ్రోమ్) మొదలైనవి.

**క్రానిక్ :** థైరాయిడ్ నోడ్యూల్స్, గాయిటర్స్, గ్రేవ్స్ డిసీజ్, అయోడిన్ లోపం, థైరా యిడ్ కౌన్సర్స్, లిథియం వాడకం హాషిమొటో థైరాయిడైటిస్, టాక్సిన్ మల్టీ నోడ్యులార్ డిసీజ్ ముఖ్యమైనవి. ఇవే గాకుండా పుట్టుకతో ఏర్పడి సిస్టులు (బ్రాయియల్ క్లెఫ్ట్ సిస్ట్, థైరోగ్లోసల్ డక్ట్‌సిస్ట్) కారోటిడ్ బాడీ ట్యూమర్స్, లారింగోసీల్, లైపోమా, లైపోసార్కోమా ముఖ్యమైన వ్యాధులు ఇవేగాకుండా పాశ్చరైజ్ చేయని పాలు త్రాగిన, అంటువ్యాధులు, చిన్న జలుబు నుండి ఆటో ఇమ్యూన్ వ్యాధులు, స్టోరేజ్ వ్యాధులు, టైఫాయిడ్, లిష్ మానియాసిస్, సిస్టోసోమియాసిస్ ఫైలేరియా, కొన్ని రకాల కీటకాలు కటుట్టడం, ఇమ్యూనై. జేషన్ వల్ల కూడా లింఫ్‌నాడ్స్ వాపులు వచ్చే అవకాశముంది. ఇవి రోగి వయస్సు, లింఫ్‌నోడ్ స్థానం, సంఖ్యని బట్టి రెండు రకాలుగా ఉంటుంది. □

# నాగోబా జాతర

ఆధ్యాత్మికం



నాగోబా చరిత్రను గోండు గిరిజనులు రకరకాలుగా చెప్పుకుంటారు. పూర్వం మేస్రం కుటుంబానికి చెందిన నాగాయిమోతి రాణికి నాగేంద్రుడు కలలో కనిపించి సర్పం రూపంలో ఆమె గర్భాన జన్మిస్తానని చెప్పాడని, ఆ కల నిజమైందని గోండుల నమ్మకం. సర్పరూపంలోని నాగేంద్రునికి తల్లి అంటే రాణి తన తమ్ముడి కూతురు గౌరీతో వివాహం జరిపించింది. అత్త ఆజ్ఞ మేరకు గౌరీ భర్తను బుట్టలో పెట్టుకొని గోదావరికి ప్రయాణం కాగా, ఒకచోట పాము ఉడుం రూపంలో కనిపించగా ఆ ఊరు ఉడుంపూరైంది. ఆ తరువాత గౌరి ధర్మపురి వద్ద గోదావరిలో స్నానం చేయడానికి వెళ్లగా ఆమెను చూసి నాగేంద్రుడు మనిషి రూపంలోకి మారాడని, అయితే పేరు ప్రతిష్ఠలు కావాలో, సంప్రదాయం కావాలో తేల్చు కోమనగా గౌరి సంప్రదా యాలను లెక్క చేయక పోవడంతో తిరిగి పాముగా మారాడని కథ. ఆ తరువాత ఉడుం పూర్ నుంచి గరిమెల వరకు అతనికోసం వెతికిన గౌరి గోదావరిలోనే సత్యవసి గుండంలో కలిసిపోయిందని, నాగేంద్రుడు ఆమె వెంట ఉంచిన ఎద్దు రాయిగా మారిందని భక్తుల విశ్వాసం. ఆ తరువాత పెళ్ళి అయిన ప్రతి జంటకు నాగేంద్రుడి సన్నిధిలో పరిచయం చేయాలని (పేథికొరి యాక్) చెప్పి నాగేంద్రుడు కెస్లాపూర్ గుట్టల్లోకి వెళ్లి పోయాడని చెప్తుంటారు. అదే కెస్లాపూర్ గ్రామంగా మారి పోయింది. నాగేంద్రుడు వెళ్లిన గుట్ట వద్ద నాగోబా దేవాలయాన్ని నిర్మించారు. ప్రతిఏటా పుష్య మాసం అమావాస్య రోజున నాగేంద్రుడు ప్రత్యక్షమవుతాడని గిరిజనుల నమ్మకం. నాగోబా దేవతకు పూజలు మేస్రం వంశీయులే నిర్వహిస్తారు. మేస్రం వంశం కింద 22 తెగలు వస్తాయి. ఏడుగురు దేవతలను కొలిచే వారంతా మేస్రం వంశీయుల కిందికి వస్తారు. మడావి, మర్సకోల, పుర్కా, మేస్రం, వెడ్మ, పంద్రా, పుర్వేత ఇంటి పేర్లు గలవారంతా మేస్రం వంశంలో వస్తారు.మెస్రం వంశీయులు తొలినాళ్ళలో నాగోబా దేవత వెలిసిన పుణ్యస్థలం (పుట్ట)ను మాత్రమే పూజించేవారు. 1956లో గడ్డి పరకలతో చిన్న గుడిసెను, 1995లో సిమెంట్, ఇటుకలతో చిన్న మంది రాన్ని నిర్మించి పూజలు చేశారు. 2000 సంవత్సరంలో ప్రభుత్వ సహకారంతో గుడిని నిర్మించారు. 2022లో శిలలతో నూతన దేవాలయాన్ని నిర్మించారు □

# మొటిమలు కనిపించకుండా..



ముఖం మీద మొటిమలను దాచడానికి మేకప్ వేసుకునేటప్పుడు కొన్ని మెలకువలు పాటించాలి. లేదంటే మొటిమలు మరింత స్పష్టంగా కనిపించే ప్రమాదం ఉంది. మొటిమలను దాచే మేకప్ మెలకువలు ఇవే!

**మాయిశ్చరైజర్:** మేకప్ చర్మం మీద సమంగా అంటుకోవాలంటే, మొదట ముఖాన్ని శుభ్రంగా కడిగి, మాయిశ్చరైజర్ పూసుకోవాలి. జిడ్డు చర్మం కలిగిన వాళ్లు మాయిశ్చరైజర్ వాడకూడదు.

**ప్రైమర్:** మేక్‌పకు ముందు అనుసరించవలసిన చిట్కా ఇది. మేకప్ ఉత్పత్తులు చర్మంలోకి ఇంకిపోకుండా ప్రైమర్ తోడ్పడుతుంది. హెచ్చుతగ్గులు లేకుండా మేకప్ చర్మం మీద పరుచుకోవడానికి వీలుగా, ప్రైమర్ చర్మాన్ని సిద్ధం చేస్తుంది.

**కరెక్టర్:** మొటిమలను కరెక్టర్‌తో కనిపించకుండా చేయవచ్చు. ఇందుకోసం ఎర్రగా ఉండే మొటిమల మీద ఆకుపచ్చని కరెక్టర్ అద్ది, పైన కన్‌సీలర్ అద్దుకోవాలి. ఇలా చేయడంవల్ల మొటిమ ఎరుపు రంగు తగ్గి, చర్మంలో కలిసిపోతుంది. మొటిమ ఎరుపు రంగులో లేకపోతే, నేరుగా కన్‌సీలర్‌నే అద్దవచ్చు. కన్‌సీలర్‌ను మొటిమ మీద అద్దాలే తప్ప, రుద్దకూడదు.

**లిక్విడ్ ఫౌండేషన్:** బ్రష్ లేదా మేకప్ స్పాంజ్‌తో ముఖం మీద ఫౌండేషన్‌ను వేసుకోవాలి. అంటే ముఖం మీద ఫౌండేషన్ చుక్కలుగా అద్ది, బ్రష్ లేదా స్పాంజ్‌తో ముఖాన్ని అద్దినట్టు చేస్తూ, ముఖమంతా పరుచుకునేలా చేయాలి.

**మేపక్ సెట్టింగ్:** ఫౌండేషన్ పూసుకున్న తర్వాత కొన్ని నిమిషాలు ఆగాలి. ఆ తర్వాత ప్రెస్‌డ్ లేదా లూజ్ పౌడర్‌ను అద్దుకోవాలి. తర్వాత ఫినిషింగ్ స్ప్రే కూడా వాడుకోవచ్చు.

**మచ్చలను దాచాలంటే... :** ఫేస్ ప్రైమర్‌తో మేకప్ మొదలు పెట్టాలి. తర్వాత ప్రైమర్, కన్‌సీలర్, అంతిమంగా ఫౌండేషన్, లూజ్ పౌడర్ వాడాలి. మచ్చలు నల్లగా లేదా ఎర్రగా ఉంటే, కలర్ కరెక్టర్‌ను వాడుకోవచ్చు. □

# ఎగ్‌ప్లాంట్ పిజ్జా

**కావలసిన పదార్థాలు**

ఎగ్‌ప్లాంట్ (పెద్ద వంకాయ): ఒకటి, టమాట: ఒకటి, పిజ్జా సాస్: అర కప్పు, తురిమిన చీజ్: అర కప్పు, పార్సిమెన్: పావు కప్పు, ఆలివ్స్: పావు కప్పు, ఆలివ్ ఆయిల్: అర కప్పు, కొత్తిమీర తురుము: కొద్దిగా.

**తయారీ విధానం:** ఎగ్‌ప్లాంట్‌ను కాస్త మందంగా గుండ్రటి ముక్కల్లా కోయాలి. కోసిన ముక్కల్ని ఒక ప్లేట్‌పై పరిచి పైనుంచి ఆలివ్ ఆయిల్ వేసి పదిహేను నిమిషాల పాటు 180 డిగ్రీల వద్ద ఒవెన్‌లో బేక్ చేయాలి. బేక్ అయిన ముక్కలపై పిజ్జా సాస్, చీజ్ తురుము, పార్సిమెన్ వేసి పైనుంచి ముక్కలు చేసిన ఆలివ్స్, సన్నగా, గుండ్రంగా కోసిన టమాట ముక్కలు పెట్టి మరో పదినిమిషాలు బేక్ చేయాలి. చివరగా పైనుంచి కొత్తిమీర చల్లుకుంటే



వేడివేడిగా నోరూరించే ఎగ్‌ప్లాంట్ పిజ్జా సిద్ధం. □

వార్త

ప్రతి కష్టంలోనూ అవకాశాన్ని చూస్తాడు ఆశావాది, ప్రతి అవకాశంలోనూ కష్టాన్నే చూస్తాడు నిరాశావాది.

-షేక్స్పియర్

# లెక్కలు తేల్చేస్తాయి

నీతి ఆయోగ్ నివేదికల్లో తెలుగు రాష్ట్రాల్లో కాస్తంత వెనుకబడి ఉన్నట్లు ర్యాంకుల్లో తేలిపోయింది. దేశంలోని అన్ని రాష్ట్రాల నివేదికలలో ఆంధ్రప్రదేశ్ అట్టడుగు స్థాయిలో ఉండగా తెలంగాణ కాస్త బెటర్. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం ఎపి డెబిట్ సస్టైన్‌బిలిటీలో జీరో స్థాయిలోఉంది. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలోనూ వెనుకబడి ఉన్నట్లు పాలకులు, పాలితుల మధ్య చర్చ నడుస్తోంది. గత పాలన లోటుపాట్లు ఎత్తి చెప్పడంలోనూ ఆర్థిక వెనుకబాటుతనం, ఆర్థిక ఖాతాల నిర్వహణ, అభివృద్ధిలో లోటుపాట్లను దిద్దడానికి నీతిఆయోగ్, కాగ్, ఫిస్కల్ ఇండెక్స్‌లు ఎత్తి చూపుతుంటాయి. తాజాగా నీతి ఆయోగ్ నివేదికలో ఆంధ్రప్రదేశ్ 17వ స్థానానికి, తెలంగాణ 8వ స్థానంలోనూ ఉన్నాయి. 2022-23లో రాష్ట్రంలో ఆర్థిక వనరులు బాగా దెబ్బతిన్నాయని ఈ అంకెలు చెబుతున్నాయి. అసలు మూలధనవ్యయమేదీ కనపడడం లేదు. అంటే విద్య, వైద్యం వంటి సామాజిక అంశాలలోనూ మూలధన వ్యయమేదీ లేదు. ఐతే 2023లో అప్పులు మాత్రం 62 వేల కోట్లు. ఇదే సందర్భంలో స్టేట్ ఫిస్కల్ హెల్త్ ఇండెక్స్ నివేదికపై కూడా చర్చ జరుగుతోంది. రాష్ట్రాభివృద్ధి పేరిట 16.5 శాతం రుణాలు పెరగగా 9.8 శాతం ఆదాయం తగ్గింది. వడ్డీ మొత్తాలు 15 శాతం మేరకు పెరిగాయి. ఎక్కువ వడ్డీకి అప్పులు తీసుకురావడం, మూలధనవ్యయం అసలే లేకపోవడం, పన్నుల పెంపు వంటి కారణాల వల్లనే ఆంధ్రప్రదేశ్ అప్పుల సూచికలో కూరుకుపోయిందనే ఆరోపణలున్నాయి. నీతిఆయోగ్ నివేదికలో ఈ అంశాలపై వ్యాఖ్యానాలు రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి గత పాలన తప్పిదాలను ప్రత్యేకించి ఏకరువు పెట్టారు. నిజానికి ఈ నివేదికలు తాజా ప్రభుత్వాలకు పాలనా మార్గదర్శకత్వం చేస్తాయి. ఇలాంటి సమీక్షలతో పాలనా క్రమంలో 'చేయదగినవి, చేయకూడనివి, చేయాల్సినవ్ని దృష్టిలో ఉంచుకునేందుకు సూచికలుగా పని చేస్తాయి. 2014-19లో తెలుగుదేశం ప్రభుత్వ పాలన చేయగా, 2019-2024 వరకు రాష్ట్రంలో వైసిపి పాలనలో ఉంది. మళ్లీ తెలుగుదేశం నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి పాలనా పగ్గాలు చేపట్టడంతో ముందుగతిని నిర్దేశించే అవసర మొచ్చింది. తాజాగా గతంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన 7 శ్వేత పత్రాల్లో ఉన్న అంశాలనే నీతి ఆయోగ్ ధృవీకరించినట్లయింది. దీని నేపథ్యంలోనే భవిష్యత్ ఆలోచనలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై పడింది. దేశవ్యాప్తంగా 18 పెద్ద రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులను సైతం నీతిఆయోగ్ నివేదిక విశ్లేషించింది. 2023-23 నాటికి ఉన్న ఆర్థిక పరిస్థితులను క్రోడీకరించి, కొన్ని ఆర్థిక ప్రమాణాలను ఐదు కీలకాంశాల ఆధారంగా ఈ ఆర్థిక సూచి 2025లో ర్యాంకులు కూడా కేటాయించింది. 5 ప్రధాన సూచికలు 9 మైనర్ సబ్ ఇండికేటర్‌లు ఆధారంగా నీతి ఆయోగ్ సర్వే చేసింది. వీటిలో ఉత్పాదక వ్యయం రెవెన్యూ లోటు, వడ్డీ చెల్లింపులు ప్రస్తుత రుణాలు, రుణ సామర్థ్యం, జిఎస్టీ వృద్ధి తదితర అంశాలను ప్రామాణికంగా ఈ నివేదిక రూపొందించారు. ఆర్థిక ఆరోగ్యసూచీ- 2025లో ఒడిశా 67.8 స్కొలర్‌తో మొదటి స్థానంలో కంటే ప్రప్రథమ స్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్ 20.9 స్థానంతో అట్టడుగున ఉంది. గతంలో వెనుకబాటు తనంలో బీహార్‌ను ఒక సంకేతంగా భావిస్తారు. తాజా పరిస్థితులను బట్టి ఆంధ్రప్రదేశ్ దాని తర్వాతనే ఉండడం ఆలోచించదగిన విషయం. ఒక దానితోనొకటి పోటీపడుతూ అభివృద్ధి చెందాల్సిన తెలుగు రాష్ట్రాల అభివృద్ధి సూచీలు పెద్దగా ఆశించినట్లు లేవు. నీతి ఆయోగ్ 2022-23 ఆర్థిక ఆరోగ్య డేటా పరిశీలిస్తే ఆర్థిక సంవత్సరంలో పలు పారామీటర్‌ల ప్రకారం 17వ స్థానంలో నిలిచిందంటే బాగా వెనకబడినట్లే. ఆ ఏడాది ఆర్థిక ఆరోగ్యంలో ఒడిశా అద్భుతంగా ఉండగా, తర్వాత స్థానంలో ఛత్తీస్‌గఢ్ ఉంది. ఆంధ్రప్రదేశ్ కంటే పంజాబ్ మినహా మిగిలిన అన్ని రాష్ట్రాల ఆర్థిక, ఆరోగ్య స్థితి బావుందని నివేదికలో నీతి ఆయోగ్ పొందుపరిచింది. నీతి ఆయోగ్ నివేదికను 16వ ఆర్థికసంఘం ఛైర్మన్ అరవింద్ పనగడియా విడుదలచేసి పలుసూచనలు కూడా చేసారు. వాటి ఆధారంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణాకు తమ ఆర్థిక ప్రణాళికలను రూపొందించుకోవాల్సి ఉంటుంది. 2014-19లో పోల్చి చూసినప్పుడు ఆంధ్రప్రదేశ్‌కి సంబంధించి మూల ధనవ్యయం 60శాతం నుంచి గత పాలనలో 15 శాతానికి తగ్గిపోయింది. అభివృద్ధికి నిధులు కేటాయించలేనప్పుడు జరిగే అభివృద్ధి శూన్యమే. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేనప్పుడు ప్రజలమీద పన్నులు వేయడంతప్ప గత్యంతరం ఉండదు. నిన్న మొన్నటి ఎన్నికల్లో సూపర్ సిక్స్ పథకాలను ప్రకటించి వాటిని పూర్తిగా అమలులోకి తేకుండానే రాష్ట్ర ఆర్థికపరిస్థితిపై సిఎం చంద్రబాబు నాయుడు పెదవి విరవడంతో విపక్షాలు, 'సూపర్ సిక్స్ అట్టర్‌ప్లాప్' అని ఎద్దేవా చేసే పరిస్థితి తలెత్తింది. ఆర్థిక పరిస్థితి ఎలాఉన్నా ఆంధ్రప్రదేశ్ 2047 నాటికి అభివృద్ధి ప్రణాళికలకు రూపుదిద్దడంతో మరింత అభివృద్ధికి పునాదులు పడుతున్నాయని జనం ఆశపడుతున్నారు. ఆంధ్రప్రదేశ్ విషయంలో గత ప్రభుత్వ హయాంలో చెప్పుకోదగిన తప్పులేమీ జరగలేదంటూ తాజా అప్పుల మోతపై ఆనాటి ప్రభుత్వ అనుయాయులు విమర్శలు గుప్పిస్తూ సమర్థించుకుంటున్నారు. ఇలాంటి బేరీజులు, దిశానిర్దేశం చేసే విషయంలో నీతిఆయోగ్,కాగ్ నివేదికలు మార్గదర్శకమే అవుతాయి. ఆసరాగా చేసుకుని పాలకులు దిశానిర్దేశం చేసుకోగలిగితే ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధిలో మూడు పువ్వులు - ఆరు కాయలుగా వర్ధిల్లుతుంది.

సమస్య చిన్నదైనా, పెద్దదైనా సకాలంలో చర్య తీసుకుంటే ఎందులోనూ అపజయం అనేది ఉండదు.



సిసి.కాల్టన్

వాడని ఇనుము తుప్పు పడుతుంది. కదలని నీరు స్వచ్ఛతను కోల్పోతుంది. బద్ధకం మెదడును నిస్తేజం చేస్తుంది.



డావిన్సీ

# అమలుకు నోచుకోని చట్టాలెందుకు?

**చట్టం అయితే చేశారు కానీ దాన్ని అమలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు, యంత్రాంగాన్ని ఏర్పాటు చేయలేదు. అంతా అయోమయ పరిస్థితి. దేశవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలు పొగాకు ఉత్పత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. లక్షలాది మంది రైతులు మరెందరో కూలీలు పొగాకు సాగుపై ఆధారపడి ఉన్నారు. ఈ కుటుంబాలు వీధిపాలు కాకుండా చూడాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. ముందుగా వారికి ప్రత్యామ్నాయం చూపించాలి. అవేమీ పట్టించుకోకుండా కాగితాలపై చట్టాలు చేసి చేతులు దులుపుకుంటే ప్రయోజనం ఉండదు. పాలకులకు చిత్తశుద్ధి ఉండే జీవనోపాధి కోల్పోతున్నవారికి ప్రత్యామ్నాయం చూపి పొగాకు ఉత్పత్తులను,అమ్మకాలను, వినియోగాన్ని భూటాన్ దేశంలో లాగా పూర్తిగా నిషేధించాలి. అప్పుడే దీనికి ఒక పరిష్కారం లభిస్తుంది. అంతేకానీ ఆచరణ సాధ్యంకానీ అమలు చేయలేని చట్టాలు చేస్తే పాలకులు నవ్వులపాలౌతారు.**

దామెర్ల సాయిబాబ

మానవజాతిని పట్టిపీడిస్తున్న మద్యపానం, ధూమపానాలను పారద్రోలే విషయంలో ఆరాటమే కానీ, త్రికరణ శుద్ధిగా పోరాటం చేయడంలేదనే చెప్పాలి. ఈ రెండు వ్యసనాలతో మాదకద్రవ్యాలు తోడు కావడంతో దేశంలో కోట్లాది కుటుంబాలు చితికిపోతున్నాయని, లక్షలాది మంది మంచానికే పరిమితమై కృంగికృశించి మరణిస్తున్నారనే విషయం పాలకులకు తెలియంది కాదు. చట్టాలు చేస్తున్నారు. ఉపన్యాసాలు ఇస్తున్నారు. కానీ త్రికరణశుద్ధిగా వీటిని నియంత్రించేందుకు మాత్రం ప్రయత్నం చేయడం లేదు. కొందరిని కొంతకాలం మోసం చేయవచ్చు. అందరిని కొంత కాలం మోసం చేయవచ్చు. అందరిని ఎల్లకాలం మోసం చేద్దామనుకుంటే అది భ్రమే అవుతుంది. అలా ప్రజలను మోసం చేసిన వారు, వేధించిన వారు ఎందరో చక్రవర్తులు, రాజులు, మరెందరో నేతలు చరిత్రహీనులుగా కాలగర్భంలో కలిసిపోయారు. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి ప్రజా అవసరాలను గుర్తించి ప్రజలకు ఇచ్చిన మాటను నెరవేర్చి ఆదరాభిమానాలు పొంది వారి హృదయాల్లో చోటు సంపాదించుకున్నవారు చిరస్థాయిగా మిగిలిపోతారు. మాదకద్రవ్యాల విషయంలో అటు కేంద్ర,రాష్ట్ర పాలకులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా, ఎంత మంది అధికారులను నియమిస్తున్నా నిందితులను పట్టుకొని జైళ్లల్లో పెడుతున్నా అది ఏమాత్రం ఆగడం లేదు. అంతకంతకు పెరుగుతున్నది. యేటా దేశ వ్యాప్తంగా వేలాది కోట్ల రూపాయల మత్తుపదార్థాలు పట్టుబడుతూనే ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో కూడా ఏమాత్రం తక్కువ లేదు. ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు, గౌరవప్రదమైన ఉద్యోగాలు చేస్తున్న కొందరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఈ మత్తుకు అలవాటు పడడమే కాదు అందులో కొందరు ఆ వ్యాపారంలో భాగస్వాములవుతున్నారు. తాజాగా బెంగుళూరులో ఒక ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ శని, ఆదివారాల్లో అక్కడ నుండి హైదరాబాద్‌కు మత్తు మందులు తెచ్చి అమ్ముకుంటున్న విషయం నిన్న సోమవారం బయటపడింది. ఆయనే కాదు ఎందరో యువకులు ఈ మత్తు వ్యాపారంలో మునిగితేలుతున్నారు. మద్యం విషయంలో పాలకులు పైకి ఏమి చెప్తున్నా ఆదాయం కోసం ప్రోత్సహిస్తున్నారనేది కాదనలేని వాస్తవం. గతంలో దశలవారీగా తగ్గిస్తామని చెప్పుకున్న పెద్దలే అంచెలంచెలుగా పెంచుతున్నారు. ఒకనాడు కేవలం వందకోట్ల ఆదాయంతో ప్రారంభమైన మద్యం వ్యాపారం నేడు రెండు రాష్ట్రాల్లో కలిసి యాభై, అరవైవేల కోట్లకుపైగా చేరుకుంటున్నది. ఈ యేడాది తెలంగాణ ప్రభుత్వం ప్రస్తుతం వస్తున్న ఇరవైఐదు వేల కోట్లకు అదనంగా ఐదువేల కోట్ల రూపాయలకుపైగా ఆదాయాన్ని పెంచుకోనున్నట్లు మొన్నటి బడ్జెట్ అంచనాలు స్పష్టం చేస్తున్నాయి. కొన్ని రాష్ట్రాలకు మద్యం ఆదాయమే మహాప్రసాదంగా పరిణమించింది. ఇక మద్యం సరే. సారాను నిషేధించారు. కానీ ఏ మాత్రం అమలవుతున్నది? మంచినీరు దొరకని గ్రామాలు ఎన్నో ఉండొచ్చు.కానీ సారా దొరకని గ్రామం లేదు. గుడంబ, నాటుసారా ఒక కుటీర పరిశ్రమగా రూపుదిద్దుకున్నది. ఈ అక్రమ సారాను నియంత్రించేందుకు పాలకులే చీప్ లిక్కర్‌ను ప్రవేశపెట్టారు. ప్రజారోగ్యానికి అత్యంత హానిచేస్తున్నది ఈ చీప్‌లిక్కరే. ముఖ్యంగా పేదల జీవితాలు ఈ చీప్‌లిక్కర్‌తో చితికిపోతున్నాయి. లక్షలాది కుటుంబాలు వీధినపడుతున్నాయి. మద్య నిషేధం గురించి ఒకసారి గతంలోకి వెళ్లితే మద్యానికి బానిసై అనారోగ్యంపాలై కుటుంబాలకు కుటుంబాలే బజారున పడుతుండడంతో ఆనాడే ఆవేదన చెందిన మహాత్ముడు స్వతంత్ర భారతావని నుంచి మద్యాన్ని తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. మహాత్మాగాంధీ కలలకు అనుగుణంగానే

ఒక్క మాట

స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత 1947 అక్టోబరు ఒకటో తేదీ నుంచి అప్పటి మద్రాసు ప్రభుత్వం మద్యాన్ని నిషేధించింది. అందులోభాగంగానే ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో మద్యనిషేధాన్ని విజయవంతంగా అమలుచేశారు. మద్యపానం వల్ల జరిగే కష్టనష్టాలను ప్రజలకు వివరించడంలో, మరొకపక్క అక్రమ మద్యాన్ని తయారుచేసే వారిపై ఉక్కు పాదం మోపడంలో ఆనాటి పాలకులు ఎంతో సమర్థవంతంగా వ్యవహరించారు. 1960 ప్రాంతంలో రాజకీయ జోక్యం పెరగడంతో మద్యనిషేధం అమలు చేయడం కష్టతరంగా మారింది. సారా తయారీదారులు కొందరు రాజకీయ నాయకుల అండదండలతో నిషేధానికి తూట్లు పొడవడం ప్రారంభించారు. మద్యనిషేధంవల్ల రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయల ఆదాయం కోల్పోతుందనే వాదనను లేవనెత్తి దశలవారీగా మద్యం వ్యాపారాన్ని విస్తరించారు. మధ్యలో ఒకటి, రెండు సందర్భాల్లో సంపూర్ణ మద్యనిషేధానికి శ్రీకారం చుట్టినా అది ఎక్కువ రోజులు నిలవలేదు. మద్యపానాన్ని ఆదాయం దృష్ట్యా నియంత్రించ లేకపోతున్నారనేది అందరికి తెలిసిందే. ధూమపానాన్ని నియంత్రించే విషయంలో కూడా పాలకులు విఫలమవుతున్నారేమోననిపిస్తున్నది. ఊపిరితిత్తుల కేన్సర్, గుండె జబ్బులు, మరెన్నో రోగాలకు ధూమపానం కేంద్ర బిందు వని ఎందరో వైద్యనిపుణుల అధ్యయనంలో వెల్లడైంది. ప్రపంచవ్యాప్తంగా 130కోట్ల మందికిపైగా ధూమపానంలో మునిగితేలుతున్నారు. భారత దేశానికి సంబంధించి ఇరవై కోట్ల మందికిపైగా పొగాకు ఉత్పత్తులకు అలవాటు పడ్డారు. ఇందులో బీడీలు తాగేవారే అధికంగా ఉన్నారు. బీడీలు, సిగరెట్లు తాగడం సరదాగా ఆరంభమై ఆతర్వాత అలవాటుగా మారుతున్నది. కేవలం ధూమపానం వల్లనే దేశ వ్యాప్తంగా కోట్లాదిమంది అనేక రోగాలబారిన పడుతుంటే లక్షలాది మంది అసువులు బాస్తున్నారు. సిగరెట్ పొగలో నాలుగువేల ఎనిమిది వందలకు పైగా ప్రమాదకర విష వాయువులు ఉన్నాయని, ఇవి అనేక రోగాలకు కారణాలవుతున్నాయని వైద్యనిపుణులు చెబుతున్నారు. బీడీ పరిశ్రమ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కోట్లాది మందికి బతుకుతెరువు ఇస్తున్నదనేది కాదనలేని వాస్తవం. అడవుల్లో ఉన్న లక్షలాది మంది గిరిజన కుటుంబాలకు బీడీ ఆకుల సేకరణ ప్రధాన ఆదాయ వనరుల్లో ఒకటి. కొన్ని శతాబ్దాలుగా అదొక కుటీర పరిశ్రమగా వర్ధిల్లుతున్నది. ఈ వాస్తవాలను పట్టించుకోకుండా బీడీ వినియోగాన్ని తగ్గించేందుకు ప్రయత్నం చేయడం వివేకం అనిపించుకోదు. కానీ పాలకపెద్దలు ఈవిషయాన్ని దృష్టిలోఉంచుకోకుండా పొగాకు ఉత్పత్తులను నిషేధించేందుకు ప్రయత్నాలకు దాదాపు మూడు దశాబ్దాలక్రితంనుంచే శ్రీకారంచుట్టారు. దీంతో బీడీ కార్మికులు, కాంట్రాక్టర్లు, అందరూ ఏకమై ఎదురుతిరగడం, ఒత్తిడిలు తోడుకావడంతో విరమించుకోవాల్సి వచ్చింది. మళ్లీ బహిరంగ ప్రదేశాల్లో ధూమపానాన్ని నిషేధించారు. పొగాకు పండించే రైతులను ప్రత్యామ్నాయ పంటలవైపు మళ్లించేందుకు రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కిందచర్యలు చేపడుతున్నట్లు ప్రకటిస్తున్నారు. మరొకపక్క పొగాకు ఎగుమతులు పెరుగుతున్నట్టు కేంద్రం చెప్పుకుంటున్నది. గతయేడాది దాదాపు పన్నెండు వేల కోట్ల రూపాయలకు పైగా పొగాకు ద్వారా ఆదాయం వచ్చినట్లు చెప్పుకుంటున్నారు. కామన్‌వెల్త్ దేశాలన్నింటిలో నూ భారత్‌లోనే పొగాకు ఉత్పత్తి అధికంగా అవుతున్నది. అలాగే కేన్సర్ వ్యాధికి మూలకారణాల్లో పొగాకు ఒకటి. నోటి, ఊపిరితిత్తులు రకరకాల కేన్సర్లు భారత్‌లో ఆందోళనకర స్థాయిలో విస్తరిస్తున్నట్లు అధ్యయనాలే వెల్లడిస్తున్నాయి. యేటా దాదాపు ఇండియాలో పద్నాలుగున్నర లక్షల మందికిపైగా పొగాకుతో ప్రాణాలు కోల్పోతున్నట్టు అధికారలెక్కలే వెల్లడిస్తున్నాయి. ఈయేడాది అది పదిహేడు లక్షల దెబ్బైవేలకు చేరవచ్చునని అంచనాలు వెలువడుతున్నాయి. పొగాకు పదమూడేళ్ల ప్రాయం నుండే ప్రారంభించి ఇరవైయేళ్లు వచ్చేసరికి దానికి బానిసలుగా మారిపోతున్నారు. చట్టం అయితే చేశారు కానీ దాన్ని అమలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు, యంత్రాంగాన్ని ఏర్పాటు చేయలేదు. అంతా అయోమయం, గందరగోళం. ఇంకొకపక్క దేశవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలు పొగాకు ఉత్పత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. లక్షలాది మంది రైతులు మరెందరో కూలీలు పొగాకు సాగుపైఆధారపడిఉన్నారు. ఈ కుటుంబాలు వీధిపాలుకాకుండా చూడాల్సిన బాధ్యత పాలకులపై ఉంది.ముందుగా వారికి ప్రత్యామ్నాయం చూపించాలి. అవేమీ పట్టించుకోకుండా కాగితాలపై చట్టాలు చేసి చేతులు దులుపుకుంటే ప్రయోజనం ఉండదు. ప్రజారోగ్యాన్ని కాటేస్తున్న ఈ ధూమపానానికి కచ్చితంగా ఫుల్‌స్టాప్ పెట్టించాల్సిందే. అందులో మరో అభిప్రాయానికి తావులేదు.అలాగే జీవనోపాధి కోల్పోతున్నవారికి ప్రత్యామ్నాయం చూపి పొగాకు ఉత్పత్తులను,అమ్మకాలను, వినియోగాన్ని భూటాన్ దేశంలో లాగా పూర్తిగా నిషేధించాలి. అప్పుడే దీనికి ఒకపరిష్కారం లభిస్తుంది. అంతేకానీ ఆచరణసాధ్యం కాని అమలుచేయలేని చట్టాలుచేస్తే పాలకులు నవ్వులపాలౌతారు. ఈ మారణహోమం కొనసాగుతూనే ఉంటుంది. ●

# నిరుద్యోగుల పట్ల ఇంత నిర్లక్ష్యమా?

ఎం. చిరంజీవి

ఉద్యోగులకు పదవి విరమణ వయసు పెంచడం పట్ల నిరుద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగాలు ఇస్తానని చెప్పి గత ప్రభుత్వం మోసం చేసిందని, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ చెప్పినటువంటి మాటలు నమ్మి కాంగ్రెస్ పార్టీకి పట్టం కడితే, పెద్ద ప్రభుత్వ ఇచ్చినటువంటి ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇచ్చి మేమే ఇచ్చామని చెప్పుకుంటున్నటువంటి విషయాన్ని గమనిస్తున్న నిరుద్యోగులు ప్రభుత్వంపై మండిపడుతున్నారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరమైనా కూడా ఏ డిపార్ట్మెంట్లో ఎన్ని వేకెన్సీలు ఉన్నాయనే అటువంటి విషయాన్ని కూడా ఇప్పటివరకు బహిరంగపరచలేదనేటువంటి విషయాన్ని ప్రస్తుత ప్రభుత్వం తెలపడం లేదని, ఎటువంటి నోటిఫికేషన్లు వేయడం లేదనేటువంటి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఉద్యోగం వస్తే తప్ప మా బతుకులు బాగుపడవని గమనించినటువంటి యువత ఉద్యోగం కోసం కొన్ని ఏళ్లనుండి కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. కానీ వారి ఆశ నెరవేరడం లేదు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం అత్యధిక నోటిఫికేషన్లు జారీచేసి, ఎక్కువ మంది నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అనుకుంటున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 63 సంవత్సరాలకు పెంచడం రాష్ట్ర ప్రభుత్వానికి శ్రేయస్కరం కాదు. దీనివల్ల ప్రభుత్వానికితీరని నష్టం వాటిల్లే ప్రమాదం వుంది. ఉద్యోగ విరమణ వయసును పెంచడమంటే లక్షల మంది నిరుద్యోగుల నోట్లో మట్టి కొట్టినట్టడమే. ప్రభుత్వానికి ఎంత ఆర్థిక ఇబ్బందులున్నప్పటికీ, ఎన్ని డిమాండ్లు వచ్చినప్పటికీ ఈ ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని నిరుద్యోగ యువత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తుంది. గత ప్రభుత్వం చేసిన తప్పును ప్రస్తుత ప్రభుత్వం చేస్తుందని అంటున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంలో నిరుద్యోగులే కీలకపాత్ర పోషించారు. జాబ్ క్యాలెండర్‌కోసం వారు వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు. నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లకుండా వెంటనే ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతున్నారు. నోటిఫికేషన్లు విడుదల కాకపోవడంతో ఇప్పటికే ఎంతో మంది నిరుద్యోగులు ఆత్మహత్యలకు చేసుకుంటున్నారని, ఇప్పటికైనా ఉద్యోగ నోటిఫికేషన్లు వెలువరించకపోతే రాష్ట్రంలోని నిరుద్యోగులు ఏకమై మరొక ఉద్యమానికి సిద్ధపడుతున్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 5వ వేతన సవరణ సంఘం,58 ఏళ్ల నుంచి 60 ఏళ్లకు పెంచాలని సిఫార్సుచేసింది. కానీ, గరిష్ట వయస్సు 60ఏళ్లకు మించరాదని,వయస్సుకు మించిన సర్వీసు పొడిగింపులపై పూర్తిగా నిషేధం విధించాలని పేర్కొంది. అంతేకాదు 7వ పీఆర్సీ సైతం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును పెంచాలని ఎలాంటి సిఫార్సులు చేయలేదు. అయితే, ఏపీ,తెలంగాణ వంటి కొన్ని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచిన విషయం తెలిసిందే. దీనివల్ల నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారనే విమర్శలు ఉన్నాయి. రిటైర్మెంట్ వయసు పెంచడంతో ఉద్యోగాలసంఖ్యతగ్గిపోయి, కొత్త నోటిఫికేషన్ల రావడం ఆలస్యం అవుతుంది. వాస్తవానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రిటైర్మెంట్ వయసు 58 ఏళ్లుగా ఉండేది. కానీ, కేంద్రంతోపాటు పలు రాష్ట్రాలు 60 ఏళ్లకు, ఏపీ, తెలంగాణలోనూ 62ఏళ్లకు పెంచారు. దీనిపై తీవ్రవిమర్శలు కూడా వస్తున్నాయి. నిరుద్యోగులకు అన్యాయం చేయడమేమిటని మండిపడుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు డిఏలు,టిఏలు, పిఆర్సి వంటివి ఇవ్వనవసరం లేకుండా వయస్సు పెంచడం ద్వారా వీటన్నింటి ద్వారా లబ్ధిపొందవచ్చని ప్రభుత్వం యోచిస్తుంది. ●

# ఆర్థిక అవసరాలే ఆసరాగా అవయవమార్పిడి!

మహమ్మద్ ఆరిఫ్

హైదరాబాద్ లోని సరూర్ నగర్‌లో గల ఒక ఆస్పత్రిలో ఇటీవల 'కిడ్నీరాకెట్' వెలుగు చూడడం రాష్ట్రంలో కలకలం రేపింది. ఇంకెన్ని ఆస్పత్రుల్లో ఇలాంటి దందా నడుస్తున్నదనే అనుమానం వ్యక్తమవుతున్నది. అనుమతి లేకుండా కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహించిన ఆస్పత్రిపై కఠినంగానే వ్యవహరిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఆస్పత్రిని సీజ్ చేసింది. కిడ్నీ మార్పిడి చేసుకున్న ఇద్దరు, కిడ్నీ దానం చేసిన ఇద్దరిని గాంధీకి తరలించి వైద్యం చేయిస్తున్నది. ఆర్థిక ఇబ్బందులతోనే తమిళనాడు, కర్ణాటకకు చెందిన ఇద్దరు వితంతువులు కిడ్నీ ఇచ్చేందుకు ఒప్పుకున్నట్లు అధికారులు గుర్తించారు. ఇంకా ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి ఈ వ్యవహారంపై ప్రభుత్వం విచారణ జరుపుతున్నది. మరోవైపు అవసరమైతే వైద్యుల లైసెన్సులను శాశ్వతంగా తొలగిస్తామని మెడికల్ కౌన్సిల్ ప్రకటనచేసింది. అనేకసార్లు ఇలా అవయవమార్పిడి ఘటనలు బయటపడుతున్నా.. ఈ దందాకు అడ్డుకట్ట పడడం లేదు. అయితే ఈ దందాలో పేదలే సమిధలు అవుతున్నారు. ఆర్థిక ఇబ్బందులతో డబ్బుల ఆశకు కిడ్నీలు ఇచ్చేందుకు రెడీ అవుతున్నారు. అయితే పేదల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకొని ముఠాలు ఈ దందాను కొనసాగిస్తున్నాయి. అంతేకాకుండా కిడ్నీ తీసుకున్నాక.. వారిని మోసం చేస్తున్నాయి. డబ్బులు చెల్లించకపోవడంతోనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతోనే అనేక అవయవ మార్పిడి ఘటనలు వెలుగుచూశాయి.ఇంకా వెలుగులోకి రానిఘటనలు వేలల్లోనే ఉంటాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, ఢిల్లీ ఇలా ప్రతి రాష్ట్రంలో ఇలాంటి శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. అనేకసార్లు ముఠాలు పట్టుబడుతున్నాయి. అంతేకాకుండా కిడ్నీ మార్పిళ్ల కోసం పలువురిని విదేశాలకు పంపిన ఘటనలు సైతం వెలుగుచూశాయి. అవయవాలు అవసరమున్న వారు,దానం చేయాలనుకునే వారు ముందుగా జీవన్ దాన్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ అవసరమైనవారు ఎక్కువ, దాతలు తక్కువగా ఉంటున్నారు. అవయవాలకు డిమాండ్ పెరగడంతో డబ్బుల చూపి అక్రమ మార్గంలో వాటిని పొందేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో కొందరు ముఠాలుగా ఏర్పడి పేదల ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకొని వారికి డబ్బుల ఆశచూపి అవయవదానానికి ఒప్పిస్తున్నారు. అయితే కిడ్నీ వ్యాధిగ్రస్తుడు కుటుంబ సభ్యులు, లేదా సమీప బంధువుల నుంచి కిడ్నీని పొందొచ్చు. అయితే



ముఠాలు ఎలాంటి బంధుత్వం లేకున్నా వారిని బంధువులుగా చూపించేలా ఫోర్జరీ డాక్యుమెంట్లు తయారు చేసి కిడ్నీ మార్పిడీ సర్జరీలు చేయిస్తున్నాయి. గతంలో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స కోసం నకిలీ పత్రాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తుండగా విజయవాడలోని భవానీపురం తహశీల్దార్ గుర్తించి ఆ దరఖాస్తును తిరస్కరించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫేక్ డాక్యుమెంట్స్‌తో ఢిల్లీ, పంజాబ్, హర్యానా, మధ్యప్రదేశ్, గుజరాత్ లో కిడ్నీ మార్పిడి సర్జరీలు చేయిస్తున్న ముఠాను గతంలో ఢిల్లీ క్రైంబ్రాంచ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే అవయవ మార్పిడిల్లో కిడ్నీ సర్జరీలే ఎక్కువగా ఉండడం గమనార్హం. సోషల్ మీడియా ద్వారానూ కొన్ని ముఠాలు అక్రమ అవయవ వ్యాపారం చేస్తున్నట్లు తెలుస్తున్నది. మానవ అవయవాలను విక్రయించేందుకు ఓ ప్రముఖ ఆస్పత్రి వెబ్‌సైట్‌ను పోలి ఉన్న ఓ నకిలీ వెబ్‌సైట్‌ను కొందరు రూపొందించినట్లు 2023లో అధికారులు గుర్తించారు. ఈ ఘటనలో ఇద్దరు ఆఫ్రికన్ పౌరులతో సహా ఐదుగురిని చెన్నై పోలీసులు బెంగళూరులో అరెస్టు చేశారు. ఊపిరితిత్తులు, కిడ్నీలు వంటి మానవ అవయవాలను మార్పిడి చేయడానికి ఈ ముఠా రూ.5 కోట్ల వరకు ధర చెబుతున్నట్లు పోలీసులు తెలిపారు. అవయవదానం పేరుతో ఫేస్‌బుక్ అడ్డాగా దందా సాగిస్తున్న గ్యాంగ్‌ను గతంలో రాచకొండ పోలీసులు అరెస్ట్‌చేశారు. అవయవ మార్పిడి కోసం దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఎదురుచూస్తున్నారు. ఇందులో కిడ్నీ మార్పిడి కోసం ఎదురుచూస్తున్న వారే సుమారు పది లక్షల వరకు ఉంటారని అంచనా. అయితే ఎవరైనా బ్రెయిన్ డెడ్ అయితే వారి బంధువుల అనుమతితో అవయవదానం చేయవచ్చు. రెండు కిడ్నీలు, రెండు కళ్లు, రెండు ఊపిరితిత్తులు, కాలేయం, గుండె ఇలా ఒక మనిషి అవయవదానం చేస్తే ఎనిమిది మందికి ప్రాణం పోయవచ్చు. దేశంలో వివిధ ప్రమాదాల్లో రెండు లక్షల నుంచి మూడు లక్షల మంది వరకు మరణిస్తున్నారు.అయితే అవయవదానంపై సరైన అవగాహన లేకపోవడంతో ప్రమాదాల్లో మరణించినవారు, బ్రెయిన్‌డెడ్ అయిన వారి కుటుంబ సభ్యులు ముందుకు రావడంలేదు. దీంతో వారి శరీరంలోని అవయవాలు ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా కిడ్నీ ఇచ్చిన వారు, అమర్చుకున్న వారు, సర్జరీ చేసిన వైద్యుడు, అవకాశమిచ్చిన ఆస్పత్రి, మధ్యవర్తులు ఇలా ప్రతి ఒక్కరూ నేరం చేసినట్టేనని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే విచారణ, నేర నిరూపణలో అధికారులు, పోలీసులు విఫలమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. అందుకే మధ్యవర్తుల ముఠాలు పెరిగిపోతున్నట్లు తెలుస్తున్నది. ప్రభుత్వాలు పట్టుబడిన ఆస్పత్రులను సీజ్ చేసి తమ పని అయిపోయినట్టుగా భావించకుండా మధ్యవర్తులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటేనే ఈ దందాకు అడ్డుకట్ట పడే అవకాశముంటుంది. అంతేకాకుండా ఆయా సర్జరీలు చేసిన వైద్యుల లైసెన్సులను శాశ్వతంగా రద్దు చేయడమే కాకుండా నిరంతరంగా ప్రైవేటు ఆస్పత్రుల్లో తనిఖీలు చేపడితే ఇలాంటి సర్జరీలు జరగకుండా నిరోధించవచ్చు. ●

# ప్రజావాక్కు



## పథకాల దుర్వినియోగం సరికాదు

ఒక పథకం పది సంవత్సరాలు పూర్తి చేసుకోవడం అంటే చాలా గొప్పవిషయం. ఏదేశమైనా ఆర్థికాభివృద్ధి సాధించడానికి పరిపూర్ణ ఆరోగ్యం సమకూర్చుకోవడం ముఖ్యం. అయితే 2014ముందు 39శాతం ఉన్న స్వచ్ఛత 2014 తరవాత ప్రజా భాగస్వామ్యం పౌరుల బాధ్యతాయుత వైఖరి మూలంగానే ఇవ్వాళ 93 శాతం మంది మహిళలు డిగ్నిటీ ఆఫ్ లైఫ్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. నేడు భారత దేశంలో ఈ పది సంవత్సరాలలో 11.5 కోట్ల సౌచాలయాలు నిర్మాణం చేసి ఇవ్వాళ ఓడీఫ్ నుండి ఓడీఫ్ ప్లేస్ వరకుప్రయాణంసాగుతోంది. ఈ ప్రయాణంలో సుస్థిరాభివృద్ధిలక్ష్యాలలో మూడో లక్ష్యమైన అందరికి ఆరోగ్యం, ఐదవ లక్ష్యం అయిన జెండర్ సమానత్వంను సాధించే వైపుగా ప్రయాణం చేస్తున్నది. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో ఆరోవ లక్ష్యంలో శుభ్రత కూడా చేకూరుతుంది అయితే దీనివల్లభారతఆర్థికవ్యవస్థకు 6శాతంవృద్ధి చేకూరుతుంది.

-భారత అవినాష్, జనగామ

## వలంటీర్ల పరిస్థితి ఏమిటి?

రాష్ట్రంలో గత వై.సీ.పీహయాంలో వలంటీర్ వ్యవస్థ మొదలైంది. సంక్షేమ పథకాలవిషయంలో లబ్ధిదారులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఈ వ్యవస్థను ప్రారంభించారు. గత ప్రభుత్వం వాలంటీర్లకు నెలకు 5 వేల రూపాయలు మాత్రమేఇచ్చి బండచాకిరీ చేయించుకుంది.డిగ్రీలు, పీజీలు, బీటెక్ చేసిన యువత ప్రభుత్వ సర్వీస్ అవుతుందనే ఆశతో తక్కువ వేతనానికేపనిచేసారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం వలంటీర్లకు న్యాయం చేసేలా ప్రస్తుత ప్రభుత్వం మానవతా దృక్పథంతో తగిన చర్యలు తీసుకోవాలి.

- ఆర్. కృష్ణ , గోపంపల్లి

## ఉపాధ్యాయుల కొరత

తెలంగాణ ఆదర్శ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. విద్యార్థులకు ఒక్కవ్యాయామ ఉపాధ్యాయుడు కూడా లేడు. గంటల తరపున ఉపాధ్యాయులను వలంటీర్లుగా నియమించుకుని అరకొర జీతాలతో నెట్టుకుస్తుంది ప్రభుత్వం. ఉపాధ్యాయుల కొరత వలన విద్యార్థులలో క్రమశిక్షణ లోపిస్తుంది. ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి ఇకనైనా ఉపాధ్యాయులను నియమించాలి.

-గూరుడు ప్రశాంత్, గోధుర్, జగిత్యాల జిల్లా

## తీగల కింద చెట్లు నాటొద్దు

పచ్చదనం కోసంరోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటడం చేస్తుంటారు. రోడ్ల వెంబడి విద్యుత్తు లైను నడపబడి ఉన్నా అవేవీ పట్టించుకోకుండా మొక్కలునాటేస్తున్నారు.అవి పెరిగి పెద్దయ్యాక విద్యుత్ తీగలకు అడ్డు వస్తుండడంతో వాటి కొమ్మలు కొట్టి వేసి మోడుగా మిగిలిస్తున్నారు. మొక్కలను నాటి వాటికి నీరుపోసి,జంతువులనుండి కాపాడేందుకు ఫెన్సింగ్‌వేసి వాటిని చెట్లుగా మార్చడం చాలా వ్యయ ప్రయాసతో కూడిన పని. ఇంత చేశాక విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మొక్కలను ఎదగనీయకుండా కొమ్మలునరకడం తరచుగా చూస్తున్నాం. తద్వారా ప్రయాణికులకు నీడ,మంచిగాలి దూరమవుతున్నాయి. విద్యుత్తు తీగలకింద మొక్కలు నాటకుండా చూడాలి. విద్యుత్ తీగలు లేని వైపు మాత్రమే మొక్కలను నాటాలి.

-డి. వెంకటరెడ్డి, నెల్లూరుజిల్లా

## శబ్దకాలుష్యాన్ని నివారించాలి

శబ్ద కాలుష్యం ఆరోగ్యాన్ని, ప్రవర్తనను రెండింటినీ ప్రభావితం చేస్తుంది. అవాంఛిత ధ్వని(మోత)శారీరక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది.శబ్దకాలుష్యానికి అనేక ఆరోగ్యపరిస్థితులకూ సంబంధం ఉంది. వీటిలో హృదయ సంబంధ రుగ్మతలు,రక్తపోటు, అధిక ఒత్తిడి స్థాయిలు, టిన్నిటస్, వినికిడి లోపం, నిద్రలేమి, ఇతర హానికారక, కలతపెట్టే ప్రభావాలు ఉన్నాయి. 55 డెసిబెల్స్ కు పైబడి ఉండే మోతలు మానవ ఆరోగ్యానికి హానికరం.

-సింగు. లక్ష్మీనారాయణ, భూపాలపల్లి

## ఉపాధి కల్పనే పెద్ద సవాల్

యువతకు ఉద్యోగ,ఉపాధిఅవకాశాలు కల్పించడమే దేశం ఎదుర్కొనే అతి పెద్దసవాల్ అనిఇటీవలి రాయిటస్ సంస్థ అధ్యయనం తెలియజేస్తోంది.గ్రామీణ ప్రాంతాల్లో వినియోగం పెరగకపోవడం, ఆరు శాతం మంది పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నాలుగు శాతంమంది పేదరికాన్ని ప్రధాన సమస్యలుగా సదరు అధ్యయనం పేర్కొంది.2023 అక్టోబర్‌నుంచి డిసెంబర్ త్రైమాసికంలో 2024 ఏళ్ల మధ్య యువతలో నిరుద్యోగం 44.49 శాతానికి పెరిగిందని,, మార్చి 2021 నాటికి దేశ వ్యాప్తంగా 9.79 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం నివేదిక తెలియజేస్తోంది.ఇందులో ఒక్కరైల్వేలోనే 2.93 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాల్సిఉంది. ఇవికాక,వివిధ రాష్ట్రాల్లో భర్తీ చేయాల్సిన ప్రభుత్వఉద్యోగాలూ లక్షల సంఖ్యలోనే ఉన్నాయి.

-సి.హెచ్.ప్రతాప్. కోటి వీధి, శ్రీకాకుళం

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఒకరోజు వాహనసేవలకు సిద్ధం !



**తిరుమల,జనవరి 31ప్రభాతవార్తప్రతినిధి:** రానున్న మంగళవారం రథసప్తమి పర్వదినం సందర్భంగా ఒకేరోజు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తి మలయప్పస్వామి ఏడువాహనాలపై ఊరేగనున్నారు. ఉదయం 5.30గంటల నుండి రాత్రి 8గంటల వరకు జరిగే ఈ వేడుకలకు 2లక్షలమందికిపైగా భక్తులు తరలివస్తారని అంచనావేసి తదనుగుణంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పటిష్ట ఏర్పాట్లపై శుక్రవారం ఉదయం తిరుమల అన్నమయ్యభవనంలో టిటిడి పాలకమండలి ఛైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షతన అత్యవసర సమావేశం జరిగింది. టిటిడి బోర్డుసభ్యులు, టిటిడి ఇఒ జె.శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఇఒ వీరబ్రహ్మాం, ఇన్‌ఛార్జి సివిఎస్‌ఒ మణికంఠచందోలు,టిటిడి సిపిఆర్‌ఒ డాక్టర్ తలారిరవి తదితర అధికారులతో గంటన్నరకుగాపై సమీక్షించారు. అనంతరం ఛైర్మన్ నాయుడు వివరాలను మీడియాప్రతినిధులకు వెల్లడించారు. ఫిబ్రవరి 4వతేదీ రానున్న మంగళవారం సూర్యజయంతి పర్వదినం పురస్కరించుకుని మలయప్పస్వామి ఉత్సవమూర్తి ఉదయం 5.30గంటలకు తోలివాహనసేవగా సూర్యప్రభపై ఆలయమాఢవీధుల్లో ఊరేగనున్నారు. ఆ రోజు ఉదయం 6.44గంటలకు సూర్యోదయం కానున్నందున సూర్యకిరణాలు స్వామివారిపై ప్రసరిస్తాయన్నారు. అనంతరం ఉదయం 9గంటలకు చిన్నశేషవాహనం ఇలా రాత్రి 8గంటలకు చంద్రప్రభవాహన సేవలు ఉంటాయన్నారు. గత అనుభవాల దృష్ట్యా భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. మాఢవీధుల్లోని గ్యాలరీల్లో పోలీసులు, శ్రీవారిసేవకులు, ఎస్‌పిఎఫ్, ఆక్టోపస్, విజిలెన్స్ బలగాలు భద్రతాపరంగా, సేవలకు సిద్దంగా ఉంటారన్నారు. దాదాపు 3లక్షలమంది లోపు భక్తులు రావచ్చని అంచనాతో అన్ని ఏర్పాట్లు తీసుకున్నామన్నారు. ఆలయం ముందు, మాఢవీధుల్లో గ్యాలరీలు, జర్మన్‌షెడ్లను ఏర్పాటుచేశారు. ఉదయం నుండి రాత్రి వరకు నిరంతరాయంగా భక్తులకు అన్నప్రసాదాలు, తాగునీరు. టీ,కాఫీ,పాలు అందించేలా శ్రీవారిసేవకులు, టిటిడి ఉద్యోగులనునియవి ఎస్తున్నా మన్నారు. తిరుమలలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారని, అదనపు పార్కింగ్ ప్రదేశాలకు సూచిక బోర్డులు ఏర్పాటుచేస్తున్నారు. భక్తులకు ఉదయం నుండిరాత్రి వరకు చలికి, ఎండకు ఇబ్బందులు కలగకుండా మాఢవీధుల్లో అవసరమైన చర్యలు తీసుకున్నారు. 8లక్షల లడ్డూలు అదనంగా నిల్వఉంచడం జరుగుతుందన్నారు.

**- సీనియర్ అధికారులతో మాడవీధుల్లో పర్యవేక్షణ**
**- సమన్వయంతో మెరుగైన భద్రతా ఏర్పాట్లు**
**- అత్యవసర సమావేశంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు**

**- 4న అన్ని దర్శనాలు రద్దు:** 4వతేదీ మంగళవారం అన్ని ఆర్జితసేవలు, ఇతర ప్రత్యేక దర్శనాలు, సిఫార్సు దర్శనాలు, బ్రేక్ దర్శనాలు పూర్తిగా రద్దుచేశామని ఛైర్మన్ బిఆర్‌నాయుడు తెలిపారు. ఆ రోజు ఉదయం ప్రోటోకాల్ పరిధిలోని ప్రముఖులకు మాత్రమే బ్రేక్ దర్శనం ఉంటుంది. వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులకు ప్రత్యేక దర్శనాలు రద్దుచేశారు. తిరుమలకు అశేష సంఖ్యలో విచ్చేసే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఫిబ్రవరి 3వతేదీ నుండి 5వరకు తిరుపతిలోని కౌంటర్లలో ఆఫ్‌లైన్‌లో సర్వదర్శనం టైమ్‌స్లాట్ టోకెన్లు జారీని నిలుపుదలచేశారు. తిరుమలలో ఎల్‌ఇడి స్క్రీన్లు ఏర్పాటుచేసి వాహనసేవలను ప్రత్యక్షప్రసారం చేస్తామన్నారు. ఎప్పటికప్పుడు భక్తులకు సమాచారం అందించేందుకు పబ్లిక్ అడ్రసింగ్ విధానం కూడా అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు.

**- ఉదయం నుండి రాత్రి వరకు వాహనసేవలు:** 4వతేదీ ఉదయం 5.30గంటలకు తొలివాహనంగా సూర్యప్రభవాహనం మొదలై ఉదయం 8గంటల వరకు మాఢవీధుల్లో ఊరేగనుంది. ఉదయం 9గంటల నుండి 10గంటల వరకు చిన్నశేషవాహనం, ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు గరుడవాహనం, మధ్యాహ్నం 1నుండి 2గంటల వరకు హనుమంతవాహనం, మధ్యాహ్నం 2గంటల నుండి 3గంటల వరకు చక్రస్నానమహోత్సవం, సాయంత్రం 4గంటల నుండి 5గంటల వరకు కల్పవృక్షవాహనం, సాయంత్రం 6గంటల నుండి 7గంటల వరకు సర్వభూపాల వాహనం, రాత్రి 8గంటల నుండి 9గంటల వరకు చంద్రప్రభవాహనసేవ చివరగా ముగుస్తుంది.

**- పుష్కరిణిలో పటిష్ట భద్రత:** ఏడువాహనసేవల్లో భాగంగా 4వతేదీ మధ్యాహ్నం చక్రస్నానం జరుగుతుంది. పుష్కరిణిలో భక్తులు పెద్దసంఖ్యలో పవిత్ర స్నానాలాచరించే అవకాశం ఉడటంతో ఎన్‌డిఆర్‌ఎఫ్, గజ ఈత గాళ్ళను సిద్దంగా ఉంచడం జరుగుతుందని ఇఒ శ్యామలరావు తెలిపారు.

# 'న భూతో నభవిష్యత్' అన్నట్లుగా శివరాత్రి ఉత్సవాలు

## ముగ్గురు మంత్రులతో సమీక్ష - దక్షిణ భారత్ సిఎంలకు ఆహ్వానం: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



**శ్రీకాళహస్తి,జనవరి 31 ప్రభాతవార్త** శ్రీకాళ హస్తీశ్వరుని శివరాత్రి బ్రహ్మోత్సవాలు - న భూతో నభవిష్యత్తు' అన్నట్లుగా నిర్వహించ నున్నామని ఎంఎల్‌ఏ వెల్లడించారు.ఇక్కడి పంచాయతీరాజ్ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ళ పాటు రహస్యంగా కొట్లు వెచ్చించి నిర్వహించిన శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో అవకతవకలు,అవినీతి చోటు చేసుకుందన్నారు.కానీ ఈ ఏడాది ఓ వైపు అభివృద్ధి మరో వైపు శివరాత్రిని జవాబుదారి తనం పారదర్శకతతో నిర్వహించుటకు అధికారులను పరుగులు తీయిస్తున్నామన్నారు. శనివారం జిల్లా ఇన్‌చార్జి, రెవెన్యూశాఖమంత్రి సత్యకుమార్, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిలు విచ్చేస్తున్నారని అంతే కాకుండా శివరాత్రిపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. నలుగురు సిఎంలు అయిన నారాచంద్రబాబు నాయుడు, తెలంగాణా సిఎం రేవంత్‌రెడ్డి, తమిళనాడు సిఎం స్టాలిన్, మహారాష్ట్ర సిఎంలను ప్రత్యేకంగా కలవడంతో పాటు కేంద్రంలో ప్రధాని మోడీ, అమిత్‌షా, ఇతర మంత్రులను ప్రత్యేకంగా కలసి శివరాత్రులకు ఆహ్వానించడంతో పాటు సినీనటుడు అమితా బచ్చన్, చిరంజీవి, నాగార్జున, వెంకటేష్‌లను ఆహ్వానిస్తామన్నారు. శివరాత్రికి రూ.500 టిక్కెట్టులను రూ.200లకు స్థానికులకు ఇస్తామన్నారు. రెండు రోజులు స్థానికులకు ఆధార్‌కార్డుతో ఉచిత దర్శనం కల్పించనున్నా మన్నారు. నారాలోకేష్ ఇచ్చిన మాట ప్రకారం వాట్సాప్ ఈగవర్నెన్స్ అందుబాటులోకి తెచ్చి ఇందులో 161 సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. శివరాత్రికి ఇప్పటికే ముంబాయి, డిల్లీనుంచి లైటింగ్‌లు తెప్పిం చామని హైదరాబాదు నుంచి పూలడెకరేషన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 1వ గేటు నుంచి రూ.200 టిక్కెట్లు పొందిన భక్తులు, 3వ గేటు నుంచి రూ.500 టిక్కెట్లు తీసుకున్న భక్తులు, 4వ గేటు నుంచి విఐపిలకు ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. విఐపిలతో పాటు నలుగురికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. వృద్దులు, చిన్నారుల తల్లిదండ్రులు రూ.200 టిక్కెట్లు తీసుకున్నా వారిని రూ.500లుతో పంపిస్తామన్నారు.

**వ్యవసాయానికి ప్రాధాన్యత:ప్రాజెక్టుల పూర్తికి చర్యలు:** శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేసే ఎస్‌ఎస్‌కెనాల్‌పూర్తి, మల్లెమడుగు, స్కిట్‌లు మూడు సంవత్సరాల్లో అందుబాటులోకి వస్తాయన్నారు. బెల్ ప్రాజెక్టులు అమలు చేయడమే లక్ష్యం అన్నారు. గ్రామాల్లో స్మశానాలకు దారులు ఏర్పాటు చేసి అక్కడ బోరు, ప్రహరీగోడ అందబాటులోకి తెస్తామన్నారు. రూ.22లక్షలతో కళ్ళిపూడి వద్ద ఉన్న తెలుగుగంగ కాలువపై బ్రిడ్జి ఏర్పాటు చేస్తామన్నారు. మరో రెండు మూడు రోజుల్లో ఇందుకు టెండర్లు పిలుస్తామన్నారు. శివం టు శివం రోడ్డుకు త్వరలోనే టెంకాయకొడు తామన్నారు. చకచకా శివరాత్రి పనులు చేస్తున్నామన్నారు.

## మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసిన సివిల్ సప్లై కమిషనర్ సౌరభ్ గౌర్ ఐఎఎస్

**విజయవాడ జనవరి 31 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సివిల్ సప్లై కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సౌరభ్ గౌర్ ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిశారు. ఈ సమావేశంలో సచివాలయంలోని రెండో బ్లాక్‌లో ఉన్న మంత్రి కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పౌరసరఫరాల వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించడం నాణ్యమైన సేవలను ప్రజలకు చేరువ చేయడం వంటి అంశాలపై చర్చించారు. మంత్రి నాదెండ్ల మనోహర్, ప్రజలకు నాణ్యమైన మరియు పారదర్శక సేవలు అందించేందుకు పాలనలో సమర్థతను పెంచాలని సూచించారు. కమిషనర్ సౌరబ్ గౌర్ ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# సీమలో రైల్వే జిఎం విస్తృత తనిఖీలు



సీమలో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్న రైల్వే జీఎం జైన్

**గుంతకల్లు రైల్వే,జనవరి 31,ప్రభాత వార్త** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ గుంతకల్లు రైల్వే డివిజన్‌లో రాయలసీమ జిల్లాలలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. వార్షిక తనిఖీలలో భాగంగా ముందుగా నిర్ణయించిన కార్యక్రమం ప్రకారం గుంతకల్లు డిఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తాతో పాటు జోన్,డివిజన్‌కు చెందిన సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి ఆయన తిరుపతి,తిరుచానూరు,రాజంపేట,కడప రైల్వే స్టేషన్లను తనిఖీ చేశారు. తిరుచానూరులో రైల్వే సిబ్బంది సౌకర్యార్థం నిర్మిస్తున్న రైల్వే కళ్యాణ్ మండపాన్ని ఆయన శంకుస్థాపన చేశారు. పలుచోట్ల రైలు మార్గాన్ని పరిశీలించారు. అనంతరం గుంతకల్లు చేరుకొని సంబంధిత ఉన్నతాధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించి ఆర్థిక సంవత్సరం ముగింపుకు మరో రెండు మాసాలే ఉన్నందున నిర్దేశిత లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు. అదనపు డిఆర్‌ఎం సుధాకర్,ఆయా విభాగాలకు చెందిన సంబంధిత ఉన్నతాధికారులు శ్రీనివాస్, మనోజ్, శ్రావణ్‌కుమార్, మురళీకృష్ణ,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# డా.ప్రభావతికి సుప్రీంలో ఊరట

## డి.స్పీకర్ రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసు

**విజయవాడ,జనవరి31,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ శాసనసభ ప్రస్తుత డిప్యూటీ స్పీకర్, ఎంపీగా ఉన్న సమయంలో రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో డాక్టర్ ప్రభావతికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. హైకోర్టు తీర్పుపై సుప్రీం ధర్మాసనం స్టే విధించింది. అయితే విచారణకు సహకరించాలని ప్రభావతిని ఆదేశించింది. ఈ కేసులో నిందితురాలిగా ఉన్న ప్రభావతికి ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు ఏపీ హైకోర్టు నిరాకరించింది. కేసు విచాణ దశలో ఉన్నందున ఆమె దాఖలు చేసిన యాంటిసిపేటరీ బెయిల్‌ను మంజూరు చేయడానికి హైకోర్టు తిరస్కరించింది. అంతకు ముందు గుంటూరు జిల్లా కోర్టుకు ఆమె ముందస్తు బెయిల్ పిటిషన్ తోసిపుచ్చింది.ఈ నేపథ్యంలో హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో ఆమె సవాల్ చేశారు. ప్రభావతి పిటిషన్ ను జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం విచారించింది.రఘురామ ఈ కేసులో కెవియట్ పిటిషన్ దాఖలు చేసారు.ఈ కేసులో తన వాదనలు వినాలను ఆయన తన న్యాయవాది ద్వారా కోర్టును అభ్యర్థించారు.వీటిని పరిశీలించిన ధర్మాసనం ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఆ తర్వాత 2 వారాల్లో రిజాయిండర్ దాఖలు చేయాలని పిటిషనర్‌ను ఆదేశించింది. విచారణకు డాక్టర్ ప్రభావతి హాజరుకావాలని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలిచ్చింది. తదుపరి ఉత్తర్వుల వరకు హైకోర్టు ఆదేశాలపై స్టే ఇచ్చిన ధర్మాసనం, 4 వారాలకు విచారణను వాయిదా వేసింది. రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో ఏ5గా ప్రభావతి ఉన్నారు.

# క్షతగాత్రులకు సాయం అందించేవారికి.. నగదు బహుమతులు

## - మంత్రి సత్యకుమార్ యాదవ్

**తిరుపతి హెల్త్, జనవరి 31 ప్రభాతవార్త :** క్షతగాత్రులకు సాయం అందించే వారికి నగదు బహుమతులు అందజేయనున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్విమ్స్ సర్కిల్‌లో జిల్లా రవాణాశాఖాధికారి కొర్రపాటి మురళీ మోహన్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్, మోటార్ వాహనాల తనిఖీ అధికారి అతికానాజ్, రహదారి భద్రతా విభాగ వైద్యురాలు డాక్టర్ పూజవాణి ఉపాధ్యాయ గుడ్ సమారిటన్ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. రహదారి ప్రమాదాలు జరిగినపుడు క్షతగాత్రులని తక్షణమే వైద్యశాలకు తరలించే ప్రక్రియలో సహాయ పడే ఒక మంచి సమారిటన్‌ను గుర్తించి వారికి ప్రోత్సాహకంగా బహుమతి రూపంలో రూ. 5వేలు నగదులో పాటు ప్రశంసా పత్రాన్ని ఇవ్వడం జరుగుతుందని, ఈ సందర్భంగా జిల్లా వైద్య శాఖ అధికారి తెలియజేశారు. అంతే కాకుండా వారికి పోలీస్, న్యాయం సాయం అందిస్తామని మోటార్ వాహనాల తనిఖీ అధికారి అతికా నాజ్ అన్నారు. వైద్యురాలు పూజా వాణి జయరాం మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం జరిగిన మొదట గంట అంటే గోల్డ్ అవర్‌లోపు బాధితులకి సరైన వైద్య చికిత్స అందితే ప్రాణాలు కాపాడవచ్చునన్నారు. ఈ సందర్భంగా పాత మెటర్నిటీ ఆస్పత్రి నుంచి స్విమ్స్ ఆస్పత్రి వరకు జిల్లా ప్రధాన వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయ సిబ్బందితో ప్రచార ర్యాలీని నిర్వహించారు.

# తిరుమల సమాచారం

## ఎస్వీఅన్నప్రసాదం ట్రస్ట్‌కు భారీ విరాళం



**తిరుమల,జనవరి 31ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామిపై భక్తివిశ్వాసాలతో దాత లు పలు పథకాలు, ట్రస్ట్‌లకు భారీమొత్తంలో విరాళాలను అందిస్తున్నారు. శుక్రవారం ఉదయం తమిళనాడు చెన్నైకి చెందిన క్యాపిటల్ కంపెనీ ఎండి,సిఇఒ వెంకటేశ్ కన్నప్పన్ టిటిడి ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు ఒకకోటి రూపాయలు విరాళాల డిడిని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందజేశారు.

## తొక్కిసలాట ఘటనలో గాయపడిన బాధితురాలికి పరిహారం అందజేత



**తిరుమల,జనవరి 31ప్రభాతవార్త ప్రతినిధి:** పదిరోజుల వైకుంఠ ద్వార దర్శనానికి వచ్చి తిరుపతిలో 8వతేదీ జరిగిన తొక్కిసలాటలో గాయపడి కోలుకున్న బాధితురాలికి టిటిడి ఆర్థిక పరిహారాన్ని అందజేసింది. కడపజిల్లా వీరనాయనపల్లి మండలం సర్వరాజుపేటకాలనీకి చెందిన జి.శైలజ 8వతేదీ జరిగిన తొక్కిసలాటలో గాయపడింది. వైద్యచికిత్సలనంతరం కోలుకుంది. ఆమెకు శుక్రవారం తిరుమలలో జరిగిన పాలకమండలి సమావేశానికి ముందు క్యాంపు కార్యాలయంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు ,బోర్డుసభ్యులు జ్యోతులనెహ్రూ, శాంతారాం 2లక్షల రూపాయలు డిడిని ఆమెకు అందజేశారు.

## అసౌకర్యం లేకుండా సాఫీగా ప్రవేశనిష్క్రమణ మార్గాలు

### - భక్తులకు సౌకర్యవంతంగా ఏర్పాట్లు



**తిరుమల,జనవరి 31ప్రభాత వార్తప్రతి నిధి:** సూర్య జయంతి పర్వదినం ఫిబ్రవరి 4వతేదీ రానున్న మంగళ వారం రథసప్తమిన ఏడువాహనాలపై ఏడుకొండలస్వామి భక్తులకు కటాక్షించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం నుండి రాత్రి వరకు ఆలయ మాఢవీధుల్లో ఏడువాహనాల వీక్షణకు 3లక్షల మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున గ్యాలరీల్లోకి సాఫీగా ప్రవేశించేలా ,తిరిగి వెలుపలకు వెళ్ళేలా ప్రవేశ,నిష్క్రమణ మార్గాలు ఏర్పాటుచేయడం జరిగింది. మాఢవీధుల్లో అత్యాధునిక సౌకర్యాలతో జర్మన్‌షెడ్లు నిర్మించారు. అందులో అత్యవసర మరుగుదొడ్లు సదుపాయం, అగ్నిమాపక నివారణ పరికరాలు, పోలీసు,విజిలెన్స్, ఆక్టోపస్, ఎస్‌పిఎఫ్ బలగాలతో భద్రతను పర్యవేక్షిస్తారు. మాఢవీధుల్లోని గ్యాలరీల్లో 1.25లక్షలమంది భక్తులు వేచివుండే అవకాశం ఉంది.

వీరందరినీ మంగళవారం వేకువజాము నుండే మాఢవీధుల్లోని గ్యాలరీల్లోకి అనుమతించడం, నిష్క్రమణ ద్వారాలు ,అత్యవసరగేట్లను శుక్రవారం మధ్యాహ్నం టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, నర్శిరెడ్డి,పనబాకలక్ష్మి, జ్యోతులనెహ్రూ, ఆనంద్‌సాయి. ఎంఎస్‌రాజు, శాంతారామ్, నరేశ్, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ వెంకయ్యచౌదరి, సివిఎస్‌ఒ మణికంఠచందోలు, సిపిఆర్‌ఒ డాక్టర్ తలారి రవి, సిఎస్‌ఒలు ఎస్టీవిరామ్‌కుమార్, సురేంద్రతో కలసి తనిఖీ చేశారు. గత అనుభవాలను, అపశృతులు,విషాదఘటనలను దృష్టిలో ఉంచుకుని రథసప్తమికి పటిష్టంగా ఏర్పాట్లు చేయడంతోబాటు భక్తుల నియంత్రణపై సమన్వయంతో వ్యవహరించాలని ఆదేశించారు. భక్తులు గ్యాలరీల్లోకి చేరుకున్న తరువాత నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు, టీ,కాఫీ పంపిణీ, మరుగుదోడ్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. గ్యాలరీల్లో నిరంతరం పర్యవేక్షణ ఉండాలని ఛైర్మన్ నాయుడు అధికారులను ఆదేశించారు.

# అప్పులపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి:

## వైఎస్సార్‌సి అధికార ప్రతినిధి కాకుమాను రాజశేఖర్




**విజయవాడ జనవరి 31 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏడు నెలల్లో చేసిన రూ.1.19 కోట్ల అప్పులపై వెంటనే శ్వేతపత్రం విడుదల చేసి, ఆ అప్పు ఎలా ఖర్చు చేశారో చెప్పాలని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కాకుమాను రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఆ బాధ్యత కచ్చితంగా సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై ఉందని ఆయన తేల్చి చెప్పారు. రాజకీయాల్లో తనంత అనుభవజ్ఞుడు లేడని చెప్పే చంద్రబాబు ఎన్నికల ముందు గొప్పగా ప్రచారం చేసిన సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయకుండా సాకులు చెప్పడం సరికాదని స్పష్టం చేశారు. కరోనా సంక్షోభంలో ఎలాగైతే వైఎస్ జగన్ సంక్షేమ పథకాలను కొనసాగించారో అదే స్పూర్తితో సీఎం చంద్రబాబు పని చేయాలని సూచించారు. పథకాలు అమలు చేయబోమని చంద్రబాబు చెబుతున్నా పవన్‌కల్యాన్ తేలు కుట్టినా దొంగలా సైలెంట్‌గా ఉండటానికి కారణమేంటని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కాకుమాను రాజశేఖర్ ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో చంద్రబాబు తన చేతగాని తనాన్ని కప్పి పూచ్చుకోవడానికి అభూత కల్పనలతో అబద్దాలు ప్రచారం చేస్తున్నారన్నారు.కేవలం ఏడు నెలల కాలంలో ప్రజలు చంద్రబాబు చేతిలో మరో సారి మోసపోయామనే ఆవేదనతో ఉన్నారన్నారు.ఇప్పటి ప్రభుత్వం అప్పులు భారీగా ఎందుకు చేస్తుందో కచ్చితంగా ప్రజలకు తెలియాల్సి ఉందన్నారు.

# విత్తు ఒక్కటే.. మొక్కలు మూడు!



**అంబాజీపేట,జనవరి 31, ప్రభాతవార్త:** భూమిలో పాతిన విత్తు ఒక్కటే.. కాని ఆ విత్తు నిండి మొలిచిన మొక్కలు మూడు.. సాధారణంగా ఒక కొబ్బరి కాయ నుండి ఒక మొక్క మాత్రమే మొలుస్తుంది.కొన్ని సందర్భాలలో రెండు మొక్కలు కూడా మొలుస్తుంటాయి. అదే కొబ్బరికాయకు మూడు మొక్కలు మొలిచి మరింత ఆశ్చర్యపర్చింది.అలాంటి ఆశ్చర్యానికి వేదికయ్యింది స్థానిక పశువుల సంత సమీపంలోని హడ్కో కాలనీ శివారులో ఉన్న సూదాబత్తుల శ్రీనివాసరావు వ్యవసాయ క్షేత్రం.శ్రీనివాసరావు తన కొబ్బరి తోటలో చెట్ల నుండి రాలి పడిన కొన్ని కొబ్బరికాయలను పాతిపెట్టారు. పాతిన మూడు నెలలకు చూడగా ఒక కొబ్బరికాయ నుండి మూడు మొక్కలు మొలిచినట్లు గుర్తించారు. స్థానికులు సమాచారంతో కొబ్బరి మొక్కలను ఆసక్తిగా తిలకించేందుకు రైతులు, స్థానికులు వస్తున్నారు.ఈ విషయంపై స్థానిక కొబ్బరి పరిశోధనా కేంద్ర అధిపతి డాక్టర్ ఎన్. బి.వి.చలపతిరావును వివరణ కోరగా జన్యుపర లోపం వల్ల మూడు మొక్కలు మొలుస్తాయన్నారు. మానవులలో ఒక్కొక్క సారి ఇద్దరు కవల పిల్లలు, (ట్విన్స్)మరికొన్ని సందర్భాల్లో ముగ్గురు(ట్రిప్లేట్స్ )జన్మిస్తుం టారని, అలాగే మొక్కలలో కూడా జరుగుతుందన్నారు. ఏది ఏమైనప్పటికీ ఒక కొబ్బరి కాయ నుండి మూడు మొక్కలు మొలవటం వింతైన విషయమని డాక్టర్ చలపతిరావు పేర్కొన్నారు.

# చుండూరు వెంకటరెడ్డి సేవలు చిరస్మరణీయం



విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు పంపిణీ చేస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, జనవరి 31, ప్రభాతవార్త :** దుర్గమ్మవారి ఆలయంకు ఉపసంస్థ అయిన సివిరెడ్డి చారిటీస్ సంస్థ కు చెందిన ధార్మిక రత్న చుండూరు వెంకటరెడ్డి సేవలు చిరస్మరణీయమని శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం డిప్యూటి ఇఒ ఎం రత్నరాజు అన్నారు. శుక్రవారం సివి రెడ్డి చారిటీస్ ప్రాంగణంలో ధార్మిక రత్న చుండూరు వేంకటరెడ్డి 44వ సంస్మరణ సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తదుపరి పేదవిద్యార్థులకు స్కాలర్‌షిప్పులు, పేదలకు బట్టలు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

**- దుర్గమ్మ ఆలయంలో ఇద్దరి పదవీవిరమణ:** దుర్గమ్మ ఆలయంలో డిప్యూటి ఇంజనీర్ వేంకటేశ్వరరావు, పర్యవేక్షకుడు అమృతరావు సుమారు ముప్పై సంవత్సరాల సేవలందించి శుక్రవారం పదవీవిరమణ చేస్తున్న సందర్భంగా ఇఒ కె రామచంద్రమోహన్ ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రిటైరైన ఉద్యోగులకు ఘనంగా డిప్యూటిఇఒ ఎం రత్నరాజు, ఇతర అధికారులు, సిబ్బంది సత్కరించారు. రిటైరైన వారు దుర్గమ్మవారి పంచహారతుల సేవలో పాల్గొన్న అనంతరం వారికి దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలను డిప్యూటి ఇఒ అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు. ఇతర అధికారులు, ఏఇఒలు, సిబ్బంది వారికి శుభాకాంక్షలు తెలిపారు.



పదవీవిరమణ చేసిన ఉద్యోగులకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

# 7వమైలు వద్ద ఇఒ ఆకస్మికతనిఖీలు



**తిరుమల,జనవరి 31ప్రభాతవార్తప్రతినిధి:** రథసప్తమికి ముందే తిరుమల మొదటిఘాట్‌లో నడకదారిలో 7వమైలు సమీపంలో టిటిడి ఇఒ జె.శ్యామలరావు సాధారణభక్తుడిలా ఆకస్మిక తనిఖీలు చేశారు. శుక్రవారం రాత్రి ఆయన తిరుపతికి దిగే సమయంలో గాలిగోపురం, 7వమైలు ప్రాంతాల్లోని దుకాణాలను, వాటి లైసెన్స్‌లను, పారిశుధ్యం వాటిపై ఆకస్మికంగా తనిఖీ చేయడంతో దుకాణాదారులు ఒకింత ఆశ్చర్యచకితులయ్యారు. వెంట ఎవరినీ తీసు కెళ్ళకుండా ఈ తనిఖీలు చేయడం విశేషం.

# కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్, టైంస్కేల్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని వినతి


ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**విజయవాడ, జనవరి 31, ప్రభాతవార్త :** రాష్ట్రంలో అనేక సంవత్సరాలుగా ప్రభుత్వోద్యోగులతో సమానంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, టైంస్కేల్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని రిజర్వేషన్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు దా పోతుల నాగరాజు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కి వినతిపత్రం శుక్రవారం అందించారు. వారికి ఎటువంటి ఉద్యోగ భద్రత లేక పోవడం తో భవిష్యత్తుపై బెంగతో మానసిక రుగ్మతల బారిన పడుతున్నారని, అనేకమంది ప్రాణాలు కూడా కోల్పోయారని, ఈ తరుణంలో ఆయా ఉద్యోగులపై ఆధారపడ్డ కుటుంబాలు రోడ్డున పడి పలు ఇబ్బందులు పడుతున్నారని వారి బాధలను అర్థం చేసుకుని వెంటనే వారిని రెగ్యులర్ చేయాలని కోరారు.

# వెంటాడుతున్న గత పొరబాట్లు

## 4న తిరుమలలో అంతా సవ్యంగా జరగాలన్న ప్రయత్నాలు



**తిరుమల,జనవరి 31ప్రభాతవార్తప్రతినిధి:** పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలకు ముందే తిరుపతిలో జరిగిన పెద్ద పొరబాట్లు, నిర్లక్ష్యం వెరసి ఆరుగురు భక్తుల ప్రాణాలు తీయడం, 51మందికిపైగా క్షతగాత్రులైన ఘటన టిటిడి చరిత్రలో తొలిసారిగా నమోదైంది.ఈ విషాద ఘటన టిటిడిలో ప్రతి ఒక్కరి బాధ్యతను, భద్రతను కొన్ని ఉత్సవాలు గుర్తుచేసేలా మారాయి. ఆఫ్‌లైన్‌లో వైకుంఠద్వారదర్శనాలకు టైమ్‌స్లాట్ టోకెన్లు అందుకునేందుకు జనవరి 8న తిరుపతికి వచ్చిన పెద్దసంఖ్యలో వేలాదిమంది భక్తులను నియంత్రించడంలో పోలీసు, టిటిడి అధికారులు విఫలమయ్యారనే అపవాదు మూటగట్టుకున్నారు. ఇప్పటికే ఈ ఘటనపై న్యాయవిచారణ జరుగుతున్న తరుణంలో మాఘమాసంలో రానున్న 4వతేదీ మంగళవారం ఒకేరోజు మినీబ్రహ్మోత్సవం ఏడువాహనాలపై మలయప్ప ఊరేగనున్నారు. ఈ వేడుకలకు తమిళనాడు, కర్నాటక,తెలుగురాష్ట్రాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడం పరిపాటి. ఈ నేపథ్యంలో టిటిడి పాలకమండలి పెద్దలు, టిటిడి ఉన్నతాధికారులు మళ్ళీ పొరబాట్లు, తప్పిదాలు జరగకుండా ఎవరికివారే అప్రమత్తమవుతున్నారు. ఇందులో ఒకభాగంగా శుక్రవారం టిటిడి బోర్డు కూడా అత్యవసరంగా సమావేశమై 4వతేదీ భక్తుల భద్రత, ఏర్పాట్లు, సేవలందించడం,అధికారులతో సమన్వయంగా వ్యవహరించడం వంటివాటిపై సమీక్షించడం ప్రాధాన్యతగా మారింది. ఏకంగా ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ శ్యామలరావు,బోర్డు సభ్యులు గతంలో జరిగిన పొరబాట్లు, తప్పులు మళ్లీ జరగకుండా చూడాలనేది వారిలో ప్రస్ఫుటంగా కనిపించిన విషయం. ఉన్నపళంగా బోర్డు సభ్యులు ,అధికారులు బాధ్యతతో ఆలయ మాఢవీధుల్లోని గ్యాలరీలు, జర్మన్‌షెడ్లు, అక్కడ సౌకర్యాలు, భద్రత వరకూ తీసుకోవాల్సిన మరింత జాగ్రత్తలు తదితర వాటిపై నిశితంగా పరిశీలించారు. భక్తులు ప్రశాంతంగా,సాఫీగా గ్యాలరీల్లోకి చేరుకునేలా,తిరిగి బయటకు వెళ్లేలా చూడటంలో పోలీసులు, టిటిడి విజిలెన్స్, ఆక్టోపస్, ఎస్‌పిఎఫ్ బలగాలు అనుక్షణం అప్రమత్తంగా గేట్ల వద్ద కాపలా ఉండాలని ఆదేశించారు. 2లక్షలమంది భక్తులు వచ్చినా మాఢవీధుల్లోని గ్యాలరీల్లో 1.25లక్షలమంది భక్తులు మాత్రమే ఉండే అవకాశంఉంది. అదనంగా భక్తులు తిరుమలలో వేచివుండేలా,వాళ్ళూ వాహనసేవలు వీక్షించేలా పెద్దఎల్‌ఇడి స్క్రీన్లను ఏర్పాటుచేస్తున్నారు. అక్కడా కూడా భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, కాఫీ,టీ,పాలు అందించేలా అదనపు సిబ్బందిని సిద్ధంచేస్తున్నారు. ఎక్కడా కూడా భక్తులు తోపులాటకు తావులేకుండా చూడాలని బోర్డు సభ్యులు సేవకుల సేవలందించేందుకు కొందరు ముందుకురావడం కొసమెరుపు. సాధారణంగా తిరుమలలో ఏడాదిలో తొమ్మిదిరోజులు ఏడుకొండలస్వామికి బ్రహ్మోత్సవాలు జరిగితే ఉదయం,రాత్రి రెండు వాహనాలు ఊరేగుతాయి.

అలాంటిది 4వతేదీ ఒకేరోజు ఏడువాహనసేవలు జరగనుండటం, భక్తులు చక్రస్నాన సమయంలో పవిత్రస్నానాలు పుష్కరిణిలోకి ప్రవేశించే అవకాశం ఉన్నందున క్యూలైన్ల పటిష్టత, అనుమతించే విషయాలపై మరోసారి కీలకంగా పరిశీలించడం బాధ్యతను గుర్తుచేసినట్లవుతోంది. రథసప్తమిని ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించాలనే విషయంపై పాలకమండలి, అధికారులు తలమునకలయ్యారు.

# సెక్రటేరియట్‌లో విజిటర్లపై ఇక నిరంతర నిఘా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 31:** తెలంగాణ సెక్రటేరియట్‌లో భద్రతను అధికారులు కట్టుదిట్టం చేశారు. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పిఎఫ్) ఆధ్వర్యంలో సెక్రటేరియట్ భద్రత మరింత పెంచనున్నారు. భద్రత 24 గంటల పర్యవేక్షణ కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. 300 సిసి కెమెరాలతో సెక్రటేరియట్ బయట లోపల నిరంతర నిఘా ఉంచనున్నారు. విజిటర్లు సెక్రటేరియట్‌లోకి ఎంట్రీ అయినప్పటి నుంచి ఎగ్జిట్ అయ్యే వరకు వారి కదలికలను పోలీసులు రికార్డు చేయనున్నారు. ఇటీవలే సెక్రటేయట్‌లో నకిలీ ఐడీ కార్డుతో అధికారిగా చెలామణి అయిన వ్యక్తిని పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. దీంతో సెక్రటేరియట్‌లో ప్రవేశించే ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా పరిశీలించాలని ఎస్పీఎఫ్ నిర్ణయించింది. సెక్రటేరియట్‌లో రికార్డు అయిన మొత్తం డేటాను 5 నెలల పాటు అందుబాటులో ఉంచేలా సర్వర్లను ఏర్పాటు చేశారు. సచివాయంలో ప్రతిరోజు సిఎం సహా మంత్రులు ఐఏఎస్ అధికారులు విధులు నిర్వహిస్తుంటారు. వీరి భద్రతను దృష్టిలో ఉంచుకుని పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.

# టెన్త్ స్పెషల్ క్లాసు విద్యార్థులకు స్నాక్స్

## నేటి నుంచే ప్రత్యేక క్లాసులు ప్రారంభం

### 38 రోజులపాటు కొనసాగింపు

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూల్స్‌లో టెన్త్ క్లాసు విద్యార్థులకు నేటి(శనివారం) నుంచి స్పెషల్ క్లాసులు ప్రారంభం కానున్నాయి. స్పెషల్ క్లాసులకు హాజరయ్యే విద్యార్థులకు పాఠశాల విద్య ప్రత్యేకంగా స్నాక్స్‌ను అందించనుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 10వ తరగతి విద్యార్థుల్లో ఉత్తీర్ణత శాతం పెంచడం కోసం గత కొన్ని సంవత్సరాలుగా స్పెషల్ క్లాసులను పాఠశాల విద్య నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా నేటి నుంచి ప్రారంభించనున్న స్పెషల్ క్లాసులు 38 రోజులపాటు కొనసాగ నున్నాయి. ఫిబ్రవరి 1 నుంచి మార్చి 20 వరకు స్పెషల్ క్లాసులను నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, మోడల్ స్కూళ్లలో 10వ తరగతి చదువుతూ ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్‌ను అల్పాహారంగా అందించనుంది. 10వ తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచేం దుకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. దసరా తర్వాత చాలా చోట్ల మొదలయ్యాయి. మధ్యాహ్నం ఒంటి గంటకు భోజనం తింటే.. ప్రత్యేక తరగతులు పూర్తయి ఇళ్లకు వెళ్లడానికి ఇతర గ్రామాల విద్యార్థులకు రాత్రి 7 గంటలవుతోంది. అప్పటి వరకు ఏమీ తినకపోవడంతో విద్యార్థులు ఆకలితో ఇబ్బంది పడుతున్నారు. గతంలో కలెక్టర్ల నిర్ణయం మేరకు కొన్ని జిల్లాల్లో సాయంత్రం పూట స్నాక్స్ అందించేవారు. 2023లోనూ విద్యాశాఖనే సమగ్ర శిక్ష ద్వారా స్నాక్స్‌ను అందించేలా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది మార్చి 21వ తేదీ నుంచి 10వ తరగతి వార్షిక పరీక్షలు మొదలవుతున్నందున.. నేటి(ఫిబ్రవరి 1) నుంచి మార్చి 20 వరకు పాఠశాలలు నడిచే 38 రోజులపాటు అల్పాహారం(స్నాక్స్) అందించనున్నారు. ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.15 చొప్పున మంజూరు చేశారు. రాష్ట్రంలో సుమారు 4,500 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 194 మోడల్ స్కూళ్లలో సుమారు 1.90 లక్షల మంది టెన్త్ చదివే విద్యార్థులున్నారు. వారికి 38 రోజులకు సుమారు రూ.11 కోట్ల బడ్జెట్ అవసరమని అధికారులు అంచనా వేశారు. స్పెషల్ క్లాసులకు హాజరయ్యే విద్యార్థులకు ఉడకబెట్టిన పెసర్లు, పల్లీలు బెల్లం, చిరుధాన్యాలతో చేసిన మిల్లెట్ బిస్కెట్లు, ఉడకబెట్టిన బొబ్బర్లు, ఉల్లిపాయ పకోడి, ఉడకబెట్టిన శనగలు.. రోజుకొక రకం ఇవ్వనున్నారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీల మహిళల ద్వారానే స్పెషల్ క్లాసు విద్యార్థులకు స్నాక్స్‌ను అందించనున్నారు.

# హైదరాబాద్‌లో గులియన్ బారే సిండ్రోమ్ కేసు నమోదు

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** నగరంలో ఓ మహిళకు గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) కేసు నమోదైంది. సిద్దిపేట మండలానికి చెందిన మహిళకు జీబీఎస్ ఉన్నట్లు వైద్యులు నిర్ధరించారు. బాధితురాలు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వెంటిలేటర్స్‌పై చికిత్స పొందుతోంది. ఇప్పటికే మహారాష్ట్రలో వంద వరకు ఈ కేసులు నమోదైన విషయం తెలిసిందే.గత కొన్ని రోజులుగా మహారాష్ట్రలో గులియన్ బారే సిండ్రోమ్ కేసులు నమోదవడం ఆందోళనకు గురిచేస్తోంది. బ్యాక్టీరియా, వైరల్ ఇన్ఫెక్షన్ కారణంగా బలహీన రోగనిరోధక శక్తి కలిగిఉన్న వ్యక్తులు ఈ జీబీఎస్ బారినపడే అవకాశాలు ఉంటాయని వైద్యులు వెల్లడించారు. శరీరానికి సోకిన ఇన్ఫెక్షన్‌కు ప్రతిస్పందించే రోగ నిరోధక వ్యవస్థ పొరపాటున నరాలపై దాడి చేసే అరుదైన పరిస్థితి ఇది.ఆ రుగ్మత బారినపడిన వారికి ఒళ్లంతా తిమ్మిరిగా అనిపించడం, కండరాలు బలహీనంగా మారడం, డయేరియా, పొత్తికడుపు నొప్పి, జ్వరం, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. కలుషిత ఆహారం, నీటి ద్వారా ఆ బ్యాక్టీరియా సోకుతుందని వైద్యులు చెబుతున్నారు. అయితే, ప్రజలు భయాందోళనకు గురికావొద్దని, జీబీఎస్ అంటువ్యాధి కాదని, చికిత్సతో నయం చేయొచ్చని వైద్యులు వెల్లడించారు.

# ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు

## వాక్‌థాన్ ర్యాలీని ప్రారంభించి మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ (బేగంపేట) జనవరి 31, ప్రభాతవార్త:** ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు అవుతుందని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు.శుక్రవారం నగరంలోని హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్‌లో వాక్‌థాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఊపి ప్రారంభించారు.ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని,లేని పక్షంలో కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. రోడ్డు బధ్రత అవగాహనా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వాక్‌థాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్,ఎమ్మెల్సీ బల్మూరివెంకట్, రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి వికాసన రాజ్,హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి,ఎమ్మెల్యే దానం నాగేందర్,డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్‌రెడ్డి, కార్పొరేటర్ విజయారెడ్డి రవాణా శాఖ కమీషనర్ సురేంద్రమోహన్, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమీషనర్లు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి తమ ప్రాణాలతోపాటు ఇతరుల ప్రాణాలను రక్షించాలని సూచించారు.రోజువారి రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్న వారిని ఒక్కరినైనా కాపాడితే మన జీవితంలో మనకి తృప్తిని ఇచ్చేదిగా భావిస్తామన్నారు.25సంవత్సరాలుగా రాజకీయంగా అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నా మన్నారు. ఇది రవాణాశాఖ ముఖ్యమైన కార్యక్రమం అన్నారు.కేంద్ర మంత్రి గడ్కరీ రోడ్డు బధ్రతా వారోత్సవాలు నుంచి ప్రాధాన్యతను పెంచి రోడ్డు బధ్రతా మాసోత్సవాలు చేసారన్నారు.

జనవరి 1న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెల్మెట్ ధరించి ప్రారంభించిన ఈ కార్యక్రమం దాదాపు 15 లక్షల మంది విద్యార్థులకు, ప్రజలను భాగస్వామ్యం చేసి 33 జిల్లాల్లో అనేక కార్యక్రమాలు చేసిన రవాణాశాఖ అధికారులకు అభినందనలు తెలియ జేసారు. రాష్ట్రంలో ఎక్కడైతే బ్లాక్ స్పాట్స్ ప్రమాదాలు జరిగే ప్రాంతాలు గుర్తించి తొలగించి అక్కడ రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రభుత్వం చేస్తుందన్నారు. అవగాహన కల్పించిన తరువాత కూడా ట్రాఫిక్ రూల్స్ పాటించకపోతే ట్రాఫిక్ పోలీసు సహకారంతో కఠిన నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. రానున్న రోజుల్లో ప్రతి స్కూలులో ట్రాఫిక్ అవేర్ నెస్ పార్కు ఏర్పాటు చేస్తాం అన్నారు. అందరూ వాహనాలను జాగ్రత్తగా నడపాలన్నారు. రవాణాశాఖ కమీషనర్ సురేంద్ర మోహన్ మాట్లాడుతూ 2025 జనవరి నెలలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు గతంలో ఎన్నడూ లేని విధంగా 33 జిల్లాల్లో కలెక్టర్,ఎస్పీ,ప్రజాప్రతినిధులు పాల్గొన్నాం న్నారు. పండుగ లాగా రోడ్డు సేఫ్టీ అవేర్నెస్ మంత్ జరిగిందన్నారు.దాదాపు 10లక్షల మంది భాగస్వామ్యం అయ్యారన్నారు. 2024సంవత్సరంలో దేశంలో 5లక్షల 70వేల రోడ్డు ప్రమాదాలు జరిగాయ న్నారు. లక్షా 60వేల మంది మరణించా రన్నారు. తెలంగాణాలో 26వేల రోడ్డు ప్రమాదాలు జరిగాయన్నారు.5600మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించడానికి సేఫ్ డ్రైవర్స్ కార్యక్రమాన్ని కూడా చేసింది.


కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

# 40 బిసి కులాలను కేంద్ర ఒబిసి జాబితాలో చేర్చాలి

## కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలి

## ప్రభుత్వానికి రాష్ట్ర బిసి కమిషన్ సిఫారసు

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని 40 బీసీ కులాలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ బీసీ కమిషన్ కోరింది. ఈ మేరకు కేంద్రానికి లేఖ రాయాలని రాష్ట్ర ప్రభుత్వానికి బీసీ కమిషన్ ప్రతిపాదించింది. తెలంగాణ బీసీ కమిషన్ ఛైర్మన్, సభ్యులు శుక్రవారం రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి ప్రతిపాదనలు సమర్పించారు. రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మీ సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్, మెంబర్ సెక్రటరీ బాలమాయాదేవి పాల్గొన్నారు. బీసీ కమిషన్ తెలంగాణ రాష్ట్రంలోని 10 ఉమ్మడి జిల్లాల్లో పర్యటించింది. పర్యటన సందర్భంగా వచ్చిన విజ్ఞప్తుల మేరకు.. కొన్ని కులాల పేర్ల మార్పుకి అభ్యంతరాలను స్వీకరించారు. అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం అన్ని అంశాలను మంత్రితో చర్చించారు. వివిధ విజ్ఞప్తులను వాటి పర్యవసానాలను మంత్రితో కూలంకషంగా చర్చించినట్టు తెలిపారు. సెంట్రల్ ఓబీసీ లిస్ట్‌లో లేని 40 బీసీ కులాలను .. సెంట్రల్ ఓబీసీ లిస్ట్‌లో చేర్చే విధంగా కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున మరోసారి ప్రతిపాదన పంపాలని నిర్ణయించినట్టు తెలిపారు. బీసీల అభ్యున్నతికి కీలక అంశాలతో ముందుకు పోవాలని నిర్ణయించడం జరిగింది.

# పద్మభూషణ్‌ను తల్లిదండ్రులకు అంకితం చేస్తున్నా

## తనకు జరిగిన సన్మానంలో నందమూరి బాలకృష్ణ

## స్వర్గీయ నందమూరి తారకరామారావుకు భారతరత్న ఇవ్వాలి



పద్మభూషణ్ అవార్డు వరించిన సంస్థ ఛైర్మన్ నందమూరి బాలకృష్ణను ఘనంగా సత్కరించిన బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ ఆస్పత్రి సిబ్బంది, యాజమాన్యం

**హైదరాబాద్ (పంజగుట్ట), జనవరి 31, ప్రభాతవార్త:** కేన్సర్ రోగులకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటైన ధరలలో అందించాలనే లక్ష్యంతో మొదటి నుంచి పనిచేస్తున్న బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్ రీసెర్చి ఇన్స్టిట్యూట్ వారు నొప్పిలేని సర్జరీలకు దోహదపడే నాలుగో జనరేషన్ డావిన్సి రోబోటిక్ సర్జికల్ వ్యవస్థను అందు బాటులోనికి తీసుకొచ్చారు. దాదాపు రూ. 10 కోట్లకుపైగా ఖరీదైన ఈ సర్జికల్ వ్యవస్థ ద్వారా శస్త్రచికిత్సలు అవసరమైన రోగులకు నొప్పిలేని రీతిలో అత్యంత త్వరగా కోలు కోవడానికి వీలు కలుగుతుంది. ఈ ఆధునిక వ్యవస్థను శుక్రవారం ఉదయం హాస్పిటల్ ఆవరణలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో నందమూరి బాలకృష్ణ, వసుంధరదేవి దంపతుల చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం ఇటీవలే భారత ప్రభుత్వం ద్వారా పద్మభూషణ్ అవార్డును గెలుచుకున్న నందమూరి బాలకృష్ణను బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్, రీసెర్చి ఇన్స్టిట్యూట్ యాజమాన్యం, వైద్యులు, సిబ్బంది తరఫున ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వసుంధరదేవి, బాలకృష్ణ దంపతులను సిబ్బంది, వైద్యులు శాలువాలు కప్పి, పుష్పమాలలతో సత్కరించి రాధాకృష్ణుల విగ్రహాలను అందజేశారు.

అంతకుముందు కార్య క్రమంలో నందమూరి బాలకృష్ణ నటజీవితంపై హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. ఫణికోటేశ్వరరావు మార్గదర్శకత్వంలో రూపొందించిన ప్రత్యేక డాక్యుమెంటరీని ప్రదర్శించారు. నందమూరి బాలకృష్ణకు అభినందనలు తెలియజేస్తూ మానవసేవే మాధవసేవగా ఎందరికో సహాయం అందిస్తున్నారని ప్రశంసించారు. అనంతరం కార్యక్రమంలో జెయస్ ఆర్ ప్రసాద్, ట్రస్టు బోర్డు సభ్యులు మాట్లాడుతూ బాలకృష్ణ సినిమా, రాజకీయ రంగాలలో చేసిన పనికి ఎంతగానో గుర్తింపు, ప్రచారం కనిపిస్తోందని కానీ హాస్పిటల్ తో పాటూ ఇతరత్రా చేసే సేవా కార్యక్రమాలు అందరికీ తెలియవని అంటూ ఎందరో క్యాన్సర్ రోగులకు అండగా నిలిచిన ఘనత బాలకృష్ణదని అన్నారు. పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ తనకు అవార్డు ఆలస్యంగా వచ్చిందని కొందరంటున్నారని కానీ అది సరికాదని అన్నారు. తన తండ్రి శత జయంతి జరుపుకొంటున్నవేళ, స్వర్గీయ యన్‌టిఆర్ నటజీవితానికి డెబ్బయి అయిదు సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంలో అత్యున్నత పురస్కారం పద్మభూషణ్ అందు కొంటున్నానని, ఇది సరైన సమయమని అన్నారు. అయితే తన తండ్రికి భారతరత్న అందకపోవడం కొంత అసంతృప్తికరమైన అంశమని, త్వరలోనే దీనిని సాధిస్తామన్న ఆశాభావం వ్యక్తం చేశారు. నాన్నగారి ఆశీర్వాదంతో పద్మభూషణ్ నన్ను వరించిందన్నారు. నాకొచ్చిన అవార్డు మనందరికీ వచ్చినట్లేనని బాలకృష్ణ పేర్కొన్నారు. తాను ప్రారంభించిన అత్యాధునిక డావిన్సి రోబోటిక్ వ్యవస్థను రోగులకు అందుబాటులోకి తీసుకొని రావడం సంతోషంగా ఉందని మా అమ్మగారి ఆశయాలకు అనుగుణంగా పేదప్రజలకు అందుబాటైన ధరలలో అత్యాధునిక కేన్సర్ చికిత్స అందించాలనే లక్ష్యంలో భాగంగానే అత్యంత ఖరీదైన ఈ వ్యవస్థను హాస్పిటల్‌లో ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు.

# దేశవ్యాప్తంగా వెలుగుచూస్తున్న కవిత లిక్కర్ దందా

## నీచ రాజకీయాల గురించి కవిత మాట్లాడడం విడ్డూరం!

## భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** తెలంగాణ జాగృతి నాయకురాలు ఎమ్మెల్సీ కవిత లిక్కర్ దందా దేశవ్యాప్తంగా ఎక్కడెక్కడ ఉన్నాయో రోజు వెలుగులోకి వస్తున్నాయని భువనగిరి ఎంపి చామల కిరన్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. న్యూఢిల్లీలో ఆయన విలేఖరులతో శుక్రవారం మాట్లాడుతూ నీచమైన రాజకీయాలు ఎవరు చేస్తున్నారో యావత్ తెలంగాణ ప్రజలకు తెలుసు అని అన్నారు. మీ ఫ్యామిలీ డైవర్షన్ పాలిటిక్స్ అందరికీ తెలిసిపోయిందని,నీ లిక్కర్ సామ్రాజ్య కేసులు రోజుకోటి బయట పడుతున్నాయి ఇప్పటివరకు ఢిల్లీలోనే బయటపడిన నీ బాగోతం ఇప్పుడు కేరళలో కూడా నీ మూలాలు బయట పడుతున్నాయని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్‌రెడ్డి అన్నారు. లిక్కర్ స్కామ్ నుంచి డైవర్షన్ పాలిటిక్స్ లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డిని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు.నీళ్ల విషయంలో మీ అయ్య చేసినంత అన్యాయం తెలంగాణకు ఇంకెవరూ చేయలేదని అన్నారు. కృష్ణాలో పోతిరెడ్డిపాడు పొక్క పెద్దది కావడానికి కారణమే మీ అయ్యానే అని ఆయన అన్నారు. శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడు ద్వారా 40 వేల క్యూసెక్కుల నుంచి 90 వేల క్యూసెక్కుల పెరిగింది మీహయాంలోనే అని గుర్తుచేశారు. అంతేకాదు రోజుకు రెండు టీఎంసీలు తీసుకెళ్లడం కోసం జగన్ రాయలసీమ ఎత్తిపోతల పథకం స్టార్ట్ చేస్తే నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరించారని దుయ్యబట్టారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం కోసం ఏకంగా అపెక్స్ కౌన్సిల్ మీటింగ్ నే వాయిదా వేసిన ఘనత మీ అయ్యది అని అన్నారు. రోజా ఇంటికి వెళ్లి చేపల పులుసు తిని రాయలసీమను రతనాలసీమ చేస్తానని చెప్పింది నీ అయ్యా కాదా అని ప్రశ్నించారు.ఇలా ఏ విధంగా చూసినా కృష్ణా నీటిలో దక్షి ణ తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసింది మీ అయ్యనే ఇక గోదావరి విషయంలో ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది గోదారి మీద కట్టిన కాలేశ్వరం మూడేళ్లకే మునిగిపోయింది లక్ష కోట్లు పెట్టి ఖర్చు చేసి గోదావరి నీటి పాలు చేశారు .ఇలా నీళ్ల విషయంలో తీవ్రంగా అన్యాయం చేసింది మీ అయ్యా కేసీఆరే అని ఆమెకు చామల సమాధానం ఇచ్చారు.

# 3న ఎప్‌సెట్-2025 సమావేశం

## మధ్యాహ్నం ఐ సెట్ కమిటీ మీటింగ్

## ఆ తర్వాత సెట్స్ షెడ్యూల్ జారీకి అవకాశం

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో ఇంజనీరింగ్‌తోపాటు ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఇంజనీరింగ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఈఏపీ సెట్)-2025 కమిటీ మొదటి సమావేశం ఈ నెల 3న(సోమవారం) నిర్వహించనున్నారు. ఎప్ సెట్-2025ను జేఎన్‌టీయూ నిర్వహిస్తున్నందున ఉదయం 10 గంటలకు కూకట్‌పల్లిలోని జేఎన్‌టీయూ క్యాంపస్‌లో ఎప్ సెట్ కమిటీ మొదటి సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డితోపాటు ఎప్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ డీన్ కుమార్, రెక్టార్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొననున్నారు. మొదటి సమావేశం అనంతరం ఎప్ సెట్-2025కి సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

ఎప్‌సెట్‌లో భాగంగా ఏప్రిల్ 29, 30న అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం పరీక్షలను నిర్వహించనుండగా.. మే 2 నుంచి 5 వరకు ఇంజనీరింగ్ విభాగం పరీక్షలను నిర్వహించడానికి ఇప్పటికే తేదిలను ఖరారు చేసిన విషయం తెలిసిందే. ఇక అదే రోజు జేఎన్‌టీయూ క్యాంపస్‌లోనే పీజీ ఈసెట్-2025 కమిటీ సమావేశం కూడా నిర్వహించనున్నారు. పీజీ ఈసెట్-2025 కన్వీనర్ ప్రొఫెసర్ అరుణ కుమారి. సమావేశం అనంతరం షెడ్యూల్‌ను విడుదల చేసే అవకాశం ఉంది.

పీజీ ఈసెట్‌ను జూన్ 16 నుంచి 19 వరకు నిర్వహించడానికి నిర్ణయించిన విషయం తెలిసిందే. అలాగే ఐ సెట్-2025కి సంబంధించిన కమిటీ మొదటి సమావేశంలో సోమవారం మధ్యాహ్నం తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో జరగనుంది. ఐ సెట్-2025ను మహాత్మాగాంధీ యూనివర్సిటీ జూన్ 8, 9 తేదిల్లో నిర్వహించనుంది.

# కెసిఆర్ గర్జనలు, గంభీరాలు గమనిస్తున్నాం..

## ఫామ్‌హౌస్‌లోనే ఉండి మాట్లాడతారా.. అసెంబ్లీకి వస్తారా?

## మాజీ సిఎం వ్యాఖ్యలపై స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 31:** 13 నెలల పాటు ఫామ్ హౌజ్‌కే పరిమితమై ఇంతకాలం మౌనంగా ఉన్నానని ఇప్పుడేదో అంటే సరిపోదు. ప్రతిపక్ష నాయకుడంటే ప్రజల్లో తిరగాలి. ప్రజా సమస్యలు ప్రస్తావించాలని రెవెన్యూ,హౌజింగ్,సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. వర్షాలు వచ్చినా.. వరదలు వచ్చినా కనీసం ప్రజలను పరామర్శించలేదు. ఫామ్ హౌస్ దాటలేదని పేర్కొన్నారు.సీఆర్ సంచలన వ్యాఖ్యలపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పందించారు. అధికారంలో ఉన్ననాడు సచివాలయానికి రాలేదు. ప్రతిపక్ష నేతగా ఏడాది నుంచి అసెంబ్లీకి రాలేదు. ప్రజల్లోకి రాలేదు అని పేర్కొన్నారు. కేసీఆర్ జీవితమంతా ఫామ్ హౌసే.ప్రజలు అత్యాశకు పోయి కాంగ్రెస్‌కు ఓటేశారని కేసీఆర్ వ్యాఖ్యలు నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజలను అవమానించేలా ఉన్నాయన్నారు. ప్రజా తీర్పును అగౌరవ పరుస్తున్నారు. ప్రజలన్నా.. ప్రజాతీర్పు అన్నా కేసీఆర్‌కు ఏనాడూ గౌరవం లేదు.పదేండ్లు అధికారం ఇచ్చిన ప్రజలకు ఓడిపోయిన తర్వాత ఈ రోజు వరకు కూడా కనీసం కృతజ్ఞత తెలపలేదన్నారు. ప్రజాతీర్పును శిరసావహిస్తున్నామని కూడా ప్రకటించలేదు.ఈ ఏడాది కాలంలో నల్గొండ, కరీంనగర్ బీఆర్ఎస్ సభల్లో కూడా.. ఈరోజు మాదిరిగానే గంభీర ప్రకటనలే చేశారు. ఆ తర్వాత ఏమయ్యారో అందరికీ తెలిసిందే అని పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతగా అసెంబ్లీ ముఖం చూడని వ్యక్తి తన ఉనికిని చాటుకోవడానికి, నేనున్నానని చెప్పుకోవడానికి తుపాకీ రాముడిలా, పిట్టల దొర మాదిరి మాట్లాడుతున్నారని పేర్కొన్నారు.ప్రజలు ఏదో నమ్మి ఓటేశారని అంటున్నావు. వాస్తవాలు గ్రహించి నీ గడీల పాలన వద్దనుకుని ప్రజలు నిన్ను నీ కుటుంబాన్ని ఛీత్కరించారని చెప్పారు. పథకాలు అమలు కాలేదని ఫామ్ హౌజ్ లో కూర్చొని మాట్లాడటం కాదు. ఇప్పటికైనా ప్రజల్లోకి రావాలనే మేమంటున్నాం.అసెంబ్లీ సమావేశాలకు రావాలని ముఖ్యమంత్రి పదే పదే ఆహ్వానించారని చెప్పారు. 80 వేల పుస్తకాలు చదివినారన్నారు. మీ అమూల్యమైన సూచనలు సలహాలు ఇవ్వాలని అసెంబ్లీకి రమ్మంటే ఎందుకు రాలేదని ప్రశ్నించారు.2020 రెవెన్యూ చట్టం దేశానికే ఆదర్శమని ప్రకటించిన మీరు భూ భారతి చట్టం ప్రవేశ పెట్టిననాడైన అసెంబ్లీకి వస్తారని ఆశించామన్నారు.'నీ ఫామ్ హౌజ్ కు కరెంటు కోతలెక్కడివి. లెక్కలు తీద్దామా. ఏ రోజు ఎంత కరెంటు సరఫరా అయింది. ఎంత సరఫరా అవుతుందని చెప్పలేదన్నారు. నీ ఫామ్ హౌజ్‌కు నీళ్లెక్కడివి. రైతు భరోసా ఇచ్చిందే మేము.

రాష్ట్రంలో ఉచిత కరెంట్ తెచ్చిందే కాంగ్రెస్. చరిత్ర ప్రజలకు తెలియదా అని అన్నారు. నీవంటున్న గురుకులాలను సందర్శిద్దామా. మాతో వస్తారా. నీవెక్కడికంటే అక్కడికి రావడానికి మేము సిద్ధంగా ఉన్నామని చెప్పారు.అద్దె గదుల్లో పెట్టి విద్యార్థులను నానా ఇబ్బందులకు గురిచేసిన మీరా మాట్లాడేదని పేర్కొన్నారు.

## జొన్నాడ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులపై కలెక్టర్ సమీక్ష



**కోనసీమ బ్యూరో, జనవరి 31, ( ప్రభాతవార్త ) :**

జొన్నాడ ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు వారం రోజుల్లో పూర్తిస్థాయిలో పున: ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ సంబంధిత గుత్తేదారులు రహదారులు భవనాలశాఖ జాతీయ రహదారుల ఇంజనీర్లను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరే ట్ నందు గుత్తేదారులు ఇంజనీర్లతో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఫ్లై ఓవర్ పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ కారణాల మూలంగా నిలిచిపోయిన నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు ఇప్పటికే బ్రిడ్జి నిర్మాణ పనులులో జాప్యాలు ఎదురయ్యాయని వీటిని అధిగమించి నిర్మాణ పనులలో మరింత పురోగతిని చూపాల్సిన అవసరం ఉందన్నారు. వారం రోజులలో పనులను పున: ప్రారంభించాలని ఆదేశించారు. ఫ్లై ఓవర్ నిర్మాణానికి అవసరమైన మట్టిని సమకూర్చడం జరుగు తుందని అయితే శాస్త్రీయంగా పరిశోధన చేసి ఏ ప్రాంతంలో మట్టి నిర్మా ణానికి అనువుగా ఉంటుందో నిర్ధారించుకోవాలన్నారు. స్ట్రక్చర్ల నిర్మాణం తదితర పనులను పురోగతిని సాధించాలన్నారు. ఫిబ్రవరి 14, 15, తేదీ లలో ఫ్లై ఓవర్ నిర్మాణ పనులను పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. రావులపాలెం గ్రామంలో నిత్యం ఉండే ట్రాఫిక్ రద్దీని క్రమ బద్ధీకరించేందుకు వీలుగా ఫ్లైఓవర్ నిర్మాణ పనులకు సమగ్ర ప్రతిపాదనలు భూసేకరణ, ఫ్లైఓవర్ నిర్మాణం అంశాలపై సిద్ధం చేయా లని జాతీయ రహదారులు ఇంజనీర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాతీయ రహదారుల అథారిటీ ఆఫ్ ఇండియా పథక సంచాలకులు డి సురేం ద్రనాథ్, సృష్టి కాంట్రాక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్ రామకృష్ణ,టీం లీడర్ కన్సల్టెన్సీ ఏ శ్రీనివాసరావు తదితరులు పాల్గొ న్నారు.

## వైభవంగా గ్రామోత్సవం



**మామిడికుదురు , జనవరి31, ( ప్రభాతవార్త ) :**

మామిడికుదురు మండలం బి.దొడ్డవరం గ్రామంలో శ్రీ ఉమా సోమేశ్వరస్వామి వారి నూతన ఆలయ ప్రతిష్టా మహోత్సవ పూజలు వైభవంగా జరిగాయి. దీనిలో భాగంగా మూడవ రోజైన శుక్రవారం విగ్రహాలను ఊరేగిస్తూ గ్రామోత్సవం జరిపించారు. మేళ తాళాలు,భక్తుల కోలాహలం నడుమ ఈ గ్రామోత్సవం జరిగింది. బ్రహ్మశ్రీ పూజ్యం జగన్నాధశర్మ ఆధ్వర్యంలో విఘ్నేశ్వరపూజ, నవగ్రహ కల్పం,మూల మంత్ర జపాలు,నవగ్రహ హోమాలను శాస్త్ర యుక్తంగా వేద మంత్రాల నడుమ ఘనంగా జరిపించారు. ఈపూజా కార్యక్రమాల్లో కంభంపాటి సుబ్రహ్మణ్య శ్రీనివాస శర్మ,పోచిరాజు వెంకట రామ నాగేశ్వరరావు,పోచిరాజు కిరణ్ కుమార్ దంపతులు కర్తలుగా పాల్గొన్నారు.

## పాశర్లపూడిలంక లో నాగ ప్రతిష్టా మహోత్సవ పూజలు



**మామిడికుదురు,జనవరి31, ( ప్రభాతవార్త ) :**

పాశర్లపూడిలంకలో వైనతేయ గోదావరి నదీతీరంలో కొలువై ఉన్న శ్రీవల్లీ దేవసేన సమేత నాగేంద్ర స్వామి దివ్య కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం నాగ ప్రతిష్టా మహోత్సవ పూజలు ఘనంగా జరిగాయి.పలు గ్రామాల నుంచి వచ్చిన భక్త దంపతులు ఈపూజల్లో పాల్గొన్నారు.వేద పండితులు గంటి బాల సుబ్రహ్మణ్యశర్మ,ఆదిరాజు నరసింహమూర్తి ఆధ్వర్యంలో విఘ్నేశ్వరపూజ,సుబ్రహ్మణ్య స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు తీర్థప్రసాద వినియోగం తదితర పూజా కార్యక్రమాలు కన్నుల పండుగగా జరిపించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి 3వ.తేదీ వరకు దివ్య కళ్యాణ మహోత్సవాలు జరుగుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

## అలమండ చలమయ్యకు బిజెపి నేతల పరామర్శ



**ఏలేశ్వరం,జనవరి 31,( ప్రభాతవార్త ) :**

ప్రత్తిపాడు నియోజకవర్గం ఏలేశ్వరం నగర పంచాయితీ మున్సిపల్ చైర్ పర్సన్ అలమండ చలమయ్యకు ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను భారతీయ జనతా పార్టీకాకినాడ జిల్లా మాజీ అధ్యక్షులు చిలుకూరి రామ్ కుమార్,భారతీయ జనతా కాకినాడ జిల్లా పార్టీ వైస్ ప్రెసిడెంట్ ఉమ్మిడి వెంకట్రావు,ఏలేశ్వరం టౌన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు పైల అయ్యప్ప, ఏలేశ్వరం రూరల్ మండల అధ్యక్షులు నీలి సురేష్ తదితరులు వారిని మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించి వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చిలుకూరి రామ్ కుమార్,ఉమ్మిడి వెంకటరావు సీనియర్ రాజకీయ నాయకులైన అలమండ చలమయ్య త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.


## కొత్తపేట నూతన డిఎస్పీకి అభినందనలు తెలిపిన బిజెపి



**కోనసీమ బ్యూరో, జనవరి 31, ( ప్రభాతవార్త ) :**

కొత్తపేట నూతన డి. ఎస్. పి గా బాధ్యతలు స్వీకరించిన సుంకర మురళి మోహన్ ని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. విధి నిర్వహణ లో మరింత పేరు ప్రఖ్యాతలు తెచ్చుకోవాలి అని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువ మోర్చా అధికార ప్రతినిధి పాలూరి జయ ప్రకాష్ నారాయణ, జిల్లా బీజేపీ కార్యదర్శి గొల కోటి వెంకటేశ్వరరావు, నల్లా వర ప్రసాద్,శ్రీఘ్రకొలపు చిన సుబ్బరాయిడు (చిన్ని), జిల్లాఎస్. సి.మోర్చా ఉపాధ్యక్షుడు బల్ల రాజు,కంచుస్థంభం సతీష్,పెన్నాడా నారాయణ రావు,ఆకుల పరశు రామ్, తదితరులు పాల్గొన్నారు.


## మల్లేపల్లి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



**గండేపల్లి , జనవరి 31, ( ప్రభాతవార్త ) :**

గండేపల్లి మండలం మల్లేపల్లి శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద వార్షిక బ్రహ్మోత్సవాలకు శుక్రవారం అంకురార్పణ చేశారు. గ్రామ పురోహితులు చింతా అరుణ్ కుమార్ శర్మ ముహూర్తం ఖరారు చేయగా ఆలయ పురోహితులు వైష్ణవదాసు నాగేశ్వరరావు మంత్రోచ్ఛారణల మధ్య భక్తుల గోవింద నామ స్మరణలతో స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి పసుపు వాయా పందిరి రాట తో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. ఫిబ్రవరి 6వ తేదీన వీరభద్రుని సంబరం, ఏడవ తేదీన శోభాయాత్ర, 8వ తేదీన స్వామివారి కళ్యాణం, 9వ తేదీన భారీ అన్నదానం, శ్రీ పుష్ప యాగం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు.

## అంగరంగ వైభవంగా జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, జనవరి 31,( ప్రభాతవార్త ) :**

అత్యాధునిక హంగులతో, ప్రత్యేకమైన వసతులతో,పార్టీ అన్ని విధాల కార్యక్రమాలకు అనువుగా ఉండేందుకు,జనసైనికులకు, వీర మహిళలకు, ఎన్డీఏ శ్రేణులకు, ప్రజలకు అండగా పరిపాలన సౌలభ్యం కోసం రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మాణం జరుపుకున్న రాజానగరం జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. శుక్రవారం ఉదయం గం. 10:10 నిమిషాలకు వీరమహిళలు, ప్రముఖులు, ఎన్డీఏ శ్రేణులు, ప్రజల సమక్షంలో ఘనంగా కార్యాలయం ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం కోలాహలంగా మారింది. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు, అభిమానులు భారీగా పాల్గొన్నారు.

## డిజిటల్ అసిస్టెంట్ కు షోకాజ్ నోటీసులు

**సీతానగరం, జనవరి 31, ( ప్రభాతవార్త ) :**

మండలంలో వంగలపూడి గ్రామ సచివాలయ లో డిజిటల్ అసిస్టెంట్ కు డీఎల్ డి ఓ వీణాదేవి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఈ నెల 26వ తేదీన వంగలపూడి సచివాలయంలో " సేవలకు దుమ్మా కొట్టిన సిబ్బంది" అంటూ వెలువడిన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. బాధితులు నెలల తరబడి సచివాలయం చుట్టూ తిరుగుతూ సమస్యను వార్త దృష్టికి తీసుకు వచ్చారు. దీనితో వార్త దినపత్రికలో కదనం వెలువడింది. డిజిటల్ అసిస్టెంట్ కు షోకాజ్ నోటీసులు ఇస్తూ రాజమహేంద్రవరం కార్యాలయానికి వచ్చి వివరణ ఇవ్వాలని డీఎల్ డి ఓ కోరారని ఎంపీడీఓ భారతి తెలిపారు.

## అందాన్ని మెరుగుపర్చడంలో అత్యుత్తమ చికిత్స


### - గ్రోహెయిర్ %డ% గ్లోస్కిన్ క్లినిక్ ఫౌండర్, మేనేజింగ్ డైరెక్టర్ శరణ్ వెల్ జే



**రాజమహేంద్రవరం,జనవరి31( ప్రభాతవార్త ) :**

అందం, ఆత్మవిశ్వాసాన్ని ఇనుమడింపజేసే అడ్వాన్స్డ్ గ్రోహెయిర్ గ్లోస్కిన్ క్లినిక్ ను రాజమండ్రిలోని దానవాయిపేటలో ముఖ్య అతిథి ఎమ్మెల్యే అదిరెడ్డి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రోహెయిర్ %డ% గ్లోస్కిన్ క్లినిక్ ఫౌండర్, మేనేజింగ్ డైరెక్టర్ శరణ్ వెల్ జే మాట్లాడుతూ అందాన్ని మెరుగుపర్చడంలో అత్యుత్తమ చికిత్స అందించడంలో మా క్లినిక్ ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. మా ప్రయాణంలో ఇది మరో మైలురాయిని సూచిస్తుందన్నారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో సర్వీసు అందించడమే లక్ష్యమన్నారు. జుట్టు మళ్లీ రావడంలోనూ, చర్మం పునరుజ్జీవనంలోనూ అత్యుత్తమ చికిత్స అందించనున్నామని తెలిపారు. అత్యాధునిక సాంకేతికతను సున్నితమైన సంరక్షణతో సమ్మిళిత చేస్తున్నామని చెప్పారు. ఈ క్లినిక్‌లో పెర్క్యుటేనియస్ ఎఫ్ యూ ఈ హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్, స్టెమ్ ఎక్స్ 27 ప్రో (పీఆర్పీ ప్రోం), లేజర్ హెయిర్ థెరపీ, రీజెన్ ప్రో 9 ఇతర ప్రత్యేక చికిత్సలు అందుబాటులో కలవన్నారు. ఇవన్నీ యూఎస్ ఎఫ్డీఏ ఆమోదం పొందిన విశ్వసనీయమైన చికిత్సలుగా గుర్తింపు పొందాయని తెలిపారు. ప్రకాశవంతమైన చర్మానికి ఈ క్లినిక్ విప్లవాత్మక చికిత్సలను అందిస్తుందని తెలిపారు. వీటిలో గ్లూటథయోన్ ఐవీ, హైడ్రాఫేషియల్, క్యూ-స్విచ్డ్ లేజర్, బోటాక్స్, ఫిల్లర్స్, థ్రెడ్ లిఫ్ట్, పూర్తి శరీర లేజర్ సేవలు ఉన్నాయని చెప్పారు. ప్రముఖ నిపుణులతో అత్యాధునిక సాంకేతికతతో నిర్వహించబడే ఈ చికిత్సలు అద్భుతమైన ఫలితాలను అందిస్తాయని తెలిపారు. అసాధారణ సంరక్షణ, అద్భుతమైన ఫలితాల ద్వారా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి కట్టుబడి ఉన్నామన్నారు. అధిక నాణ్యతతో కూడిన సేవలు సులభంగా అందరికి అందుబాటులో ఉండే విధంగా అందించనున్నామని చెప్పారు. ఈ క్లినిక్ అందాన్ని మెరుగుపరుస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఉత్తమంగా కనిపించేలా, అనుభూతి చెందేలా చేస్తుందన్నారు. రాజమండ్రిలోని మా కొత్త కేంద్రాన్ని సందర్శించాలని కోరారు. అడ్వాన్స్డ్ గ్రోహెయిర్ %డ% గ్లోస్కిన్ క్లినిక్ అందమైన ఆరోగ్య సంరక్షణలో విశ్వసనీయ నాయకుడుగా ఎందుకు ఉందో స్వయంగా తెలుసుకోండని తెలిపారు. అద్భుతమైన నైపుణ్యం, వినూత్నత గల సేవలకు ప్రసిద్ధి చెందింది. యూఎస్ ఎఫ్డీఏ ఆమోదం పొందిన పరిష్కారాలతో అసాధారణమైన ఫలితాలను సాధించడం లక్ష్యంగా పెట్టుకున్న ఈ క్లినిక్ ఏస్తెటిక్ మెడిసిన్‌లో విశ్వసనీయ బ్రాండ్‌గా నిలిచిందన్నారు.


## విత్తు ఒక్కటే..మొక్కలు మూడు..



**అంబాజీపేట,జనవరి 31, ( ప్రభాతవార్త ) :**

భూమిలో పాతిన విత్తు ఒక్కటే.. కాని ఆ విత్తు నిండి మొలిచిన మొక్కలు మూడు.. సాధారణంగా ఒక కొబ్బరి కాయ నుండి ఒక మొక్క మాత్రమే మొలుస్తుంది. కొన్ని సందర్భాలలో రెండు మొక్కలు కూడా మొలుస్తుంటాయి. అదే కొబ్బరికాయకు మూడు మొక్కలు మొలిచి మరింత ఆశ్చర్యపర్చింది.అలాంటి ఆశ్చర్యానికి వేదికయ్యింది స్థానిక పశువుల సంత సమీపంలోని హడ్కో కాలనీ శివారులో ఉన్న సూదాబత్తుల శ్రీనివాసరావు వ్యవసాయ క్షేత్రం.శ్రీనివాసరావు తన కొబ్బరి తోటలో చెట్ల నుండి రాలి పడిన కొన్ని కొబ్బరికాయలను పాతిపెట్టారు. పాతిన మూడు నెలలకు చూడగా ఒక కొబ్బరికాయ నుండి మూడు మొక్కలు మొలిచినట్లు గుర్తించారు. స్థానికులు సమాచారంతో కొబ్బరి మొక్కలను ఆసక్తిగా తిలకించేందుకు రైతులు, స్థానికులు వస్తున్నారు.ఈ విషయంపై స్థానిక కొబ్బరి పరిశోధనా కేంద్ర అధిపతి డాక్టర్ ఎన్. బి.వి.చలపతిరావును వివరణ కోరగా జన్యుపర లోపం వల్ల మూడు మొక్కలు మొలుస్తాయన్నారు.మానవులలో ఒక్కక్క సారి ఇద్దరు కవల పిల్లలు,(ట్విన్స్)మరికొన్ని సందర్భాల్లో ముగ్గురు( ట్రిప్లేట్స్)జన్మిస్తుంటారని,అలాగే మొక్కలలో కూడా జరుగుతుందన్నారు.ఏది ఏమైనప్పటికీ ఒక కొబ్బరి కాయ నుండి మూడు మొక్కలు మొలవటం వింతైన విషయమని డాక్టర్ చలపతిరావు పేర్కొన్నారు.

## ఎమ్మెల్యే చొరవతో లో వోల్టేజి సమస్య పరిష్కారం



**కాకినాడ రూరల్, జనవరి 31, ( ప్రభాతవార్త ) :**

రూరల్ మండలం రేపూరు గ్రామంలో లోవోల్టేజ్ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు స్థానిక ఎమ్మెల్యే నానాజీ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామీణ శాసనసభ్యులు పంతం నానాజీ తక్షణం స్పందించి విద్యుత్ అధికారులతో మాట్లాడి ఐదు లక్షల రూపాయలు విలువచేసే 40 కె.వి కెపాసిటీ గల నూతన ట్రాన్స్ పార్మర్ ను శుక్రవారం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే చొరవతో లో వోల్టేజి సమస్యను పరిష్కరించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేసి కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## కొత్తపేటలో సంవిదాన్ గౌరవ అభియాన్



**కోనసీమ బ్యూరో, జనవరి 31,( ప్రభాతవార్త ) :**

కొత్తపేట బా లయోగి పేట లో జిల్లా ఎస్. సి.మోర్చా ఉపాధ్యక్షుడు బల్ల రాజు ఆధ్వర్యంలో సంవిధాన్ గౌరవ అభియాన్ కార్యక్రమంజరిగింది. దీనికి ముఖ్య అతిథిగా రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం పాల్గొన్నారు. ముందుగా అంబెడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర యువ మోర్చా అధికార ప్రతినిధి పాలూరి జయ ప్రకాష్ నారాయణ(జేపీ) మాట్లాడుతూ భారత రాజ్యాంగ దినోత్సవం లో భాగంగా అంబెడ్కర్ యొక్క గొప్పతనం గురించి వివరించారు. ఒక ప్రపంచ మేధావి అంబెడ్కర్ అని అంబెడ్కర్ రాజ్యాంగం రచించడం లో కీలక పాత్ర పోషించారు అని, ప్రతీ వ్యక్తి అంబెడ్కర్ ని ఆదర్శంగా తీసుకుని రాజ్యాంగం మనకు కల్పించిన హక్కులు ను పొందాలి అని జేపీ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ కార్యదర్శి గొల కోటి వెంకటేశ్వరరావు,కోటిపల్లి దామోదర్ ,నల్లా వర ప్రసాద్ ,కంచుస్థంభం సతీష్,యువ మోర్చా మండల అధ్యక్షుడు కిరణ్,పెన్నాడా నారాయణ రావు,ఆకుల పరశురామ్, తదితరులు పాల్గొన్నారు.

## గ్రోమోర్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోండి



జోనల్ మేనేజర్ కిషోర్ వర్మ

**రౌతులపూడి, జనవరి 31, (ప్రభాతవార్త ) :**

మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన గ్రోమోర్ సంస్థ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ జోనల్ మేనేజర్ కిషోర్ వర్మ అన్నారు. రౌతులపూడి పరిసర ప్రాంత రైతులకు అందుబాటులోకి ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు అందించాలనే సదుద్దేశంతో నూతనంగా గ్రోమోర్ శాఖను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆ శాఖ భవన యజమాని రౌతు మల్లేశ్వరరావు తో నూతన వ్యాపారం ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలతో పాటు, ఎరువులను విక్రయిస్తామన్నారు. మా సంస్థ అభివృద్ధికి రైతులు సహకరించాలని ఆయన కోరారు. ప్రతి ఒక్క రైతు కొనుగోలు బిల్లు తీసుకోవాలని వ్యవసాయ అధికారి రెడ్డి ఈశ్వరరావు అన్నారు. ఎరువులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్ షణ్ముఖ్, ఏరియా మేనేజర్ అప్పలనాయుడు, ఏ.మ్.మ్ భాను, ఆర్. మ్.ప్రసాద్ రెడ్డి, స్టాక్ మేనేజర్ అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

## వాట్సాప్ గవర్నెన్స్ సేవలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి : మల్లాడి రాజేంద్ర



**కాకినాడ రూరల్, జనవరి 31,( ప్రభాతవార్త ) :**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ప్రజా సంక్షేమం కోరకు డిజిటల్ టెక్నాలజీ వినియోగించుకోవడం కోసం మన మిత్ర పేరుతో వాట్సప్ గవర్నెన్స్ సేవలు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని జనసేన పార్టీ నాయకులు మల్లాడి రాజేంద్ర అన్నారు. నేటి నుండి ధ్రువపత్రాలు, ఇతర సేవల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగనవసరం లేదని 161 పౌర సేవలతో రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చిన వాట్సాప్ గవర్నెన్స్ సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డిజిటల్ టెక్నాలజీ వినియోగం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందని మల్లాడి మీడియాతో అన్నారు. ఒక్క బటన్ తో ప్రజల వద్దకు ప్రభుత్వ సేవలు లభించడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు కు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు మల్లాడి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## నేటి వరకు జీవన్ ప్రమాణ్ లో అప్లోడ్ చేసిన లైఫ్ సర్టిఫికెట్స్ అన్నీ ఆమోదం..ఏటివో రంగారావు



**అమలాపురం, జనవరి31, ( ప్రభాతవార్త ) :**

అమలాపురం సబ్ ట్రెజరీ పరిధిలో ఇప్పటివరకు అప్లోడ్ అయిన జీవన ధ్రువీకరణ పత్రాలు అన్నిటిని అప్రూవ్ చేసినట్టుగా డివిజనల్ సబ్ ట్రెజరీ అధికారి ఎస్ బివివి రంగారావు తెలియ జేసారు. స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ అమలాపురం బ్రాంచ్ ప్రతినిధులు రాష్ట్ర కార్యదర్శి ఎన్విఎస్ఎస్ సిహెచ్ కృష్ణమూర్తి,జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఎం సాయి వరప్రసాద్,ట్రెజరర్ జెయంతి సోమేశ్వర శర్మ లు డివిజనల్ సబ్ ట్రెజరీ అధికారి ని కలిసి లైఫ్ సర్టిఫికెట్ల గురించి చర్చించారు.సబ్ ట్రెజరీ పరిధిలో అప్లోడ్ అయిన జీవన ధ్రువీకరణ పత్రాలు మొత్తం 2010 మంది పెన్షనర్స్ యొక్క లైఫ్ సర్టిఫికెట్స్ అప్రూవ్ చేయటం జరిగిందని తెలియజేశారు.సబ్ ట్రెజరీ పరిధిలో 2893 మంది పెన్షనర్స్ ఉండగా ఇప్పటికీ సర్వీస్ పెన్షనర్స్1281 ఫ్యామిలీ పెన్షనర్స్ 721 ప్రావిజనల్ పెన్షనర్స్ ఏడుగురు ఇతరులు1మొత్తం 2010 మంది లైఫ్ సర్టిఫికెట్స్ అప్రూవల్ చేయడం జరిగిందని తెలియజేశారు.883 మంది పెన్షనర్స్ ఇంకను తమ జీవన ధ్రువీకరణ పత్రాలను అప్లోడ్ చేయవలసి ఉన్నదని సదరు పెన్షనర్స్ సాధ్యమైనంత తొందరలో తమ తమ జీవన ధ్రువీకరణ పత్రాలను అప్లోడ్ చేయాలని వారు సూచించారు . ఎప్పటికప్పుడు లైఫ్ సర్టిఫికెట్స్ ఆమోదించడం చేయడం పట్ల అసోసియేషన్ సభ్యులు ఏటివో రంగారావుకి ధన్యవాదాలు తెలియజేసారు.మిగిలిన పెన్షనర్స్ కూడా సాధ్యమైనంత తొందరగా అప్డేట్ చేసుకోవాల్సిందిగా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ వారు పెన్షనర్స్ కి విజ్ఞప్తి చేసారు.ఫిబ్రవరి నెల దాటిన తర్వాత డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ అనుమతిస్తే తప్ప జీవన ధ్రువీకరణ పత్రాలు స్వీకరించబడవని గమనించవలసిందిగా వారు పెన్షనర్స్ కు సూచించారు.

# ఆదిత్య యూనివర్సిటీలో జాతీయ స్థాయి టెక్ హ్యాకథాన్



**గండేపల్లి, జనవరి 31, ( ప్రభాతవార్త ) :**
ఉ దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు పరిశ్రమ 4.0 సాంకేతికతలను ఉపయోగించి వాస్తవ ప్రపంచ సమస్యలకు సాంకేతిక పరిష్కారాలను రూపొందించేందుకు ఒక సృజనాత్మక వేదికగా "ఏఐడియాథాన్ 2025" పోటీని ఆదిత్య యూనివర్సిటీ, సూరంపాలెం లో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ జాతీయ స్థాయి పోటీలో భారతదేశంలోని పైగా పైగా ప్రముఖ ఇంజినీరింగ్ కాలేజీలకు చెందిన 300 మందికిపైగా విద్యార్థులు ప్రత్యక్షంగా పాల్గొన్నారు ఈ హ్యాకథాన్‌లో కృత్రిమ మేధస్సు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, రోబోటిక్స్, బిగ్ డేటా, మెకాట్రానిక్స్ వంటి ప్రముఖ పరిశ్రమ 4.0 సాంకేతికతలను ఉపయోగించి రియల్-టైమ్ సమస్యల పరిష్కారాలను అభివృద్ధి చేయడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. విద్యార్థులు స్మార్ట్ అగ్రికల్చర్, హెల్త్‌కేర్, ఎనర్జీ మానేజ్మెంట్, స్మార్ట్ ట్రాన్స్‌పోర్టేషన్, క్లీన్ ఎనర్జీ వంటి విభిన్న రంగాల్లో తమ వినూత్న ఆలోచనలను ప్రదర్శించారు. ఆదిత్య యూనివర్సిటీ సూరంపాలెం దేశంలోనే అత్యుత్తమ ప్రైవేట్ యూనివర్సిటీలలో ఒకటిగా గుర్తింపు పొందింది. ఆధునిక ల్యాబ్‌లు, పరిశ్రమలతో మేళకోవు, రీసెర్చ్ సెంటర్లు, ఇన్నోవేషన్ హబ్‌లు ద్వారా విద్యార్థులకు వాస్తవ అనుభవాన్ని అందించడంలో ముందంజలో ఉంది. యువ ఇంజినీర్లు తాజా టెక్నాలజీలపై పట్టు సాధించి, పరిశ్రమలో ఉపయోగపడే పరిష్కారాలను రూపొందించే అవకాశం పొందారు. విద్యార్థుల సృజనాత్మకత, ఆవిష్కరణల గణనీయత, సాంకేతికత వాడకం ఆధారంగా అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చిన టాప్-5 జట్లు, మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాల, గుంటూరు, నడింపల్లి సత్యనారాయణ రాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, విశాఖపట్నం, చైతన్య భారతీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ప్రొద్దుటూరు, ఇతర జిల్లాల నుండి వచ్చిన ప్రముఖ కాలేజీలు ఇతర రాష్ట్రాల విద్యార్థులు కూడా ఈ పోటీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు ప్రముఖ పరిశ్రమల మెంటోరింగ్, ఫండింగ్ అవకాశాలు, స్టార్టప్ మద్దతు వంటి ప్రత్యేక ప్రోత్సాహకాలు లభించనున్నాయి. ఈ పోటీలో పాల్గొన్న విద్యార్థులు,మెంటార్లు, పరిశ్రమ నిపుణులు అందరూ ఆదిత్య యూనివర్సిటీ తీయదైన అతిథ్యాన్ని, అనుభవాన్ని ప్రశంసించారు. ఈ విధంగా ఆదిత్య యూనివర్సిటీ మరోసారి తన స్థాయిని నిరూపించుకుని, దేశవ్యాప్తంగా సాంకేతిక విద్యలో తన ప్రాధాన్యతను చాటుకుంది. కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని యూనివర్సిటీ ప్రో. ఛాన్సలర్ డా.సతీష్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా.ఎం.శ్రీనివాసరెడ్డి,ప్రో.వైస్ ఛాన్సలర్ డా ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ డా జి.సురేష్,వివిధ విభాగాల డీన్ లు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి హాకీ టోర్నమెంట్ నిర్వహణకు ప్రత్యేక కమిటీలు


**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, జనవరి 31, ( ప్రభాతవార్త ) :**
కాకినాడ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం వేదికగా ఫిబ్రవరి 15 నుండి 28వ తేదీ వరకూ ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ ను విజయవంతంగా నిర్వహించేందుకు అంశాల వారీగా ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేస్తూ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం మద్యాహ్నం కలెక్టరేట్ కోర్టు హాలులో ఫిబ్రవరి 15 నుండి 28 వరకూ స్థానిక డిఎస్ఏ స్టేడియంలో ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ షణ్మోహన్ వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో జరిగే ప్రతిష్టాత్మకమైన టోర్నమెంట్ ను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆయా అంశాల వారీగా వివిధ శాఖల అధికారుల సమన్వయంతో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసామన్నారు. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ అధ్యక్షతన , జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ, సిపిఓ, డిఎస్డిఓలు సభ్యులుగా ఏర్పాటు చేసిన ఆర్గనైజింగ్ కమిటీ, వివిధ ఉప కమిటీల సహకారంతో టోర్నమెంట్ నిర్వహణ అన్ని అంశాలను పర్యవేక్షిస్తుందని తెలిపారు. జాయింట్ కలెక్టర్ చైర్మన్ గా ఆర్డిఓ,కాకినాడ, ఎడిసి-కెఎంసి, జిల్లా ఉపాధి అధికారి, డిటిసి సభ్యులుగా లాజిస్టిక్ కమిటీ పనిచేస్తుందన్నారు. అలాగే డిటిసి నేతృత్వంలో ట్రాన్స్ పోర్ట్, రిసెప్షన్ కమిటీ క్రీడాకారులకు స్వాగతం, రవాణా, బస సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు. డిడి-గ్రౌండ్ వాటర్ నేతృత్వంలో రిజిష్ట్రేషన్ కమిటీ పాల్గొనేందుకు వచ్చిన టీముల రిజిష్టన్ ప్రక్రియ నిర్వహించి వారికి అవసరమైన ఏర్పాట్ల కోసం మిగిలిన సబ్ కమిటీలకు సూచించాలన్నారు. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్-డియం నేతృత్వంలో ఫుడ్ కమిటీ క్రీడాకారులకు ఆహర ఏర్పాట్లను, కాకినాడ ఆర్డిఓ నేతృత్వంలోని అకామిడేషన్ కమిటీ క్రీడాకారులకు బస ఏర్పాట్లను, ఏపిసి-సమగ్రశిక్ష నేతృత్వంలో టెక్నికల్ కమిటీ పోటీల నిర్వహణకు నంబంధించిన సాంకేతిక అంశాలను, డిఎంహెచ్ఓ నేతృత్వంలోని మెడికల్ కమిటీ కీడాకారులకు ప్రధమ చికిత్స, అంబులెన్స్ సేవలను నిర్వహించాలన్నారు. కాకినాడ మున్సిపల్ కమీషనర్ సహకారంతో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి నేతృత్వంలో వెన్యూ అండ్ సరౌండింగ్స్ ప్రివరేషన్ కమిటీ క్రీడాప్రాంగణాన్ని శోభాయమానం, పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని సూచించారు. క్రీడాకారులకు



-జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి

ట్రోఫీలు, బహుమతుల పంపిణీ కార్యక్రమాలను పెద్దాపురం-ఆర్డిఓ నేతృత్వంలో సెరిమోనియల్ కమిటీ, క్రీడా పోటీలకు సంబంధించిన సమాచారంపై నిర్వహణకు ముందు, పోటీల తేదీలలోను మీడియా ద్వారా ప్రాంతీయ, జాతీయ స్థాయిలో విస్తృత ప్రచారాన్ని డిపిఆర్ఓ నేతృత్వంలో ప్రెస్ అండ్ మీడియా కమిటీ నిర్వహించాలని ఆదేశించారు. అలాగే జిల్లా హేండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ అధికారి నేతృత్వంలో పబ్లిసిటీ కమీటీ, డిఈఓ నేతృత్వంలో కల్చరల్ ప్రోగ్రామ్స్ కమిటీ ఆయా అంశాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం టోర్నమెంట్ నిర్వహణకు అవసరమైన నిధులు సమకూర్చేందుకు సంసిద్ధత తెలిపిన స్పాన్సర్ సంస్థలు తదితర అంశాలపై కొత్తగా ఏర్పాటుచేసిన కమిటీలతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, కాకినాడ మున్సిపల్ కమీషనర్ భావన, డిఎస్డిఓ బి.శ్రీనివాస కుమార్, జడ్పి సిఈఓ వివివిఎస్ లక్ష్మణరావు, ఆర్డిఓలు ఎస్.మల్లిబాబు, కె.శ్రీరమణి, ఆర్.అండ్.బి

# మెడికల్ షాపులు నిబంధనలు పాటించకపోతే చర్యలు



డ్రగ్ ఇన్స్పెక్టర్ కల్యాణి.

**సీతానగరం ,జనవరి 31, ( ప్రభాతవార్త ) :**
మండలంలో మెడికల్ షాపులు నిర్వహిస్తున్న వారు నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని రాజమహేంద్రవరం డ్రగ్ ఇన్స్పెక్టర్ కల్యాణి అన్నారు. సీతానగరం మండలంలో తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా షాపులు నిర్వహిస్తున్న చినకొండేపూడి గ్రామానికి చెందిన లక్ష్మీ గణేష్, వెంకట సాయి, రామ దుర్గ, మునికూడలి సాయి దుర్గ మెడికల్ షాపులపై కేసులు నమోదు చేశామని, కొనుగోలు చేసిన మందులకు అమ్మకాలకు బిల్లులలో తేడాలు ఉన్నందున రికార్డులను కార్యాలయానికి తీసుకురావాలని చెప్పినట్లు తెలిపారు. అలాగే పలు మెడికల్ దుకాణాల్లో అర్ఎంపి డాక్టర్లు రాసి ఇచ్చిన మందులు చీటీలకు మందులు ఇచ్చేటప్పుడు తగిన నిబంధనలు పాటించకపోతే అనంతరం పరిణామాలకు బాధ్యత వహించాలని అన్నారు. పలు దుకాణాల్లో మందుల శాంపిల్స్ సేకరించామని వాటిని ల్యాబ్ కు పంపించడం జరిగిందని రిపోర్ట్ రావాల్సి ఉందని అన్నారు. కొన్ని మందుల దుకాణాల్లో జనరల్ స్టోర్స్ పేరుతో మందులకు సంబంధం లేనివి మందులతో పాటు ఉంచకూడనివి కూడా అమ్మకాలు చేస్తున్నారని వాటి వల్ల మందులు పాడైపోయే అవకాశం ఉందని అన్నారు. దుకాణాల్లో తప్పనిసరిగా ఫార్మసిస్ట్ లు ఉండాలని ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడం మనందరి బాధ్యత అని అన్నారు.

# ప్రణాళిక ప్రకారం విద్య అభ్యసించాలి.. జిల్లా కలెక్టర్



**రాజమహేంద్రవరం సిటీ (రాజానగరం), జనవరి 31 ( ప్రభాతవార్త ) :**
క్రమశిక్షణతో ప్రణాళిక ప్రకారం విద్యార్థులు విద్యను అభ్యసించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి అన్నారు. జిల్లాలో సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రతిభకు ప్రేరణ కార్యక్రమం సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జిజియు) లో శుక్రవారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ పాల్గొని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్అంబేద్కర్, మాజీ ఉప ప్రధాని బాబూ జగజ్జీవన్ రామ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు . అనంతరం సంక్షేమ శాఖ వసతి గృహాల్లోని విద్యార్థులకు జిజియు యాజమాన్యం సమకూర్చిన పరీక్షా సామాగ్రిని విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శోభారాణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతూ భవిష్యత్ లక్ష్యాలను నిర్ణయించుకుని కృషి చేయాలని చెప్పారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదవడం మాత్రమే ఏకైక మార్గం అని దీనికి ప్రత్యామ్నాయ పద్ధతులు లేవన్నారు. విజ్ఞానం పొందాలంటే పాఠ్యాంశాలను పూర్తిగా చదవాలని సూచించారు. పదో తరగతి నుండి ప్రతి విద్యార్థికి భవిష్యత్ ప్రయాణం ఉంటుందని చెప్పారు. సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శోభారాణి మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని వసతి గృహాల్లో పదొవ తరగతి విద్యార్థులకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని చెప్పారు. వివిధ రంగాల నుంచి మోటివేటర్లను ఈ సమావేశానికి ఆహ్వానించామ%జూ%న్నారు. దీనిలో జిజియూ రిజిస్ట్రార్ డాక్టర్ పి ఎం ఎం ఎస్ శర్మ, డీన్ డాక్టర్ ఎన్. లీలావతి, డైరెక్టర్ డాక్టర్ ఎం . శ్రీనివాసరావు, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పీజీ రామానుజమ్ తదితరులు పాల్గొన్నారు. ఫోటో రైట్ అప్... సమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి (2) విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని అందజేస్తున్న కలెక్టర్

# వాసవి కన్యకా పరమేశ్వరిని దర్శించుకున్న ఎమ్మెల్యే..అంబరాన్నంటిన ఆత్మార్పణ దినోత్సవం

**శంకవరం అన్నవరం , జనవరి 31, ( ప్రభాతవార్త ) :**
ఆర్యవైశ్యుల ఇలవేల్పు వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని ప్రత్తిపాడు శాసనసభ్యులు వరుపుల సత్య ప్రభ దర్శించుకున్నారు. వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం కావడంతో శుక్రవారం ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకున్నారు అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఆమెకు ఆలయ కమిటీ సభ్యులు ఆలయ అర్చకులు వేమకోటి మూర్తి వేమకోటి త్రినాధ శర్మ లు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద ఆశీర్వాదం అందించగా ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ . స్త్రీల ఆత్మగౌరవాన్ని చాటిన కలియుగ పార్వతీదేవి వాసవీమాత. అహింస, ఆత్మత్యాగానికి, శాంతికి ప్రతిరూపం వాసవీమాత. అమ్మను వేడుకుంటే శాంతి, సంపద, రక్షణ, ఆశీస్సులు మెండుగా లభిస్తాయన్నారు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం నందు విశేష పూజలు గావించి వేద పండితుల మంత్రోచ్చారణల మేళ తాళాల నడుమ పూజించడం జరిగింది. ఆలయ నిర్మాణంలో స్వర్గీయ వరుపుల రాజా విశేషంగా సహకరించారని జొన్నాడ రాజేష్ వెంకటేశ్వర ప్రసాద్ , దాసరి శ్రీనివాస్ దాసరి శంకర్ దాసరి గణేష్,



భువనగిరి శ్రీనివాస్ పేర్కొన్నారు నూతనంగా నిర్మించిన ఆర్యవైశ్య మండపాన్ని పరిశీలించారు ఈ కార్యక్రమంలో యెల్ల జగదీష్, అంబటి రాంబాబు, వెన్నా శివ, పర్వత సురేష్ బద్దిరామారావు ఉల్లి వీరభద్ర రావు రాజల చిట్టిబాబు వీరబాబు విర్ల సూరిబాబు మెరపల నరసయ్య, పిల్లి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు

# తూనికలు కొలతలు శాఖలో అవినీతి



**రాజమహేంద్రవరం, జనవరి31, ( ప్రభాతవార్త ) :**
తూనికలు, కొలతల శాఖలో అధికారుల అవినీతి ప్రవర్తన, అక్రమ దందాలు తాజా వివాదానికి తెరలేపాయి. అధికారుల అండతో వ్యాపారులు, ముఖ్యంగా కిరాణా, ఎరువులు, బంగారం, పెట్రోల్ బంక్స్, పెద్ద రైస్ మిల్లులు ముఖ్యంగా ఒక దూత అధికారులతో కుమ్మక్కై వసూళ్లకు పాల్పడుతున్నాడు. వ్యాపారాల్లో అక్రమాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ప్రముఖంగా, కొంతమంది అధికారులు మూడు నెలలకు ఒకసారి ముడుపులు తీసుకుంటున్నట్లు సమాచారం. మరికొంతమంది లంచాలు ద్వారా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ అక్రమాలను పోలీసుల స్థాయిలో దర్యాప్తు చేయాలని పలువురు కోరుతున్నారు. ట్యాంపరింగ్, ఎం ఆర్ పి ధర లేకుండా అధిక ధరలకు అమ్మకం వంటి సమస్యలు పెద్ద స్థాయిలో చోటు చేసుకుంటున్నాయి. తగిన చర్యలు తీసుకోవడానికి స్థానిక, రాష్ట్ర స్థాయి అధికారులు చుట్టూ ఉన్న నిబంధనలను సక్రమంగా అమలు చేస్తున్నారా అని ప్రశ్నించబడుతోంది. నెల వారీగా లంచాల రూపంలో తరచూ ముడుపులు వసూలు చేస్తూ, వారికి లభించే లాభాలను పేరుతో ప్రభుత్వ ఖజానాకి గండి కొడుతూ లంచం హుండీలో వేసుకుంటున్న అధికారులు తీరుపై దర్యాప్తు జరిపించడంద్వారా తాజా వాస్తవాలు వెలుగులోకి రావడంతో, ప్రజలపై భారం పడే అవకాశం కనబడుతుంది. వ్యాపారస్తులు, సామాన్య ప్రజలు, ప్రజా ప్రతినిధులు తక్షణమే అధికారులపై తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నారు.

# గోపాలపురం గురుకులానికి మంచి గుర్తింపు తెచ్చిన ఉమాదేవి

**గోపాలపురం జనవరి 31, ( ప్రభాతవార్త ) :**
గోపాలపురం డా.బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినీల ప్రతిభను జాతీయ స్థాయికి తీసుకెళ్ళిన ప్రిన్సిపల్ టీ.ఉమాదేవి కృషి అభినందనీయమని స్థానిక ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు ప్రశంసించారు. గోపాలపురం డా.బీఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపల్ తాళ్ళూరి ఉమాదేవి ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా సన్మాన కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మద్దిపాటి మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ అనేది తన వృత్తికే కాని, తన మనసుకు, తన ప్రతిభకు కాదని ప్రిన్సిపల్ ను ఉద్దేశించి కొనియాడారు. విద్యతో పాటు క్రీడల్లో విద్యార్థులనీలను జాతీయ స్థాయికి తీసుకెళ్ళిన ఘనత ఉమాదేవికే దక్కిందన్నారు. ప్రిన్సిపల్ గా పని చేసిన కొద్ది కాలంలోనే విద్యార్థులను చదువులో ఉన్నతంగా నిలిపి, కళాశాల ఉన్న గోపాలపురం నియోజవర్గానికి ఎంతో మంచి పేరు తీసుకొచ్చారన్నారు. అటువంటి ప్రిన్సిపల్ ఉద్యోగ విరమణ చేయడం బాధాకరమైనప్పటికీ, ఉద్యోగికి విరమణ తప్పదని, తన శేషజీవితం ఆనందంగా గడపాలని ఎమ్మెల్యే వెంకట్రాజు ఆకాంక్షించారు. మరో ముఖ్యఅతిథిగా హాజరైన కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా గురుకుల పాఠశాలల విద్యార్థులను కూడా ఉపాధ్యాయులు తీర్చిదిద్దుతున్నారని, అందుజేత గురుకులాల్లో సీట్ల కోసం తల్లిదండ్రులు పోటీ



-ఎమ్మెల్యేలు వెంకట్రాజు, వెంకటేశ్వరరావు

పడుతున్నారని అన్నారు. విద్య వ్యాపారం ఐనా ప్రస్తుత రోజుల్లో గురుకుల పాఠశాలలను ప్రభుత్వం అభివృద్ధి చేస్తూ వారు అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తుందన్నారు. ఆడపిల్లల భద్రతకు ఎంతగానో ఉపయోగపడే ఇటువంటి గురుకులాలను తనకు వీలైనంత వరకు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఆస్తిపాస్తులు లేని పేదపిల్లలకు విద్య ఒకటే గొప్ప ఆస్తి అని, రాజ్యాంగం ద్వారా అనేక విద్యావకాశాలను కల్పించిన బీఆర్ అంబేద్కర్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుంటూ జీవితంలో ఉన్నతంగ స్థిరపడాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావ్ విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి ఎమ్మెల్యేలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఉభయ గోదావరి జిల్లాల నుంచి పాల్గొన్న గురుకులాల ప్రిన్సిపల్స్, టీచర్లు, మండల తెదేపా నాయకులు రొంగల సత్యనారాయణ, జ్యేష్ఠ శ్రీధర్, కొర్లపాటి రాము, మద్దిపాటి గంగరాజు తదితరులు ప్రిన్సిపల్ ఉమాదేవి, రత్నకుమార్ దంపతులను దుశ్శాలువాలు, పూల మాలలతో ఘనంగా సత్కరించారు.

# వాసవి మాత ఆత్మార్పణ రోజును ప్రభుత్వం అధికారికంగా గుర్తింపు



**కోనసీమ బ్యూరో, జనవరి 31, ( ప్రభాతవార్త ) :**
వైశ్యాస్ ఆరాధ్య దైవం వాసవి మాతగా పిలవబడే కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ రోజును ప్రభుత్వం అధికారికంగా గుర్తించడం పట్ల కొత్తపేట ఆర్యవైశ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఎప్పటినుంచో ప్రభుత్వాలను ఆర్యవైశ్యులు అధికారికంగా ప్రకటించాలని కోరుతూ వచ్చామన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వారి చిరకాల కోరికను నెరవేర్చడంతో వాసవి మాత ఆత్మార్పణ గావించిన రోజును సంతోషంతో పండగలా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వాసవి మాత కన్యకా పరమేశ్వరి ఆలయానికి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు విచ్చేశారు. స్వాగత సత్కారాల పూర్ణ మేళాలతో ఆర్యవైశ్య సంఘం స్వాగతం పలికారు. శ్రీ వాసవి మాతకు పట్టు వస్త్రాలను ఎమ్మెల్యే సత్యానందరావు సమర్పించారు. ఎమ్మెల్యే సత్యానందరావు మాట్లాడుతూ హింస కు తావివ్వకుండా అహింసా మార్గాన్ని ప్రోత్సహిస్తూ తనకు తానే ఆత్మార్పణ చేసుకున్న వాసవి మాత గొప్పతనాన్ని తెలియజేస్తూ ఆమెను స్మరించుకున్నారు. ఎన్నికల ముందు ఈ ఆలయానికి విచ్చేసినప్పుడు తనపై నమ్మకంతో తనను ఆశీర్వదించి నాలుగోసారి ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలిపించిన వారందరికీ సత్యానందరావు ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ధర్నాల రామకృష్ణ, బూసి జయలక్ష్మి భాస్కరరావు, నంబూరి రెడ్డయ్య,విళ్ల మారుతి ప్రసాద్,మిద్దె ఆదినారాయణ,యల్లమిల్లి జగన్ మోహన్, గుబ్బల మూర్తి, ముద్రగడ సుబ్బారావు,పల్లికొండ సుదీర్, ఎండూరి పవన్,తమ్మన సాయి ప్రసాద్, శ్రీకాకుళపు రాధాకృష్ణ, శ్రీకాకుళపు బాబీ, డాక్టరు పీ.కృష్ణ రావు, కోట్ల విశ్వేశ్వరరావు, ముద్రగడ పణి కముజు శ్రీను, కరెల్ల ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.


# ప్రణాళిక ప్రకారం విద్య అభ్యసించాలి.. జిల్లా కలెక్టర్

**రాజమహేంద్రవరం సిటీ (రాజానగరం), జనవరి 31 , ( ప్రభాతవార్త ) :**
క్రమశిక్షణతో ప్రణాళిక ప్రకారం విద్యార్థులు విద్యను అభ్యసించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి అన్నారు. జిల్లాలో సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రతిభకు ప్రేరణ కార్యక్రమం సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జిజియు) లో శుక్రవారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ పాల్గొని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్అంబేద్కర్, మాజీ ఉప ప్రధాని బాబూ జగజ్జీవన్ రామ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు . అనంతరం సంక్షేమ శాఖ వసతి గృహాల్లోని విద్యార్థులకు జిజియు యాజమాన్యం సమకూర్చిన పరీక్షా సామాగ్రిని విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శోభారాణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతూ భవిష్యత్ లక్ష్యాలను నిర్ణయించుకుని కృషి చేయాలని చెప్పారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదవడం మాత్రమే ఏకైక మార్గం అని దీనికి ప్రత్యామ్నాయ పద్ధతులు లేవన్నారు. విజ్ఞానం పొందాలంటే పాఠ్యాంశాలను పూర్తిగా చదవాలని సూచించారు. పదో తరగతి నుండి ప్రతి విద్యార్థికి భవిష్యత్ ప్రయాణం ఉంటుందని చెప్పారు. సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శోభారాణి మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని వసతి గృహాల్లో పదొవ తరగతి విద్యార్థులకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని చెప్పారు.


# ఆర్యవైశ్యులకు అండగా కూటమి ప్రభుత్వం..

# ఎమ్మెల్యే గిడ్డి అంబాజీపేటలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం

**అంబాజీపేట, జనవరి 31, ( ప్రభాతవార్త ) :**
ఆర్యవైశ్యులకు ఎన్డిఏ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. ఆర్యవైశ్యుల ఆరాధ్య దేవత శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా స్థానిక బస్ స్టేషన్ సమీపంలోని అమ్మవారి ఆలయం వద్ద ఆలయ అర్చకులు చంద్రమౌళి ధనుష్ శర్మ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ గత ఏడాది మే 5న ఎన్నికల ప్రచారంలో భాగంగా శ్రీ వాసవి మాతను దర్శించుకునేందుకు ఆలయంనకు వచ్చిన సందర్భంగా అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవంను ప్రభుత్వ వేడుకగా నిర్వహించేలా కృషి చేయాలని అంబాజీపేట ఆర్యవైశ్య సంఘం సభ్యులు కోరారన్నారు. ఇదే విషయాన్ని తెలుగుదేశం పార్టీ ఎన్నికల మేనిఫెస్టో పొందుపరిచిందని ఎమ్మెల్యే గుర్తుచేశారు. ఎన్నికల అనంతరం రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లానని ఎమ్మెల్యే తెలిపారు. ఆర్యవైశ్యుల విన్నపాలను,టిడిపి మేనిఫెస్టోను పరిగణలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం శ్రీ వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవంను ప్రభుత్వ వేడుకగా ప్రకటిస్తూ జీవోను విడుదల చేసిందన్నారు. ఆర్యవైశ్యుల నమ్మకాన్ని నిలబెట్టిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వంకు ఆర్య వైశ్యులు అండగా నిలవాలని ఎమ్మెల్యే కోరారు. ఆలయ ప్రాంగణంలో లలితా సహస్ర పారాయణం చేస్తున్న ఆర్యవైశ్య మహిళలకు ఎమ్మెల్యే సత్యనారాయణ అభివాదం చేశారు. అనంతరం అంబాజీపేట ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కాసు శ్రీనివాసరావు,గోకవరపు శివల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సత్యనారాయణను దుశ్చాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అంతకుముందు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఎన్డీఏ కూటమి శ్రేణులతో కలిసి



అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యులు అప్పన బాలాజీ, గ్రంధి శ్రీనివాస్, కాసు సాయిబుజ్జి, నిట్టాల సాయిరామ్,అప్పన శ్యామ్, రామ్, నిట్టాల బాలాజీ, బొండాడ శివ, బోనగిరి కాశి, గెల్లి సంతోష్,నిట్టాల సాయి ప్రసాద్,ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు,కూటమి నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు,గణపతి వీర రాఘవులు,మైపాల తాతాజీ, కొర్లపాటి గోపి,అరిగెల నూరిబాబు,దొమ్మేటి సాయికృష్ణ,అరిగెల బలరామ్మూర్తి,రవణం రాము,గుత్తుల చంటి, ముత్యాల జమ్మిల్,దొమ్మేటి శ్యామ్, సుంకర నాయుడు, పేరాబత్తుల సుబ్బరాజు,వంగా చిన్న తదితరులు పాల్గొన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,"Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps

# కొత్త కరెన్సీని తెస్తే 100% సుంకాలు తప్పవు

## బ్రిక్స్ కూటమికి యుఎస్ అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికలు



**న్యూఢిల్లీ, జనవరి 31:** డాలర్ కరెన్సీ రూపేణా బ్రిక్స్ దేశాల్లో కొత్తకరెన్సీని అమలుకు తెస్తే అమెరికా సుంకాలు తప్పవని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. నూరుశాతం వారి ఎగుమతులపై సుంకాలు వేస్తామని అంతర్జాతీయ ట్రేడ్‌లో డాలర్‌కు ప్రత్యామ్నాయంగా కరెన్సీని తీసుకొస్తే సుంకాలు తప్పవని స్పష్టం చేశారు. అంతర్జాతీయంగా డాలర్ వినియోగాన్ని తగ్గించాలని చూస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని, బ్రిక్స్ దేశాలు ప్రపంచ వాణిజ్యంలో అమెరికా డాలర్ స్థాయిని పరిగణించాలనే లోనికి తీసుకోవాలని లేదంటే ఆర్థిక పరిణామాలు ఎదుర్కొవాల్సి ఉంటుందని హెచ్చరించారు. డాలరు రూపేణా వాణిజ్య లావాదేవీల నుంచి వైదొగాలని బ్రిక్స్ దేశాలుచూస్తున్నాయని ఇప్పటికే మేం నిశితంగా గమనిస్తున్నామని ట్రంప్ తన ట్రూత్ సోషల్‌మీడియాలో ప్రకటించారు. బ్రిక్స్ దేశాలు కొత్తగా కరెన్సీని తీసుకురాబోమని, లేదా మరో కరెన్సీని డాలర్‌కు ప్రత్యామ్నాయంగా అమలుకు తీసుకురాబోమని లిఖితపూర్వకంగా తెలియజేయాలని లేదా బ్రిక్స్ దేశాలు సంయుక్తంగా ప్రకటించాలని సూచించారు. అలాంటి ప్రయత్నాల్లే ఈ దేశాల కూటమి చేస్తే ట్యారిఫ్‌కు హలో చెప్పాల్సిందేనని, అమెరికాకు గుడ్‌బై చెప్పాల్సి ఉంటుందని వెల్లడించారు. బ్రిక్స్ కూటమిలో బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా దేశాలున్న సంగతి తెలిసిందే. డాలర్‌పై ఆధారపడటం రానురాను తగ్గించాలని ఈ దేశాలకూటమి అనేక సమావేశాల్లో చర్చించింది. పాశ్చాత్యదేశాల ఆంక్షలు పెరుగుతున్న కొద్దీ ఈ దేశాలు డాలర్‌పై ఆధారపడటం ఎందుకని ప్రశ్నిస్తున్నాయి. ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర కాలం నుంచి అమెరికా రష్యాపై మరిన్ని ఆంక్షలు ప్రకటించింది. ఇటీవలే కాలంలోకి బ్రిక్స్ కూటమి విస్తరించింది. ఈజిప్టు, ఇథియోపియా, ఇండోనేసియా, ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాలను కూటమిలోకి ఆహ్వానించింది. వాస్తవానికి బ్రిక్స్‌ప్లస్ కూటమికి ఒకే కరెన్సీ అంటూ ఏదీలేదు. వారివారి స్థానిక కరెన్సీల్లోనే ఈ దేశాలు వాణిజ్యం చేస్తున్నాయి. 2023లో జరిగిన 15వ బ్రిక్స్ సదస్సులో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ డాలర్‌పై ఆధారపడటం తగ్గించాలని బ్రిక్స్ దేశాలు తమతమ దేశాల కరెన్సీల్లోనే లావాదేవీలు చేసే విధానం అమలుకు తీసుకురావాలని, ఇందుకోసం ఆదేశాల సెంట్రల్ బ్యాంకులు నుంచి సహకారం అవసరమని రష్యా అధ్యక్షుడు ప్రతిపాదించారు. ఇప్పటికీ డాలర్ ప్రపంచంలోనే అత్యంత చెలామణిలో ఉన్న కరెన్సీగా సాగుతోంది. అట్లాంటిక్ మండలి జియో ఎకనమిక్ సెంటర్ గత ఏడాది తన అధ్యయనంలో యూరోపియన్ కరెన్సీ యూరో కానీ, బ్రిక్స్‌ప్లస్ దేశాలు డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించే ప్రయత్నాలుచేస్తున్నాయని ప్రస్తావించింది.ఇపుడు ట్రంప్ అధికారంలోకి వచ్చినతర్వాత డాలర్‌కరెన్సీ వాడకం తగ్గించాలని చూస్తే 100శాతం సుంకాలు తప్పవని హెచ్చరిస్తున్నారు. ఈ సుంకాల అధికంగా వినియోగిస్తే అక్రమ వలసలు, డ్రగ్స్ అక్రమరవాణా, ప్రత్యేకించి అమెరికాలోకి ఫెంటానిల్ రాకను కట్టడిచేయగలమని చెబుతున్నారు. అయితే సుంకాలు పెంచడంవల్ల అమెరికా వినియోగదారులు, వ్యాపార సంస్థలకు వ్యాపారం దెబ్బ తింటుందని పరిశ్రమలు ఎక్కువగా దిగుమతి ఉత్పత్తులపైనే ఆధారపడతాయని ఆర్థికవేత్తలు వాదిస్తున్నారు.

## మాలిలోని బంగారు గనిలో విరిగిపడిన కొండచరియలు

# 10 మంది దుర్మరణం

**బమాకో, జనవరి 31:** పశ్చిమ ఆఫ్రికాలోని మాలి దేశంలో ఘోర ప్రమాదం జరిగింది. బంగారు గనిలో కొండచరియలు విరిగిపడటంతో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. మరికొంతమంది ఆచూకీ ఇంకా తెలియరాలేదు. కౌలికోరో ప్రాంతంలోని బంగారు గనిలో బుధవారం ఈ ఘటన జరిగిందని అక్కడి గవర్నర్ కల్నల్ లామైన్ కపోరీ సనోగో పేర్కొన్నారు. 'గనిలో తవ్వకాలు చేస్తుండగా ఒక్కసారిగా కొండ చరియలు విరిగిపడ్డాయి. ఆ సమయంలో బంగారం వెతుకులాటకు వెళ్లినవారిలో 10 మంది మృత్యువాత పడ్డారు. ప్రాణాలు కోల్పోయిన వారిలో ఎక్కువమంది మహిళలే ఉన్నారు. గనిలోకి బురదనీరు ప్రవేశించి వారిని చుట్టుముట్టింది. మరికొంతమంది శిథిలాల కింద చిక్కుకొనిపోయారు. వారిని రక్షించేందుకు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది' అని గవర్నర్ వెల్లడించారు. ఆఫ్రికా దేశాల్లో మూడో అతిపెద్ద బంగారు ఉత్పత్తిదారుగా మాలి ఉంది. ఈ దేశంలో గనుల ప్రమాదాలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. గతేడాది సైతం ఇదే ప్రాంతంలోని కంగబా జిల్లాలో బంగారు గని కుప్పకూలింది. ఈ ఘటనలో 70 మందికిపైగా మృత్యువాత పడ్డారు.

## బానిసల పిల్లల కోసం ఆ పౌరసత్వం..

# ప్రపంచమంతా ఎగబడితే ఎలా?: ట్రంప్

**వాషింగ్టన్, జనవరి 31:** అమెరికా అధ్యక్ష పదవిలోకి వచ్చీ రాగానే డొనాల్డ్ ట్రంప్ పదులకొద్దీ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై సంతకాలు చేశారు. అందులో ఒకటి జన్మతఃపౌరసత్వం లభించే హక్కును రద్దు చేయడం..! ఇది కాస్త వివాదాస్పదం కావడంతో న్యాయస్థానం ఆ ఉత్తర్వులను నిలిపివేసింది. ఈ క్రమంలోనే తాజాగా ట్రంప్ దీనిపై స్పందించారు. బానిసల పిల్లల కోసమే తొలినాళ్లలో జన్మతఃపౌరసత్వాన్ని తీసుకొచ్చారని వ్యాఖ్యానించారు.

'ఒకసారి గతాన్ని గుర్తు చేసుకుంటే బానిసల పిల్లలకు హక్కులు కల్పించాలనే ప్రాథమిక ఉద్దేశంతో జన్మతఃపౌరసత్వాన్ని అప్పట్లో ఆమోదించారు. అంతేకగానీ ప్రపంచ జనాభా మొత్తం వచ్చి అమెరికాలో పోగుపడటం కోసం ఆ చట్టాన్ని తీసుకురాలేదు. చాలామంది మన దేశానికి వస్తున్నారు. అర్హత లేని వ్యక్తులు ఈ చట్టాన్ని ఉపయోగించుకుంటున్నారు. దీంతో అర్హత లేని పిల్లలకు పౌరసత్వం లభిస్తోంది. ఈ చట్టం అందుకోసం కాదు. చాలా గొప్ప ఉద్దేశంతో బానిసల పిల్లల కోసం తీసుకొచ్చినది' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. దీనిపై తాను సుప్రీంకోర్టుకు వెళ్తానని చెప్పారు. అక్కడ తమకు అనుకూలంగా తీర్పు వస్తుందని వంద శాతం విశ్వాసంతో ఉన్నట్లు పేర్కొన్నారు.

అమెరికా రాజ్యాంగంలో 14వ సవరణ ప్రకారం తల్లిదండ్రుల వలసస్థితితో సంబంధం లేకుండా అమెరికాలో జన్మించిన వారందరికీ పౌరసత్వం లభించే విధానం అమల్లో ఉంది. ట్రంప్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తొలిరోజునే జన్మతః పౌరసత్వం లభించే హక్కును రద్దు చేసేలా కార్యనిర్వాహక ఆదేశాలు జారీ చేశారు. దీనిపై డెమోక్రాట్లు అధికారంలో ఉన్న 22 రాష్ట్రాలు 5 దావాలు వేశాయి.

అందులో ఒక దానిపై ఇటీ వల సియాటిల్‌లోని ఫెడరల్ కోర్టు తీర్పు వెలు వరించింది. ట్రంప్ ఇచ్చిన ఆదేశాలు రాజ్యాంగ విరుద్ధమని దాన్ని తాత్కాలికంగా నిలిపి వేస్తు న్నట్లు న్యాయస్థానం స్పష్టం చేసింది.



## చిన్నారుల కోసం నిపుణ్ భారత్ ఇనీషియేటివ్

### ఆర్థిక సర్వేలో అనంత నాగేశ్వరన్ ప్రస్తావన

**న్యూఢిల్లీ, జనవరి 31:** కేంద్ర బడ్జెట్ నేడు ప్రవేశపెడుతున్న తరుణంలో ఆర్థికసర్వేను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టారు. భారత్ ఆర్థికపని తీరుతోపాటు భవిష్యత్తు పరిణామాలకు ఈ నివేదిక పునాదులు వేసింది. 2026లో మూడో తరగతి పూర్తి చేసుకునే ప్రతి చిన్నారికి సమగ్ర అక్షరాస్యత కల్పించేందుకు నిపుణ్ భారత్ ఇనీషియేటివ్‌ను ఈ సర్వే ప్రధానంగా చూపింది. ఈ కార్యాచరణతో చిన్నారులకు అవగాహన పెంచడం ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యలపై పూర్తి అవగాహన కల్పించేందుకు నిర్ణయించారు. విద్యా సవాళ్లను పరిష్కరించడం, దేశవ్యాప్తంగా అభ్యాసన నైపుణ్యాలను మెరుగుపరచడంలో ఈ నిర్ణయం కీలకం అవుతుందని అన్నారు. ఆర్థిక సర్వేలోపేర్కొన్న విధంగా బీహార్, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో విజయవంతమైన నిర్దిష్ట కార్యక్రమాలను సిఇఎ హైలైట్ చేసారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉండబోయే కొన్ని కీలకాంశాలు కింది విధంగా ఉంటాయని నిపుణులు అంచనావేస్తున్నారు. ఉపాధ్యాయులకు బేసిక్ నైపుణ్యాలను చిన్నారులకు అందించేందుకు సమగ్ర శిక్షణ ఇస్తారు. ప్రాథమిక దశనుంచే అక్షరాస్యత, సంఖ్యలపై నైపుణ్యత ప్రాధాన్యతను తెలిపే పాఠ్యప్రణాళికలు రూపొందించి అమలు చేయడం, పిల్లల అభ్యాసనకు మద్దతిచ్చేందుకు విద్యాప్రక్రియలో సమాజం, తల్లితండ్రులు భాగస్వాములను చేయడం,ఈ బేసిక్‌నైపుణ్యాల్లో విద్యార్థుల పురోగతిని పర్యవేక్షించేందుకు వాటిని అంచనావేయడానికి బలమైన వ్యవస్థలను ఏర్పాటుచేయడం వంటివి అవసరమని ఆర్థికసర్వేలో ప్రధాన ఆర్థికసలహాదారు అనంత నాగేశ్వరన్ ప్రస్తావించారు.

# రాష్ట్రపతి ఎంతో అలిసిపోయారు..

## సోనియా వ్యాఖ్యలపై బిజెపి, విపక్షాల మధ్య దుమారం




**న్యూఢిల్లీ, జనవరి 31:** పార్లమెంటు ఉభయసభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేసిన ప్రసంగంపై సోనియా చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. రాష్ట్రపతి హోదాను విస్మరించి ప్రథమ మహిళను కించపరిచేటట్లు ఉన్నాయని, సోనియా రాహుల్, ప్రియాంక వంటి నాయకులకు ఇలాంటి వ్యాఖ్యలు తగదని బిజెపి నేతలు ధ్వజమెత్తారు. బడ్జెట్ సమావేశాలు ప్రారంభం రోజున శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించారు. సమావేశం తర్వాత బయటకు వచ్చిన సోనియాను మీడియా పలకరించింది. దీనితో ఆమె మాట్లాడుతూ ప్రసంగం చదువుతూ రాష్ట్రపతి బాగా అలిసిపోయారు. అందువల్లనే పూర్తి స్థాయిలో చదవలేకపోయారని పేర్కొన్నారు. ప్రసంగం ఆసాంతం స్పష్టంగా చదవలేకపోయారని సోనియా అన్నారు. దీనితో ఒక్కసారిగా బిజెపి సభ్యులు ధ్వజమెత్తారు. అభ్యంతరకర వ్యాఖ్యలని వెంటనే క్షమాపణలుచెప్పాలని డిమాండ్‌చేసారు. బిజెపి సభ్యుఉరాలు సుకాంత మజుందార్ మాట్లాడుతూ సోనియా వంటి నేతలు ఇలాంటి వ్యాఖ్యలు చేయకూడదని చెప్పారు. ఆదివాసి మహిళ నేడు రాష్ట్రపతిగా ఉన్నందున సామ్రాజ్యవాద స్ఫూర్తితో ఉన్న ఆ కుటుంబానికి నచ్చదని అందుకనే ఇలా అవమానకరంగా మాట్లాడుతున్నారరన్నారు. సోనియా వ్యాఖ్యలపై రాష్ట్రపతి భవన్‌నుంచి కూడా ప్రత్యేకప్రకటన వెలువడింది. ప్రసంగం ఆసాంతం రాష్ట్రపతి ఎక్కడా అలిసిపోలేదని మహిళలు, రైతులు, ఇతర అణగారిన వర్గాలపై ప్రసంగించేందుకు ఎక్కువ ఆసక్తి చూపించారన్నారు. దేశీయభాషల్లో సూక్తులు బహుశా ఈ నేతలకు తెలియకపోవచ్చని దీనివల్ల తప్పుడు ప్రభావం పడుతోందన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు దురదృష్టకరమని ఎంతమాత్రం ఆమోదనీయం కాదని రాష్ట్రపతి భవన్ ప్రకటన వెలువరించింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రముఖ నాయకులు చేసిన వ్యాఖ్యలు ఈ అత్యున్నత భవన్ హోదాను, హుందాతనాన్ని కించపరిచినట్లుందని ప్రకటనలో వివరించారు. సోనియా వ్యాఖ్యలపై బిజెపి చీఫ్ జెపి నడ్డా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసారు. ప్రసంగంలో చెప్పిందే చెపుతూ వచ్చారని ఎఐసిసి నాయకుడు రాహుల్ గాంధీకూడా వ్యాఖ్యలు చేసారు. పైగా సోనియా వ్యాఖ్యలపై రాహుల్ ఆమెకు మద్దతిచ్చారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ ఆదివాసీ మహిళ అయిన ముర్ము ఎంతమాత్రం తగ్గిపోరని దేశం కోసంఎంతో కృషి చేసారన్నారు.

# ఎక్కువ పనిగంటలు ఆరోగ్యానికి హానికరం

### ఆర్థిక సర్వేలో ప్రస్తావన

**న్యూఢిల్లీ, జనవరి 31:** ఆఫీసు పనిగంటల చర్చ దేశవ్యాప్తంగా నడుస్తున్న తరుణంలో ఆర్థిక




మంత్రి నిర్మలా సీతారామన్‌ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పనిగంటల ప్రస్తావన వచ్చింది. వారానికి 60 గంటలకుమించి పనిచేయడంవల్ల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆర్థిక సర్వే హెచ్చరించింది. వివిధ అధ్యయనాల నివేదికలను ఇందులో ప్రముఖంగా ప్రస్తావించింది. ఆర్థికసర్వే 2024-25 ప్రకారం ఆఫీసుల్లో ఎక్కువసేపు గడపడం వల్ల మానసిక శ్రేయస్సుకు మంచిదికాదని, రోజుకు 12, అంతకంటే ఎక్కువ గంటలు పనిచేసే వ్యక్తులు గణనీయమైన స్థాయిలో బాధ అనుభవిస్తున్నారు. వారానికి ఎక్కువ పనిచేయడం ఆరోగ్యానికి హానికరమని, ప్రపంచ ఆరోగ్యసంస్థ అంతర్జాతీయ కార్మికసంస్థ అధ్యయనాల నివేదికలు కూడా ఈ అంశాన్ని స్పష్టంచేసాయని ఆర్థికసర్వేలోప్రస్తావించారు. అనధికారికంగా ఎక్కువ పనిగంటలతో ఉత్పాదకత పెరిగినా వారానికి 55-60 గంటలమధ్య పనిచేయడం ఆరోగ్యాన్ని దెబ్బతీయడమేనని ప్రపంచ ఆరోగ్య సంస్థ, అంతర్జాతీయ కార్మిక సంస్థలు సంయుక్త నివేదికల్లో ఉటంకించినట్లు ఆర్థికసర్వే ప్రస్తావించింది. ఒకేదగ్గర ఎక్కువ పనిగంటలు చేయడంవలన మానసిక ఆరోగ్యాన్ని క్షీణింపచేస్తుందని సపెయినలాబ్స్ సెంటర్ హ్యూమన్ బ్రెయిన్ అండ్ మైండ్ స్టడీ రిపోర్టును ఎకనమిక్ సర్వే హైలైట్‌చేస్తూ ప్రస్తావించింది. పనిగంటలపై పరిమితులు విధించి ఆర్థికవృద్ధికి అవాంతరం కలిగించవచ్చని సర్వే అంచనా వేసింది. కార్మికుల సంపాదన సామర్థ్యాన్ని దెబ్బతీసే అవకాశం లేకపోలేదని తెలిపింది. సౌకర్యవంతమైన పనిగంటల విధానం భారత దేశాన్ని ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా ఉంచుతుందని ఈ చర్యలతో చిన్న మధ్య తరహా పరిశ్రమల వృద్ధికి తోడ్పడుతుందని ఆర్థికసర్వే సూచించింది.



# నియంతలపై ప్రేమ లేదు

## అమెరికా కొత్త ఇంటెలిజెన్స్ అధికారి తులసీ గబ్బార్డ్

**వాషింగ్టన్, జనవరి 31:** తనకు నియంతలపై ఎలాంటి ప్రేమ లేదని యుఎస్ నూతన ఇంటెలిజెన్స్ అధికారి తులసీ గబ్బార్డ్ పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ఆమెను నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్‌గా ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఆ పదవీబాధ్యతలు చేపట్టబోయే ముందు తులసి యుఎస్ సెనేటర్ల ఎదుట హాజరయ్యారు. డెమోక్రట్లు, రిపబ్లికన్ల నుంచి ఎదురైన ఎన్నో కఠిన ప్రశ్నలకు ఆమె సమాధానాలిచ్చారు. ఇందులో భాగంగా మాట్లాడుతూ అసద్, గడాఫీ, మరే ఏ ఇతర నియంతలపైనా తనకు ప్రేమ లేదని, అల్‌ఖైదాను ద్వేషిస్తానని వెల్లడించారు. అసద్ తన సొంత ప్రజలపైనే రసాయన ఆయుధాలను వినియోగించిన ఘటనను తులసి ఖండించారు. ఉగ్రవాదాన్ని, దానిని ప్రోత్సహించే నేతలను తాను ఏమాత్రం ఉపేక్షించనని పేర్కొన్నారు. డిఎన్‌ఐ డైరెక్టర్‌గా అమెరికా ప్రజల భద్రత, స్వేచ్ఛను కాపాడడానికి,సైన్యాన్ని మరింతపటిష్టం చేయడానికి తనవంతు కృషి చేస్తానని వెల్లడించారు.

అమెరికాలోని మొత్తం 18 నిఘా సంస్థలు డిఎన్‌ఐ హోదాలో ఉన్న తులసి పర్యవేక్షణలో పనిచేస్తాయి. ప్రపంచంలో ఏ మారుమూల ఏం జరిగినా ఇవిసేకరిస్తాయి. చివరికి సిఐఎ అధిపతి కూడా ఆమెకు రిపోర్టుచేస్తారు. నిఘా సమాచారాన్ని క్రోడీకరించి రోజువారీ కీలక విషయాలను ఆమె అధ్యక్షుడికి వెల్లడిస్తారు. 9/11 దాడుల తర్వాత ఏర్పడిన కమిషన్ సూచనల మేరక ఏర్పాటు చేసిన అత్యంత కీలక పదవి ఇది.

2019లో డెమోక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం పోటీపడ్డారు. కానీ, ఆ తర్వాత బైడెన్‌కు మద్దతు పలికారు. నాడు హిల్లరీ క్లింటన్ ఆమెను ఏకంగా రష్యా ఏజెంట్ అంటూ విమర్శలు గుప్పించారు. దీనికి తులసి స్పందిస్తూ.. 'యుద్ధోన్మాదుల అవినీతి స్వరూపంగా' హిల్లరీని అభివర్ణించడం సంచలనం రేపింది. 2024 పోలింగ్‌కు కొన్ని వారాల ముందు రిపబ్లికన్ పార్టీ చేరారు. యుద్ధాలను వ్యతిరేకించే ట్రంప్ తన భావాలకు దగ్గరగా ఉండటంతో చేరినట్లు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో కూడా దూకుడుగా రిపబ్లికన్ల విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. కమలతో చర్చా కార్యక్రమంలో ట్రంప్‌నకు చేదోడువాదోడుగా వ్యవహరించారు. తనపై దాడికి ఇంటెలిజెన్స్ వైఫల్యమే కారణమని ట్రంప్ బలంగా విశ్వసించారు. అందుకే తులసికి ఆ విభాగాన్ని అప్పజెప్పారు.

## కిన్నెర అఖాడా నుంచి మమతా కుల్‌కర్ణి బహిష్కరణ

### ఇటీవలే దీక్ష తీసుకొన్న కుల్‌కర్ణి



**ప్రయాగ్‌రాజ్, జనవరి 31:** మహాకుంభమేళా ప్రారంభంలో ప్రాపంచిక జీవనాన్ని పరిత్యజించి, సన్యాసినిగా మారిన ప్రముఖ బాలీవుడ్ నటి మమతాకులకర్ణి (52), కిన్నర అఖాడా నుంచి బహిష్కరణకు గురయ్యారు. మహామండలేశ్వర్‌గా ఆమె తీసుకున్న దీక్షను రద్దు చేశారు. పలువురు మతపెద్దలు, అఖాడాల నుంచి వస్తున్న అభ్యంతరాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అఖాడాలు వెల్లడించారు. అంతే కాదు ఆమెను అఖాడాలో చేర్పించిన కిన్నెర అఖాడా ఆచార్య మహామండలేశ్వర్ డాక్టర్ లక్ష్మీనారాయణ్ త్రిపాఠిని సైతం అఖాడా నుంచి తొలగిస్తున్నట్లు తెలిపారు. కిన్నెర అఖాడాలో కులకర్ణి చేరిక తర్వాత అందులోని సభ్యుల మధ్య వివాదాలు చెలరేగాయి. అఖాడాలో చేరిన మొదట్లోనే ఆమె అత్యున్నత స్థానమైన మహామండేశ్వర్ హోదాను పొందడాన్ని పలువురు వ్యతిరేకించారు. మహా కుంభమేళా పవిత్రమైన ఆధ్యాత్మిక కార్యక్రమమని, కానీ కొందరు వ్యక్తులు ఇందులో అసభ్యతను ప్రోత్సహిస్తున్నారంటూ ప్రముఖ యోగా గురువు బాబా రామ్‌దేవ్ మండిపడ్డారు. ఇప్పటివరకు ప్రాపంచిక సుఖాల్లో మునిగిపోయిన వ్యక్తులు ఒక్కసారిగా సన్యాసులుగా మారిపోయి మహామండేశ్వర్ హోదాను పొందడాన్ని పలువురు వ్యతిరేకించారు. మహా కుంభమేళా పవిత్రమైన ఆధ్యాత్మిక కార్యక్రమమని, కానీ కొందరు వ్యక్తులు ఇందులో అసభ్యతను ప్రోత్సహిస్తున్నారంటూ ప్రముఖ యోగా గురువు బాబా రామ్‌దేవ్ మండిపడ్డారు. ఇప్పటివరకు ప్రాపంచిక సుఖాల్లో మునిగిపోయిన వ్యక్తులు ఒక్కసారిగా సన్యాసులుగా మారిపోయి మహామండలేశ్వర్ వంటి బిరుదులను కూడా పొందుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే అఖాడా వ్యవస్థాపకులు అజయ్ దాస్, కులకర్ణి గురువు లక్ష్మీనారాయణ్ త్రిపాఠి మధ్య విభేదాలు తీవ్రమయ్యాయి. అజయ్‌దాస్ అఖాడా నుంచి బయటకు వెళ్లి, తన కుటుంబంతో నివసిస్తున్నారని, కిన్నెర అఖాడా నియమాల ప్రకారం కుటుంబంతో ఉన్నవారికి ఈ విషయంలో నిర్ణయం తీసుకునే అధికారం లేదని త్రిపాఠి పేర్కొన్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఆమెపై బహిష్కరణ వేటు వేసినట్లు తెలుస్తోంది. 90వ దశకంలో బాలీవుడ్‌లో మంచి క్రేజ్ సంపాదించుకున్న నటి మమతాకులకర్ణి 2003 తర్వాత సినిమాల నుంచి తప్పుకొని, విదేశాలకు వెళ్లిపోయారు. ఈ క్రమంలోనే డ్రగ్స్ రాకెట్‌లో ఆమె పేరు వినిపించింది. పోలీసులు నోటీసులు సైతం పంపారు. ఇన్నేళ్ల తర్వాత కుంభమేళ సందర్భంగా భారత్‌కు వచ్చిన ఆమె అందరినీ ఆశ్చర్యపరుస్తూ కిన్నెర అఖాడాలో చేరి తన పేరును 'మాయి మమతానంద్ గిరి'గా మార్చుకున్న విషయం తెలిసిందే.

## పార్లమెంటు ఉభయసభలు నేటికి వాయిదా



**న్యూఢిల్లీ, జనవరి 31:** పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ప్రారంభం రోజున రాష్ట్రపతి ప్రసంగం అనంతరం ఉభయసభలు శనివారానికి వాయిదాపడ్డాయి. పార్లమెంటులో రాష్ట్రపతి ఉభయ సభలనుద్దేశించి తొలిరోజు ప్రసంగించారు. అనంతరం కేంద్ర బడ్జెట్‌కు ముందు ప్రతి ఏటా ప్రవేశపెట్టే ఆర్థిక సర్వేను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌సభలో ప్రవేశపెట్టారు. ఆ తర్వాత సభను శనివారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్‌ఓంబిర్లా ప్రకటించారు. ఆ తర్వాత ఆర్థిక మంత్రి ఆర్థికసర్వేను రాజ్యసభముందుకు తీసుకెళ్లారు. రాజ్యసభలో ప్రవేశపెట్టిన తర్వాత ఛైర్మన్ ఉపరాష్ట్రపతి జగదీప్‌ధన్‌కర్ సభను శనివారానికి వాయిదా వేసారు. దీనితో పార్లమెంటు ఉభయసభలు శనివారం ఉదయం 11 గంటలకు ప్రారంభం అవుతాయి. అదేరోజు ఆర్థికమంత్రి 2025-26 సంవత్సర బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెడతారు. బడ్జెట్ సమావేశాలు శుక్రవారంనుంచి ప్రారంభం అయిన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 4వరకూ రెండు విడతల్లో బడ్జెట్ సమావేశాలు జరుగుతాయి. మొదటి విడత సమావేశాలు ఫిబ్రవరి 13వ తేదీతోముగుస్తాయి. తర్వాత మార్చి 10వ తేదీ ప్రారంభం అయి ఏప్రిల్ 4 వరకూ కొనసాగుతాయి. ఈ సమావేశాల్లోనే 16 బిల్లులను ప్రవేశపెట్టాలని కేంద్రం భావిస్తోంది. వక్ఫ్‌సవరణ బిల్లు, బ్యాంకింగ్ చట్టాల సవరణ బిల్లు,రైల్వే సవరణబిల్లు, విపత్తునిర్వహణ బిల్లులతోపాటు వలస, విదేశీయుల బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెడుతోంది.

## అమెరికాలో వీసా గడువు తీరినా తిరిగి వెళ్లని

# భారతీయులు 7,000 మంది

### వెల్లడించిన సెంటర్ ఫర్ ఇమ్మిగ్రేషన్ స్టడీస్!




**వాషింగ్టన్, జనవరి 31:** భారత్ నుంచి అమెరికాకు విద్యార్థులుగా, ఎక్స్చేంజి విజిటర్స్‌గా వచ్చి 2023లో వీసా గడువు తీరినా వెనక్కి తిరిగి వెళ్లని భారతీయులు 7,000మంది ఉన్నారని సెంటర్ ఫర్ ఇమ్మిగ్రేషన్ స్టడీస్ వెల్లడించింది. వీరితో పాటు దాదాపు 32 దేశాల విద్యార్థులు, ఎక్చేంజి విజిటర్స్‌లో 20 శాతానికిపైగా గడువు తీరినా అమెరికాను వదిలిపెట్టలేదంలేదని పేర్కొంది. ఎఫ్,ఎం కేటగిరీల్లో ఈ సమస్య అధికంగా ఉందని వివరించింది. ఈ నేపథ్యంలో వలస చట్టాల్లో, హెచ్1బి వీసా విధానాల్లో సంస్కరణలు అవసరమని అమెరికా చట్టసభ కమిటీ సభ్యులకు సూచించింది. హెచ్1బి వీసాలు 75లోపే ఉండాలని సిఫార్సుచేసింది. అమెరికాలో ఇమిగ్రేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పునరుద్ధరణ పై సిఐఎస్ ప్రతినిధి జెస్సికా ఎం వాన్ సభా కమిటీకి వివరాలను వెల్లడించారు. అమెరికాలోని పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో చదువుకోవడానికి, భాషా శిక్షణకు ఎఫ్1 వీసాలిస్తారు. వృత్తి విద్యలో శిక్షణకు, విద్యేతర శిక్షణకు, విద్యేతర కార్యక్రమాల్లో పాల్గొనేందుకు, భాషేతర అంశాల్లో శిక్షణ పొందేందుకు ఎం1 వీసాలను అందచేస్తారు. భారత్, చైనా, బ్రెజిల్, కొలంబియాల నుంచి వచ్చిన వారిలో ఒక్కోదేశం నుంచి 2,000 మందికిపైగా 2023లో వీసా గడువు తీరినా అమెరికాలోనే ఉంటున్నారు. ఇందులో భారత్ నుంచి వచ్చిన వారే అత్యధికంగా 7,000 మంది ఉన్నారు. చదువు అయిపోగానే విద్యార్థి స్వదేశానికి తిరిగివెళ్లేలా అంగీకరించే విధానం ఉండాలి అని జెస్సికా సూచించారు.

# భక్తులరద్దీతో కొన్ని ఘాట్లలో గంగాహారతి నిలిపివేత



**మహాకుంభ్‌నగర్, జనవరి 31:** ప్రయాగరాజ్‌లో అత్యంత వైభవంగా జరుగుతున్న మహాకుంభమేళాకు భక్తులు భారీసంఖ్యలో వెల్లువలా వస్తున్నారు. రద్దీదృష్ట్యా కొన్నిరోజులపాటు ఘాట్‌లవద్ద గంగా హారతిని నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. జనం రద్దీని దృష్టిలో ఉంచుకుని ఫిబ్రవరి 5వరకూ వారణాసిలోని దశాశ్వమేధ్, శీత్లా, అస్సీ తదితర ఘాట్‌లలో నిర్వహించే గంగా హారతిని నిలిపివేస్తున్నట్లు, స్థానిక ప్రజలు అవసరం అయితే తప్ప ఇళ్లనుంచి బయటికి రావద్దని పోలీస్ కమిషనర్ మోహిత్ అగర్వాల్ విజ్ఞప్తిచేసారు. ఘాట్‌లవద్ద ప్రమాదాలు జరగకుండా నిరోధించేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రయాగరాజ్‌కు వచ్చిన భక్తులు వారణాసికి పెద్దసంఖ్యలో వస్తుండటంతో కొందరుప్రయాణీకులు వారణాసి, బనారస్ రైల్వేస్టేషన్లలో చిక్కుకుపోయినట్లు అధికారులు వెల్లడించారు. దీనితో ఆయా ప్రాంతాల్లో ఎలాంటి సంఘటనలు తలెత్తకుండా భద్రతా బలగాలు నిరంతరం గస్తీ తిరుగు తున్నాయని తెలిపారుమౌని అమావాస్యనుంచి కాశీలో భక్తులరద్దీపెరిగిందని, వారి సంఖ్య తగ్గేవరకూ ఇతరులు ఎవరూ వారణాసికి రావద్దని విజ్ఞప్తిచేసారు. మహాకుంభమేళాలో మౌని అమావాస్యసందర్భంగా జరిగిన తొక్కిస లాటలో 30మంది చనిపోయిన నేపథ్యంలో యుపి ప్రభుత్వం రద్దీనియంత్రణకు కీలకనిర్ణయాలు చేపట్టింది. కుంభమేళా ప్రాంతాలకు వాహనాల రాకపోకలు నిషేధించారు. వివిఐపి, స్పెషల్‌పాస్‌లు రద్దుచేసారు. ప్రయాగ రాజ్‌కు పొరుగున ఉన్న జిల్లాలనుంచి వచ్చే వాహనాలను సరిహద్దులవద్దనే నిలిపివేయాలని చెప్పారు. భక్తుల సౌకర్యం కోసం వన్వే ట్రాఫిక్ వ్యవస్థను అమలుకు తెచ్చారు. ఇప్పటివరకూ 29.64 కోట్ల మందిభక్తులు కుంభమేళాలో పవిత్ర స్నానాలు చేసినట్లు యుపి ప్రభుత్వం ప్రకటించింది.

## జయలలిత ఆస్తులు ప్రభుత్వానికి అప్పగింత..

**చెన్నై, జనవరి 31:** దివంగత ముఖ్యమంత్రి జె. జయలలిత ఆస్తిని తమిళనాడు ప్రభుత్వానికి అప్పగించేందుకు బెంగళూరులోని ప్రత్యేక న్యాయస్థానం చర్యలు చేపట్టింది. ఫిబ్రవరి 14, 15వ తేదీల్లో వాటిని అప్పగించాలని ప్రత్యేక న్యాయస్థానంలో హెచ్.ఎ.మోహన్ అధికారులను ఆదేశించారు. జయలలితకు చెందిన 1,562ఎకరాల భూమికి సంబంధించిన పత్రాలు, 27కిలోల బంగారు, వజ్రా భరణాలు, పదివేలకు పైగా చీరలు, 750కి పైగా జతల చెప్పులు, గడియారాలు, ఇతర వస్తు వులను కర్ణాటక ప్రభుత్వం అప్పగించనుంది. ఈ ఆస్తులు, వస్తువులు తమకు చెందాలంటూ జయలలిత వారసులుగా చెబుతున్న జె.దీపక్, జె.దీప వేసుకున్న అర్జీని ఇటీవలే కర్ణాటక హైకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే.

# సీఎం చంద్రబాబును కలిసిన నూతన డిజిపి హరీష్ కుమార్



**విజయవాడ,జనవరి31,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ నూతన డీజీపీగా బాధ్యతలు చేపట్టిన హరీష్ కుమార్ గుప్తా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని ఉండవల్లి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. డీజీపీగా అవకాశం ఇచ్చిన సీఎం చంద్రబాబుకు, ప్రభుత్వానికి ధన్య వాదాలు.తెలిపారు, చంద్రబాబు 2047 లక్ష్యాన్ని ఆయనకు నిర్దేశించారు. అనంతరం డీజీపీ హరీష్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ గడిచిన 6నెలల్లో పోలీస్‌శాఖ ఎన్నో నిర్ణయాలు తీసుకుంది. టెక్నాలజీతో ప్రజలకు మంచి సేవలు అందిస్తాము. రాష్ట్రవ్యాప్తంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి సైబర్ నేరాల నియంత్రణపై స్పెషల్ ఫోకస్ పెడతాము. పోలీసులకు మౌలిక వసతులు, సంక్షేమానికి కృషి చేస్తాము. 200 మంది సైబర్ కమాండర్లను సిద్ధం చేస్తున్నాము. పోలీసులకు మౌలిక వసతుల కల్పనపై దృష్టిపెట్టి సంక్షేమానికి కృషి చేస్తానని హరీష్ కుమార్ గుప్తా హామీ ఇచ్చారు. పోలీసులు ఆరోగ్యంగా ఉంటే మెరుగైన సేవలు అందించగలుగుతారని అన్నారు. సోషల్ మీడియాలో అసభ్యపోస్టులు పెట్టడం ఆర్గనైజ్డ్ క్రైమ్ గా మారిపోయిందని వాటిపై ఉక్కుపాదం మోపుతామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 200 మంది సైబర్ కమాండర్లను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. డ్రగ్స్ నియంత్రణపై స్పెషల్ ఫోకస్ పెట్టనున్నట్లు డీజీపీ తెలిపారు. సీఎం 2047 లక్ష్యాన్ని నిర్దేశించారని అది విజయవంతంగా నెరవేరడంలో పోలీసు శాఖది కూడా ప్రధాన బాధ్యత అని నూతన డీజీపీ వెల్లడించారు. గడచిన 6 నెలల్లో పోలీసు శాఖ ఎన్నో నిర్ణయాలు తీసుకుందని అన్నారు. టెక్నాలజీ సాయంతో ప్రజలకు మంచి సేవలు అందిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సీసీ కెమెరాల ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆర్గనైజ్డ్ క్రైమ్ చేసే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. సైబర్ నేరాల నియంత్రణపై స్పెషల్ ఫోకస్ పెడతామని వ్యాఖ్యానించారు.

## టీచర్ల బదలీల్లో పారదర్శకత కోసం ట్రాన్స్‌ఫర్డ్‌యాక్ట్

>> మకం చేసింది తెలుగుదేశం ప్రభుత్వమేనని చెప్పారు. ఉపాధ్యాయ సంఘాలతో నిత్యం సంప్ర దింపులు జరుపుతూ ప్రజాస్వామ్య స్వేచ్ఛ కల్పిస్తున్నామని మంత్రి వెల్లడించారు. జగన్ పెండింగ్ పెట్టిన ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలపై వైఎస్సార్సీపీ నేతలు ఆందోళనలు చేయటం విడ్డూరంగా ఉందని నారా లోకేశ్ వ్యాఖ్యానించారు.. వాట్సప్ గవర్నెన్స్‌పై మంచి ఫీడ్ బ్యాక్ వస్తోందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. అక్కడక్కడా చిన్నపాటి సమస్యలు ఉన్నా వారం రోజుల్లో పూర్తిస్థాయిలో 161 సేవలు ఎలాంటి ఇబ్బంది లేకుండా అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. సాంకేతికత వినియోగంలో ఇదో విప్లవాత్మక మార్పు అనే చెప్పాలని అన్నారు. మరిన్ని మెరుగైన సేవలు తెచ్చేందుకు చట్ట సవరణలు సైతం చేస్తున్నామని తెలిపారు. 6 నెలల్లో 520 సేవలు అందుబాటులోకి తెచ్చి సుపరిపాలన దిశగా అడుగులు వేస్తామన్నారు. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పారదర్శకత పెరిగి అవినీతి కూడా తగ్గుతుందన్నారు. వాట్సప్ గవర్నెన్స్ వాడితే వ్యక్తిగత సమాచారం బయటకు లీకయ్యే సమస్యే లేదని లోకేశ్ స్పష్టం చేశారు. జగన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.3 వేల కోట్లు పెట్టి దిగిపోయారని, తాము విడతల వారీగా రూ.800 కోట్ల చెల్లింపులు చేశామని చెప్పారు. జగన్ రైతులకు పెట్టిన ధాన్యం బకాయిలు, పెండింగ్ బిల్లులు, ఉద్యోగుల బకాయిలు అన్నీ తామే తీరుస్తున్నామని వెల్లడించారు. విద్యార్థుల సంఖ్య ఖచ్చితత్వాన్ని తెలుసుకునేందుకు ఆపార్ కార్డ్ విధానం తెస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల డ్రాప్ ఔట్స్ నివారణకు ప్రత్యేక వ్యవస్థ తీసుకొస్తున్నట్లు వివరించారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో పోలీసుల అత్యుత్సాహంపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు.

## వాసుదేవరెడ్డి డిప్యుటేషన్ పొడిగింపు

>> లేఖ రాసింది. దీంతో 2024 ఆగస్టు 25 నుంచి వాసుదేవరెడ్డి డిప్యుటేషన్ ను ఆరు నెలల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఈమేరకు సీఎస్ కె.విజయానంద్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం మద్యం కుంభకోణం కేసులో సీఐడీ విచారణను ముమ్మరం చేసింది. వైఎస్సార్సీపీ హయాంలో మద్యం సీసాలపై ముద్రించే సెక్యూరిటీ హాలోగ్రామ్‌ల తయారీ, సరఫరా టెండర్ అప్పగింత కుంభకోణంలో ఏపీ ఎస్‌బీసీఎల్ పూర్వపు ఎండీ వాసుదేవరెడ్డి పాత్రపై సీఐడీ విచారణ కొనసాగుతోంది. మరో వైపు ఆయన బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరుగుతోంది. ఇటీవల జరిగిన విచారణలో వాసుదేవరెడ్డి పాత్రపై మరిన్ని ఆధారాలు లభించాయని, పూర్తి వివరాలతో కౌంటర్ వేసేందుకు సమయం కావాలని సీఐడీ తరఫున పీపీ ఎం.లక్ష్మీనారాయణ హైకోర్టుకు తెలిపారు. అర్హతలేని సంస్థలకు టెండర్‌లో పాల్గొనే అవకాశమిచ్చారని, ఇందుకోసం వాసుదేవరెడ్డికి భారీగా సొమ్ము ముట్టినట్లు పేర్కొన్నారు. వాస్తవాలను రాబట్టేందుకు కస్టోడీలోకి తీసుకుని విచారణ చేయాలని కోర్టుకు విన్నవించారు.



శుక్రవారం పార్లమెంటు భవనం వద్ద రాష్ట్రపతి ముర్ము, ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్, ప్రధాని మోడీ

## డిజిపిగా హరీష్‌కుమార్ గుప్తా బాధ్యతల స్వీకరణ

### శాంతి భద్రతల పరిరక్షణకు శక్తి మేర కృషి చేస్తానని వెల్లడి

### పోలీసు యూనిఫామ్ ఇకపై ఉండదంటేనే భావోద్వేగంగా ఉంది: మాజీ డీజీపీ ద్వారకా తిరుమలరావు

**విజయవాడ జనవరి 31 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ నూతన డీజీపీగా హరీష్‌కుమార్‌గుప్తా బాధ్యతలు తీసుకున్నారు.ఆయన డీజీపీ కార్యాలయంలో బాధ్యతలను పదవి విరమణ చేసిన ద్వారకా తిరుమలరావు నుంచి స్వీకరించారు. అంతకు ముందు ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు కు పదవీ విరమణ వీడ్కోలు పరేడ్‌ను ఘనంగా నిర్వహించారు.ఆయన ఈ రోజు రిటైరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. నా జీవితంలో ఇవి ఉద్విగ్నభరిత క్షణాలంటూ వ్యాఖ్యానించారు.యూనిఫామ్ ఇకపై ఉండదంటేనే భావోద్వేగంగా ఉంది. సర్వీసులో చేరినప్పటి నుంచి అనేక సవాళ్లు చూశా. సంప్రదాయ పోలీసింగ్ నుంచి సాంకేతిక పోలీసింగ్ వైపు మారాం. సైబర్ క్రైమ్ , గంజాయి, చిన్నారులపై నేరాల విషయంలో చర్యలు చేపట్టాం. విపత్తుల సమయంలో ఏపీ పోలీసులు సాహసోపేతంగా పనిచేశారు. ప్రభుత్వ సహకారం వల్లే పోలీసు వ్యవస్థను బలోపేతం చేశాను అని వివ రించారు. ఈ సందర్భంగా నూతన డీజీపీ హరీశ్ కుమార్‌గుప్తా మాట్లాడారు. తిరుమలరావు పోలీసు శాఖలో చెరగని ముద్రవేశారని కొనియాడారు. ప్రజల భద్రత, సేఫ్టీ కోసం అనేక సంస్కరణలు చేపట్టారని గుర్తు చేశారు. మత్తు పదార్థాల నియంత్రణకు ఈగల్ టీమ్ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. నూతన డీజీపీగా నా శక్తిమేర పని చేస్తా. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తా. సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెడతాం. సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెట్టేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. అస్త్రం యాప్ ట్రాఫిక్ నియంత్రణలో ఓ మైలు రాయి అని హరీశ్‌కుమార్ గుప్తా పేర్కొన్నారు.

# గత ప్రభుత్వ వైఫల్యాలు విస్తృతంగా ప్రజల్లోకి

>> ఇతరత్రా క్రియాశీలకం చేయాలని భావన చేసారు. జవాళ్ల స్థానంలో కొత్తవాళ్లకు అవకాశం ఇవ్వావలనే ప్రతిపాదన ఆయన ముందుకు తెచ్చారు.ఈ విషయంలో తాను సైతం పార్టీ పదవికి దూరంగా ఉంటానని ఆయన ఇటీవల బహిరంగంగానే వెల్లడించారు.ఇందులో ఎవ్వరికి మినహా యిపులు ఉండకూడదని ఆచ సూచించారు. తద్వారా పొలిట్ బ్యూరోలో కూడా తన వర్గాన్ని లోకేశ్ రెడీ చేసుకోబుతున్నారనే విమర్శలున్నా,పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు చర్చించిన తరువాత ఈ ప్రతిపాదన తెచ్చారంటున్నారు. లోకేష్ ప్రతిపాదనలపై నేటి పొలిట్ బ్యూరో సమావేశంలో కీలకంగా చర్చించారు.బ్యూరో తీసుకునే బాధ్యులతో పాటు,పార్టీ సంస్ధాగత ఎన్నికల్లో క్రియా శీలకంగా చేసే వారిపై నేటి పోలీట్ బ్యూరో సమావేశంలో కీలకంగానే చర్చించారు.ఈ సమావేశంలో నారా లోకేష్‌తో పాటు పోలిట్‌బ్యూరో సభ్యులు అచ్చెన్నాయుడు, వంగలపూడి అనిత, కేఈ కృష్ణమూర్తి, అశోక్ గజపతిరాజుసోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, అశోక్ బాబు, షరీఫ్, గుమ్మడి సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు. తమ అభిప్రాయాలు వ్యక్తం చేసారు. చంద్రబాబు పార్టీ సంస్ధాగత అంశాలు, సభ్యత్వం ఇతరంశాలు,సంక్షేమ కార్యక్రమాలు గురించి ఈ సమావేశంలో చర్చకు తీసుకుని వచ్చారు.ఆయన పోలిట్ బ్యూరుల సభ్యులు అభిప్రాయాలు తీసుకున్నారు.ఇందుకు సంబంధించిన మార్పులు చేర్పులపై మే నెలలో పార్టీ మహానాడు టీడీపీ నిర్ణయం వెల్లడవుతుంది.ఈసారి మహానాడును ఘనంగా నిర్వహించాలని సమావేశంలో టీడీపీ భావిస్తోంది.ఈలోపు పొలిట్ బ్యూరోలో మార్పులు, చేర్పులు లోకేశ్. చేయాలనుకుంటున్నారు నేటి పొలిట్ బ్యూరోలో ఈ అంశమే ప్రధాన అజెండాగా ఇదే అంశాన్ని ప్రస్తావించారు.. ఎవరిని తప్పించాలి.. ఎవరికి అవకాశం కల్పించాలి.. అనే అంశాలపైనే పొలిట్ బ్యూరో చర్చించింది. సభ్యులల్లో కొంత భిన్నాభిప్రాయాలు వెల్లడయ్యాయి.అయితే లోకేష్ ప్రతిపాదనలపై అందనిరి నుంచి దాదాపు సానుకూలత వచ్చిందంటున్నారు. ఒకవేళ పొలిట్ బ్యూరోలో ఏకాభిప్రాయం కుదిరితే వెంటనే మార్పులు, చేర్పులను కూడా ప్రకటించే అవకాశం తీసుకోవాలని సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది.ఒకవేళ కుదరకపోతే మరో దఫా పొలిట్ బ్యూరో సమావేశమై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని పార్టీ వర్గాలు స్పష్టం చేసారు.ఇక సీఎం చంద్రబాబు పొలిట్ బ్యూరో సభ్యులుగా ఉన్నవారి పట్ల.ఇతన పార్టీ పదవుల్లో వున్నవారి ఇటీవల కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నా విషయం చంద్రబాబు ప్రస్తావించారు. కూటమిలో భాగస్వామ్య పక్షాలతో సమన్వయంగా వ్యవహరించాలని ఆయన ఈ సమావేశంలో స్పష్టంచేసారు. ముఖ్యంగా పార్టీలో కొంతమంది నేతలు, ఎమ్మెల్యేలు గీతలు దాటుతున్నారు. ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారు. ఇలాంటివాటిని ఎప్పటికప్పుడు అడ్రస్ చేయాలని పార్టీ భావిస్తోందని చంద్రబాబు స్పష్టం చేసారు.కొంత మంది మీడియా మీద, మహిళలపైన పార్టీ గైడ్ లైన్స్ దాటుతున్నారు. ఎవరైనా పార్టీ లైన్ దాటితే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా హైకమాండ్ సిద్ధమవుతోందపి సీఎం చంద్రబాబు స్పష్టం చేసారు.. అదే సమయంలో పార్టీకి ఎంతోకాలంగా సేవ చేస్తున్నా పదవులు దక్కని వాళ్లకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని.. తద్వారా వాళ్లను దారికి తెచ్చుకోవాలని భావిస్తోంది. మరోవైపు పార్టీలో అందరికీ పదవులు ఇవ్వడం సాధ్యం కాదు కాబట్టి వరుసగా మూడుసార్లు ఓ పదవిలో ఉన్నవాళ్లను తప్పించి ఆ పదవిని కొత్త వాళ్లకు ఇవ్వాలని లోకేశ్ ఇటీవల సూచించారు. అలా చేస్తే చాలా మందికి అవకాశాలు దొరుకుతాయనేది ఆయన ఆలోచన. త్వరలోనే ఈ దిశగా పార్టీని అంతర్గతంగా ప్రక్షాళించేందుకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ సిద్ధమవుతున్నారు. ఈ అంశంలో తన.మనలేదని తాను,కేంద్రమంత్రి కింజరపు రామ్మోననాయుడు వంటి వారు ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు.కోటి సభ్యత్వాల నమోదు, పార్టీ సంస్థాగత నిర్మాణంపై సమావేశంలో చర్చించారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సంస్థాగత ఎన్నికలు మహానాడు లోపు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. పార్టీ అధ్యక్షుడు మినహా మిగతా ఎవరైన పార్టీ పదవులు మూడేళ్లకు మించి ఉండకూడదన్న అంశంపై పాలిట్ బ్యూరో ప్రతిపాదించే అవకాశం ఉంది. ఫిబ్రవరి నుంచి ఎమ్మెల్యేలతో పాటు పార్టీ నేతలు కూడా ప్రజల వద్దకు వెళ్లేలా కార్యచరణ చేపట్టనున్నారు.ఈసారి తెలుగుదేశం మహానాడు కడపలో నిర్వహించాలని చర్చ జరిగింది. మహానాడు తర్వాత పార్టీ రాష్ట్ర, కేంద్ర స్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. జగన్ ప్రభుత్వ నిర్వాకం వల్ల ఎఫ్‌ఆర్‌బీఎం లిమిట్ సున్నా అయిందని చంద్రబాబు విమర్శించారు. గత ఎనిమిది నెలల్లో రాష్ట్రానికి ఆరున్నర లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చినా, ప్రజల్లోకి ఈ విషయాన్ని తీసుకెళ్లటంలో మంత్రులు, ఎమ్మెల్యేలు విఫలమవుతున్నారని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. 2014-19 మధ్య జరిగిన తప్పిదాలు పునరావృతం కాకూడదని తేల్చిచెప్పారు. తల్లికి వందనం, అన్నదాతసుఖీభవ పథకాలు ఈ ఏడాదే ప్రారంభించాలని సీఎం స్పష్టం చేశారు. అన్నదాత సుఖీభవకి కేంద్రం 6 వేల రూపాయలు ఇచ్చినా మిగిలిన 14 వేలు రాష్ట్ర ప్రభుత్వమే భరించి 3 విడతల్లో 20 వేలు చెల్లిద్దామని చెప్పారు. రాష్ట్ర ఆదాయం పెంచే మార్గాలు అన్వేషిస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు సమావేశం అనంతరం మంత్రి అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడారు. 7 నెలల్లో ఆర్థికంగా చాలా సమస్యలు వచ్చినా ప్రతినెలా 1వ తేదీనే పింఛన్లు ఇస్తున్నామని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా పూర్తి చేస్తున్నామని, వరదల సమయంలో ప్రతిఒక్కరికి సహాయం చేశామని గుర్తు చేశారు. సూపర్6 అమలు చేయడం లేదంటూ మాట్లాడుతున్నారని, జూన్‌లోపు సూపర్6 అమలుకు కార్యాచరణ చేస్తున్నట్లు ప్రకటించారు. పద్మ అవార్డులు పొందిన తెలుగువారికి అభినందనలు పొలిట్ బ్యూరో తెలిపింది. బాలకృష్ణకు పద్మభూషణ్ ప్రకటించటం పట్ల సభ్యులు అభినందనలు తెలిపారు. టీడీపీ సభ్యత్వాలు కోటి దాటడం పట్ల లోకేశ్‌కు అభినందనలు తెలిపారు. విశాఖ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా కాపాడిన సీఎంకు పొలిట్ బ్యూరో అభినందనలు తెలిపింది. సమావేశం అనంతరం మంత్రి అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడారు. 7 నెలల్లో ఆర్థికంగా చాలా సమస్యలు వచ్చినా ప్రతినెలా 1వ తేదీనే పింఛన్లు ఇస్తున్నామని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా పూర్తి చేస్తున్నామని, వరదల సమయంలో ప్రతిఒక్కరికి సహాయం చేశామని గుర్తు చేశారు. సూపర్6 అమలు చేయడం లేదంటూ మాట్లాడుతున్నారని, జూన్‌లోపు సూపర్6 అమలుకు కార్యాచరణ చేస్తున్నట్లు ప్రకటించారు. రెండు మాసాల్లో మత్స్యకారులకు డబ్బులు చెల్లిస్తామన్న మంత్రి, యువతకు నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని చెప్పారు. వైఎస్సార్సీపీ హయాంలో తప్పు చేసిన వారిని శిక్షించేందుకు ప్రత్యేక ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. వైఎస్సార్సీపీ పెట్టిన అక్రమ కేసుల్ని నిర్ణీత కాలపరిమితిలో ఎత్తివేసేలా చూడాలని నిర్ణయించామన్నారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరిగేలా వారికి చెల్లించాల్సిన మొత్తం భూమి రూపంలో ఇచ్చేలా ఆలోచన చేస్తున్నామని వెల్లడించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు తగ్గిన 10 శాతం రిజర్వేషన్ కోటా పునరుద్ధరణ కు చట్టపరమైన అంశాలు పరిశీలిస్తున్నట్లు వివరించారు. ఈసారి మహానాడు కడప జిల్లాలో 3 రోజుల పాటు నిర్వహిస్తామని తెలిపారు. మే 27, 28 తేదీల్లో మహానాడు తీర్మానాలు, 29న భారీ బహిరంగ నిర్వహిస్తామన్నారు. మహానాడులో జాతీయ పార్టీ అధ్యక్షుడిగా చంద్రబాబుని ఎన్నుకుంటామని వెల్లడించారు. ఎమ్మెల్యేలు నియోజకవర్గాల స్థాయిలో ప్రతి శనివారం ప్రజాదర్బార్ నిర్వహించాలని నిర్ణయించామని రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు

## సంజయ్ సస్పెన్షన్‌ను పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ



**విజయవాడ.జనవరి31,ప్రభాతవార్తప్రతినిధి:** సీఐడీ మాజీ డీజీ, ఐపీఎస్ అధికారి సంజయ్‌పై సస్పెన్షన్ పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది ఈ ఏడాది మే 31 వరకు సస్పెన్షన్ పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. సంజయ్ సస్పెన్షన్‌ను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నిర్ధారించింది. సంజయ్ సస్పెన్షన్‌పై నియమించిన కమిటీ ఇటీవల భేటీ అయ్యింది. సంజయ్‌పై సస్పెన్షన్ పొడిగించాలని కమిటీ నిర్ణయించింది. దీంతో సంజయ్ సస్పెన్షన్ పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీఐడీ మాజీ చీఫ్‌గా, అగ్నిమాపకశాఖ డీజీగా ఉన్న సమయంలో పలు అవకతవకలకు పాల్పడ్డారని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇచ్చిన నివేదికను పరిశీలించిన ప్రభుత్వం ఆయన కేసును ఏసీబీకి అప్పగించింది. కేసు నమోదు చేసిన ఏసీబీ ప్రాథమిక సాక్ష్యాధారాలు న్నాయని నివేదిక ఇవ్వడంతో పాటు ఆయనపై క్రిమినల్ కేసును నమోదు చేసింది. దీంతో సంజయ్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఆయన సస్పెన్షన్‌ను కేంద్రహోంమంత్రిత్వ శాఖ కూడా నిర్ధారించింది. ఈ నేపథ్యంలో సంజయ్ సస్పెన్షన్‌పై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ సమావేశమై.. ఆయన సస్పెన్షన్‌ను పొడిగించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా మే 31 వరకు పొడిగిస్తూ కమిటీ సిఫార్సు చేసిన నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. శుక్రవారం సంజయ్ సస్పెన్షన్‌ను పొడిగిస్తూ ప్రభుత్వం ఆదేశాలను విడుదల చేసింది.

## ఎమ్మెల్యేలు రాజీనామా

>> రిషి, ఆదర్శనగర్ పవన్‌శర్మ, బిఎస్ జాన్, బిజ్వాసన్‌లు కూడా తమతమ ఎమ్మెల్యేల పదవులకు రాజీనామాలు చేసారు. రాజీనామాలు చేసిన ఈ ఏడుగురు ఎమ్మెల్యేలకు ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ టికెట్లు ఇవ్వలేదు. దీనితో ఎన్నికల్లో పోటీలోలేని ఈ ఏడుగురు శుక్రవారం రాజీనామాచేసారు. ఏపార్టీలో చేరాతమన్నది మాత్రం వారు స్పష్టంచేయలేదు. 70 మంది ఎమ్మెల్యేలున్న ఢిల్లీ అసెంబ్లీకి ఫిబ్రవరి ఐదోతేదీ పోలింగ్ జరుగుతుంది. ఫిబ్రవరి 8న కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తారు.

## గాడిన పడుతున్న రాష్ట్రం

>> మిగతా ఉపాధ్యాయ సంఘాల మద్ధతు ఉందని ఈ సందర్భంగా అభ్యర్థులు సీఎంకు తెలిపారు. ఉభయ గోదావరి జిల్లాలు, ఉమ్మడి కృష్ణాగుంటూరు జిల్లాల గ్యాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పేరా బత్తుల రాజశేఖర్, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌లను భారీ మెజారిటీతో గెలిపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఎన్డీఏ పక్షాలతో సమన్వయ సమావేశాలు పెట్టుకుని పని చేయాలని సూచించారు.ఎవరూ ఓవర్ కాన్ఫిడెన్స్‌లో ఉండొద్దని హితవు పలికారు. ఎన్నికల్లో అత్యుత్సహం పనికి రాదు క్లస్టర్, యూనిట్, బూత్, ఇన్‌ఛార్జ్‌లతో పాటు, జనసేన, బీజేపీ కమిటీల నేతలతో ముం దుకెళ్లాలని.ఈ విషయంలో మనమంతా ఏకపక్షమనే దిశలో మన అడుగులు పడాలన్నారు. మొదటిసారి గెలిచిన ఎమ్మెల్యేలు, కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన నేతలు మరింత చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. రాత్రికి రాత్రి అన్నీ జరిగిపోతాయని చెప్పడం లేదని, గాడి తప్పిన వ్యవస్థలను సరిదిద్దుతున్నామని సీఎం వెల్లడించారు. రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేసే దిశలో కూటమి ప్రభుత్వం ఉంటుందన్నారు.ప్రజలకు ఎప్పటికప్పుడు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వివరించాలన్నారు.

## నేటి నుంచి పెంపు

>> విలువలపై సగటున 6%శాతం వరకు పెంపు ఉంది. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ద్వారా శాస్త్రీయ విధానంలో అధ్యయనం చేయించింది. రిజిస్ట్రేషన్ విలువల పెంపును దృష్టిలో పెట్టుకొని క్రయ, విక్రయదారులతో శుక్రవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రద్దీ కనిపించింది. విశాఖ, కాకినాడ, విజయవాడ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, ఇతర నగరాల్లో ఈ పరిస్థితి నెలకొంది. రోజూ సగటున 40 రిజిస్ట్రేషన్లు ఉండే కార్యాలయాల్లో 60,80 చొప్పున నమోదయ్యాయి.

## వారం - వర్జ్యం

తేది : 01-02-2025, శనివారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, శుక్లపక్షం,
శుక్ల తదియ ఉ.11.39
పూర్వాభాద్ర రా.2.32
వర్జ్యం ఉ.10.10-11.40
దు.ఉ.6.48-8.21
శుభసమయం : ఉ.8.30-9.15, సా.4.00-5.00
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** చికాకులు, మానసిక అశాంతి. ఆర్థిక పరిస్థితి నిరుత్సాహ పరుస్తుంది. రుణబాధలు తప్పవు.

**వృషభం:** కీలక నిర్ణయాలలో జాప్యం జరిగిన నిదానంగా తీసుకుంటారు. ఇంటా బయట ప్రోత్సాహం లభిస్తుంది.

**మిథునం:** ఆలోచనలు నిలకడగా ఉండవు. రుణవత్తిడులు ఎదురై చికాకులు పెడతాయి. వాహన సౌఖ్యం.

**కర్కాటకం :** నూతన ప్రయత్నాలు ఫలిస్తాయి. పనులలో విజయం సాధిస్తారు. కాంట్రాక్టు లభిస్తాయి.

**సింహం:** దూరప్రాంతాల నుండి వచ్చిన ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. దైవ దర్శనాలు. వాహనాలు కొనుగోలు.

**కన్య :** వాహనయోగం. దూర ప్రయాణాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. సన్నిహితుల కలయిక.

**తుల :** అనారోగ్యం. ప్రతి విషయాలలో చికాకులు ఎదురైన అధిగమించి ముందుకు సాగుతారు.

**వృశ్చికం:** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. ఖర్చులు పెరిగినా సమర్థవంతంగా తీరుస్తారు.

**ధనుస్సు:** భాగస్వామ్య వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. వస్తు కొనుగోలు చేస్తారు.

**మకరం:** ఇంటిలో ప్రశాంతత వాతావరణం నెలకొంటుంది. విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు.

**కుంభం:** కొత్తమిత్రులు పరిచయమవుతాయి. సంఘంలో ఆదరణ పొందుతారు. నూతన వస్తువులు కొనుగోలు.

**మీనం :** దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం ఆనందం కలిగిస్తుంది. వస్త్రా కొనుగోలు వివాదాలకు దూరంగా వుండండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## 6.8% ఆర్థిక వృద్ధి

>> ఆర్థికసర్వేలో సూచించారు. ప్రైవేటు వినియోగం కూడా స్థిరంగా ఉందని ఆదాయ వ్యయాలు సమన్వయం సంతులనంచేసుకుంటూ పోతుంటే 2026లో ఆర్థికవృద్ధి 6.3 నుంచి 6.8 శాతంగా ఉంటుందని ప్రభుత్వం అంచనావేసింది. 2020-201 సంవత్సరంనుంచి కూడా జిడిపి రేటు 6.3 నుంచి 6.8శాతంగానే ఉంటోందని కొవిడ్ సంవత్సరంలో మాత్రం భారత్ ప్రతికూల వృద్ధిరేటు అంటే 5.8శాతంగా నమోదయింది. 2021-22 సంవత్సరంలో జిడిపి రేటు 9.7శాతంగా ఉందని 2022-23లో ఏడుశాతం, గత ఆర్థికసంవత్సరంలో 8.2శాతంగా ఉందని ఆర్థికసర్వేలోప్రస్తావించారు. అలాగే ఆహారద్రవ్యోల్బణం మరింత తగ్గుతుందని సీజనల్‌గా కూరగాయల ధరలు కొంతమేర తగ్గుతాయని, ఖరీఫ్ పంటల దిగుబడులు వచ్చే అవకాశం ఉందని అందువల్ల ద్రవ్యోల్బణం మరింత తగ్గుతుందని అంచనా.

వాణిజ్యరంగంలో అనిశ్చితి, భౌగోళిక ఉద్రిక్తతలవల్లనే కొన్ని సవాళ్లు ఉంటాయన్నారు. ఇప్పటికే భారత్‌ప్రపంచస్థాయిలో పోటీతత్వంతో ముందుకుపోతోందని, దేశీయ ప్రాథమిక సూత్రాలను అమలుచేసుకుంటూ మరింత ముందుకు పోతుందని అన్నారు. క్రమానుగతంగా చేపట్టే సంస్కరణలు, నిబంధనల సడలింపులతో మరింత ముందుకు పోగలమని ఆర్థికసర్వేలో చూపించారు. కృత్రిమ మేధ ఫ్రేమ్‌వర్క్‌లో దుర్వినియోగం అరికట్టే టెక్నాలజీని కూడా అమలు చేయాలని సూచించారు. కార్పొరేట్ బాండ్ల మార్కెట్లలో ఎంట్రీ వ్యయాలు, సమాచార వ్యాప్తి, సెకండరీ మార్కెట్ సమస్యలు వంటి వాటిని పరిష్కరిస్తే ఈరంగంలోకి మరింత నగదులభ్యత పెరుగుతుందని అంచనావేసింది. 2024లో రూపాయి తరుగుదల భౌగోళిక ఉద్రిక్తతలకారణంగా డాలర్ ఒక్కసారిగా పెరగడం, అమెరికా ఎన్నికల పరంగా కొంత అనిశ్చితి కూడా రూపాయి క్షీణతకు దోహదంచేసింది.

2025లో మార్కెట్లు కొంత సర్దుబాటుకు గురవుతాయి. కొత్త రిటైల్ ఇన్వెస్టర్లుభారీ సంఖ్యలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకువస్తారని ఆర్థికసర్వేలో అంచనా వేసారు.

# ప్రజాస్వామ్యానికి బిజెపి తూట్లు

>> పార్లమెంటులో హోంమంత్రి అమిత్ షా అవమానకరంగా మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండించామని, అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ డిసెం బర్ 31న వామపక్ష పార్టీలు నిరసన కార్యక్రమం నిర్వహించాయని అయినా ప్రధాని నరేంద్ర మోడీ దీనిపై నోరు ఎత్తడం లేదని విమర్శించారు. ఛత్తీస్గడ్ ఎన్ కౌంటర్లపై సిపిఐ నిజ నిర్ధారణ కమిటీ నిజానిజాలను నిగ్గుతేలుస్తుందని చెప్పారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న మేధావులను జైలుకు పంపుతున్నారని, వారికి బెయిల్ కూడా రాకుండా చేస్తున్నారని, ప్రశ్నిస్తున్న గొంతులను కేంద్ర ప్రభుత్వం అణిచివేస్తోందని రాజా అన్నారు. 1991 ప్రార్థన స్థలాల చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలపై సుప్రీం కోర్టును ఆశ్రయించినట్లు చెప్పారు.విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు సిపిఐ పూర్తిగా వ్యతిరేకమని, కార్యవర్గ సమావేశాల్లో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానం చేసినట్టు తెలిపారు. సిపిఐ జాతీయ మహాసభలు సెప్టెంబర్ 21 నుంచి 25 వరకు చండీగఢ్ లో నిర్వహించనునట్టు తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరించబోమని కేంద్రం నుంచి స్పష్టమైన ప్రకటన రాలేదని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం సొంత గనులు ఇస్తామని కేంద్రం చెప్పలేదని, విశాఖ స్టీల్ ప్లాంట్ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని కేంద్ర ప్రభుత్వం చూపించలేదని విమర్శించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం లౌకిక రాజ్యం విధానానికి విరుద్ధంగా వ్యవహరిస్తూ మైనారిటీలను ద్వితీయ శ్రేణి పౌరులుగా చూస్తోందని విమర్శించారు. పార్టీ శతవార్షికోత్సవాల ముగింపు కార్యక్రమం డిసెంబర్ 26న ఖమ్మంలోనూ, డిసెంబర్ 24, 25 తేదీల్లో విజయవాడలో అంతర్జాతీయ సదస్సు లు జరపాలని కార్యవర్గ సమావేశం నిర్ణయం మేరకు ఈ కార్యక్రమాల విజయవంతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో శుక్రవారం రాష్ట్రపతి ప్రసంగములు కుంభమేళా ప్రమాదాలపై ప్రస్తావన లేదని విమర్శించారు. సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు అజీజ్ పాషా, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ మూర్తి, సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

# 3వ ఆర్థిక వ్యవస్థగా మారుతున్న భారత్

>> వంటి వివిధ బహుపాక్షిక వేదికలపై ప్రపంచం భారత్‌శక్తిసామర్థ్యాలు, ఉద్దేశ్యాలను గుర్తించిందని ప్రపంచ అస్థిరత సమయంలో భారత్ ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థిరత్వానికి మూల స్తంభంగా మారి ప్రపంచానికి ఒక ఉదాహరణగా నిలిచిందన్నారు. ప్రభుత్వం రెండువేల కోట్ల ఖర్చుతో మిషన్ మౌసమ్‌ను ఏర్పాటుచేసి రైతులకు ప్రయోజనం కలిగించిందని, రైతులకు గిట్టుబాటుధరలు అందించేందుకు నిరంతరం శ్రమిస్తోందని అన్నారు. పిఎం జన్మాన్‌యోజన, ధర్తీఆబా గిరిజన గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ వంటివి గిరిజన సంక్షేమం పట్ల చిత్తశుద్ధిని సూచిస్తున్నాయన్నారు.

సికిల్‌సెల్ రక్తహీనతకు సంబంధించి ఆరోగ్యసమస్యలు కూడా ప్రత్యేక జాతీయ మిషన్‌పరిధిలో ఇప్పటివరకూ ఐదు కోట్లమందిని పరీక్షించారన్నారు. పేదరిక నిర్మూలనకోసం కృషిచేస్తున్న ప్రభుత్వం 25 కోట్లమందిని పేదరికంనుంచి విముక్తి కల్పించిందని, అర్హులందరికీ లబ్ధిచేకూరేలా సంక్షేమపథకాలను వేగంగా అమలుచేస్తున్నామన్నారు.

మధ్యతరగతిప్రజల సొంతింటి కలను నెరవేరుస్తున్నామని, అదనంగా మూడు కోట్ల కుటుంబాలకు ఇళ్లనిర్మాణంకోసం ప్రధానమంత్రి ఆవాస్‌యోజన పొడిగించామనానరు. ఆయుష్మాన్‌భారత్‌పథకం కింద 70 ఏళ్లపైబడిన ఆరుకోట్లమంది వృద్ధులకు ఆరోగ్యబీమా అందిస్తోందని, అమృత్‌భారత్; నమోభారత్‌రైళ్లు నడుస్తున్నాయని, విద్యారంగంపై ప్రత్యేక ఫోకస్‌పెట్టియువతకు కొత్త ఉపాధి అవకాశాలు అందిస్తున్నట్లు తెలిపారు. కొత్త విద్యావిధానంతో ఆధునిక విద్యావ్యవస్థను ఏర్పాటుచేసామని అన్నారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు గొప్ప ముందడుగు అని నేషనల్ రూరల్ లైవ్లీహుడ్‌మిషన్‌కింద 91 లక్షలకుపైగా స్వయం సహాయక బృందాలకు సాధికారత కల్పించి మూడుకోట్లమందిని లక్‌పతీ దీదీగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. భారత్ గ్లోబల్ ఇన్నొవేషన్ పవర్‌హౌస్‌గా మార్చడమే మా లక్ష్యం అని నేషనల్ రీసెర్చి ఫౌండేషన్ ప్రారంభించామని, కృత్రిమ మేధరంగంలో భారత్ ఎఐమిషన్ మొదలుపెట్టామన్నారు. మానవసహిత అంతరిక్షప్రయోగం గగన్‌యాన్‌ను ప్రయోగించేరోజు ఎంతో దూరంలోలేదని, ఎంఎస్‌ఎంఇలకు క్రెడిట్ గ్యారటీ పథకాలు, ఇకామర్స్ ఎగుమతి కేంద్రాలు దేశంలో అన్ని రంగాల్లో వ్యాపారాలను ప్రోత్సహిస్తున్నాయని అన్నారు.

డిజిటల్ టెక్నాలజీలో ప్రపంచ వేదికపై భారత్ కీలకంగా ఉందని యుపిఐ లావాదేవీల వ్యవస్థ విజయాన్ని అభివృద్ధిచెందిన దేశాలుకూడా ప్రశంసించాయని, మెట్రోరైల్ నెట్‌వర్క 1000 కిలోమీటర్లు దాటిందని, ప్రపంచంలోనే మూడో అతిపెద్ద నెట్‌వర్క్‌గా నిలిచిందన్నారు. ఆరోగ్య సంరక్షణకోసం దేశంలో 1.75 లక్షల ఆరోగ్యమందిర్‌లను ఏర్పాటుచేసామని, కేన్సర్ వ్యాధిగ్రస్తులకోసం వారు ఉపయోగించే ఔషధాలపై కస్టమ్స్ సుంకం రద్దుచేసామని, గర్భిణులు, పిల్లల వ్యాక్సినేషన్‌కోసమే యువిన్‌పోర్టల్ పనిచేస్తోందన్నారు. జమ్ముకాశ్మీర్‌లో 370 అధికరణం రద్దుతర్వాత పరిస్థితులు ఎంతో మెరుగయ్యాయని, సంస్కరణలు, పనితీరు, పరివర్తన అనేవి ప్రభుత్వ పాలనకు బలమైన స్తంభాలుగా మారాయన్నారు. సరిహద్దుల రక్షణ, అంతర్గతభద్రతకోసం ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని, వామపక్ష అతివాదానికి వ్యతిరేకంగా పోరాటం చివరిదశకు చేరిందని, నక్సల్స్ ప్రభావితజిల్లాలసంఖ్య 38కి తగ్గిందన్నారు. సామాజిక ఆర్తిక రాజకీయ సుస్థిరలతో ప్రపంచానికే భారత్ స్ఫూర్తిదాయకమని ఇపుడు వికసిత్‌భారత్ నిర్మాణమే మనముందున్న ఏకైకలక్ష్యమని రాష్ట్రపతి ద్రౌపదిముర్ము అన్నారు.

# పంచాయతీ ఎన్నికల కోసం నిద్ర లేచిన కెసిఆర్!



గాంధీభవన్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్

## రేవంత్ కొట్టిన దెబ్బకు ఫామ్‌హౌజ్‌కే పరిమితమైన మాజీ సిఎం: ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** ఫామ్‌హౌజ్‌లో ఇన్నాళ్ళు కుంభకర్ణుడిలా పడుకున్న కెసిఆర్ పంచాయతీ ఎన్నికల కోసం లేచారని ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ ఎద్దేవా చేశారు. గాంధీభవన్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ మహేష్‌బాబు డైలాగ్ లాగ సీఎం రేవంత్‌రెడ్డి దెబ్బకు కేసీఆర్ మైండ్‌బ్లాక్ అయి పామ్‌హౌస్‌కు పరిమితం అయ్యాడని అన్నారు. కాంగ్రెస్ స్కిల్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని నడిపిస్తుంటే బీఆర్ఎస్ దుబాయ్ వేదికగా విద్వేషపు వాట్సప్ యూనివర్సిటీని నడిపిస్తున్నదని అన్నారు. రాష్ట్రంలో ప్రజలు తిరస్క రించి ప్రతిపక్ష పాత్ర పోషించమని ప్రజలు అవకాశం ఇచ్చారు కానీ కేసీఆర్ ఇన్ని రోజులు కుంభకర్ణుని లాగ పామ్ హౌస్ లో పండుకుండు కేసీఆర్ పంచాయితీ ఎన్నికలు వస్తున్నాయి కాబట్టే పామ్ హౌస్ నుండి బయటకు వస్తా అంటుండని ఆయన అన్నారు. కేసీఆర్ ను పదే పదే మాట్లాడించాలని కుటుంబంలో ప్రయత్నం చేస్తున్నారు. రాబోయే రోజుల్లో అన్ని బయట పెడతాం అని ప్రభుత్వ విప్ హెచ్చరించారు. కేసీఆర్ గంభీర స్వరంతో మాట్లాడుతున్న అంటుండు.. చేసిన పొరపాటుకు చింతిస్తూ ఫామ్‌హౌస్‌లో ఉన్నాడని ఆయన అన్నారు. కైలాసంలో పెద్ద పాములగా కమీషన్లు మింగి ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మిగిల్చి పామ్ హౌస్ లో పండుకుండు అని ఆయన అన్నారు. కేసీఆర్ బసవేశ్వర్, సంగమేశ్వర గురించి మాట్లాడుతుండు.. కాళేశ్వరం గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. పదుమూడు నెలల్లో రైతుల కోసం 61 వేల కోట్లు కాంగ్రెస్ ప్రభుత్వం ఖర్చు పెట్టిందని గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని గాడిన పెడుతుండని అన్ని హామిలు వరుసగా అమలు చేసు కొంటూ పోతున్నారని తెలిపారు. పదేళ్ల ప్రజావ్యతిరేక పాలన చేస్తే ఇందిరమ్మ రాష్ట్రంలో ఒకోకటి అమలు చేసుకుంటూ వస్తున్నాం అని ఆయన వివరించారు. రాబోయే రోజుల్లో ఇచ్చిన హామీలను అన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని ధీమా వ్యక్తంచేశారు.

# మార్కెట్లలో మద్దతు ధర అమలుపై ప్రత్యేక బృందాలు: మంత్రి తుమ్మల



**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో రైతుల తీసుకువస్తున్న పంటల ఉత్పత్తులను మద్దతు ధరలకు కొనుగోలు చేయడంపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనున్నట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. ఈ మేరకు మార్కెటింగ్ డైరెక్టర్, ప్రాంతీయ, జిల్లా అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. మార్కెటింగ్ డైరెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డులకు పంపించాలని చెప్పారు. రైతులు మార్కెట్లకు తీసుకువచ్చిన తమ పంటకు గరిష్ఠ ధర పొందేందుకు అన్ని అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా క్రయవిక్రయాలు జరిగేటట్లు ప్రతి అధికారి బాధ్యత తీసుకోవాలన్నారు. నాణ్యత ప్రమాణాలకు తగట్టు ఉన్న పంట ఉత్పత్తులకు మద్దతు ధర అందించాల్సిందే అని ఈ విషయములో ప్రత్యేక బృందాలు చొరువ తీసుకోవాలని పేర్కొన్నారు. రైతులకు నష్టం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవడానికి సంబంధిత జిల్లా అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు.

# తెలంగాణలో పెరిగిన తలసరి వ్యయం

## పట్టణాల్లో రూ.820, గ్రామాల్లో రూ.633

### కేంద్ర కుటుంబ వినియోగ వ్యయ సర్వే వెల్లడి

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త :** తెలంగాణలో ఏడాది కాలంలో తలసరి నెలవారీ వినియోగ వ్యయం పెరిగిందని కేంద్రం వెల్లడించింది. పట్టణాల్లో తలసరి సగటు వినియోగ వ్యయంలో తెలంగాణ అగ్రస్థానంలో ఉండగా, గ్రామీణంలో కేరళ తలసరి ఆదాయంలో (రూ.6,611) అగ్రస్థానంలో ఉన్నట్లు వెల్లడించింది. తెలంగాణలో తలసరి నెలవారీ వినియోగ వ్యయం పట్టణాల్లో రూ.820, గ్రామాల్లో రూ.633లకు పెరిగిందని పేర్కొంది. ఈ మేరకు కేంద్ర కుటుంబ వినియోగ వ్యయం సర్వే 2023-24ను శుక్రవారం విడుదల చేసింది. దీంతో తలసరి నెలవారీ ఖర్చు గ్రామాల్లో రూ.5,435కి, పట్టణాల్లో రూ.8,978కి చేరినట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా చూస్తే గ్రామీణ ప్రాంతాల్లో వ్యయం చూసుకుంటే రూ.4,122 ఉండగా, పట్టణాల్లో రూ.6,199గా ఉంది. ఆదాయ వర్గాల వారీగా చూస్తే తెలంగాణలో గరిష్ఠంగా నెలకు రూ.12,619 ఖర్చు అవుతుంది. ఇక తెలంగణాలో విద్యపై గ్రామీణ ప్రాంతాల్లో నెలకు తలసరి రూ.183, పట్టణాల్లో రూ.713.89 ఖర్చు చేస్తున్నారు. పట్టణాల్లో చదువుల కోసం తెలంగాణలోనే అత్యధిక వ్యయం అవుతోందని నివేదిక తెలిపింది. అలాగే పట్టణాల్లో అద్దెకు 10 శాతం ఖర్చు చేస్తున్నారు. గ్రామాల్లో వైద్యం కోసం నెలకు రూ.376 ఖర్చు చేయగా, పట్టణాల్లో నెలకు రూ.426 చొప్పున వ్యయం అవుతుందని సర్వే పేర్కొంది. సామాజిక వర్గాల వారీగా చూస్తే మాత్రం ఈ వ్యయంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల వ్యయం తక్కువగా ఉంది. మద్యం, పాన్, పొగాకు తదితర ఉత్పత్తుల కోసం పట్టణాల్లో నెలకు రూ.320 ఖర్చు చేయగా, గ్రామాల్లో నెలకు రూ.396 ఖర్చు చేస్తున్నారు. ఆహార ఖర్చులో పానీయాలు, ప్రాసెస్డ్‌ఫుడ్ కోసం గ్రామాల్లో 20.84 శాతం, పట్టణాల్లో 33.63 శాతం ఖర్చు చేస్తున్నట్లు కేంద్ర సర్వే వెల్లడించింది.

# విద్య, ఆరోగ్యంపై ప్రభుత్వం దృష్టి

## మహిళల అభివృద్ధే కేంద్రంగా నిధుల కేటాయింపు : డిప్యూటీసిఎం భట్టి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జనవరి 31:** ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో విద్య, ఆరోగ్య రంగాలపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించిందని, ఈ రంగాల అభివృద్ధి కోసం ఎన్ని నిధులైన కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం ఆయన బేగంపేటలోని ఓ ప్రైవేట్ మహిళా కళాశాల వార్షిక దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యపై పెట్టు బడి మూలంగా గొప్ప మానవవనరులు రాష్ట్రంలో అభివృద్ధి చెందుతాయి, ఫలితంగా ప్రపంచాన్ని ఏలే శక్తి తెలంగాణకు దక్కుతుందని ఆయన అన్నారు. విద్యా రంగ అభివృద్ధి కోసం ప్రపంచ స్థాయిలో పోటీపడే విధంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో ఒక్కో పాఠశాలను 200 కోట్ల పెట్టుబడితో నిర్మిస్తున్నామని ఇప్పటికే 60 స్కూళ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశామని తెలిపారు. మహిళలకు విద్యను అందిస్తే ఆ ఫలితం కేవలం ఆమెకే కాకుండా కుటుంబానికి.. సమాజానికి మేలు జరుగుతుందని వివరించారు. కుటుంబ వ్యవస్థ దేశానికి బలం.. ఆ కుటుంబ వ్యవస్థను నడిపించే శక్తి అమ్మ, భార్య, సోదరి రూపంలో ఉన్న మహిళ అని అభివర్ణించారు. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకొని మహిళల అభివృద్ధికి అన్ని విధాల రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని తెలిపారు. మహిళలకు ప్రత్యేకంగా బడ్జెట్లో నిధులు కేటాయిస్తున్నామని వివరించారు, వారికి చదువు, ఉద్యోగ అవకాశాలు మెండుగా లభించేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. మహాలక్ష్మీ పేరిట ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని.. విద్యార్థినీలు కళాశాలలకు వెళ్లేందుకు, మహిళలు ఉచితంగా పని ప్రదేశాలకు వెళ్లేందుకు ఈ పథకం ఉపయోగపడుతుందని.. వీటితో రాష్ట్ర ప్రభుత్వం ఆగిపోదని తెలిపారు. మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలన్న ఆలోచనలో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలతో 1,000 మెగావాట్ల సోలార్ విద్యుత్తు ఉత్పత్తికి కార్యాచరణ ప్రారంభించామని తెలిపారు. సహజంగా వీటిని కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తారు అందుకు భిన్నంగా మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే ఆలోచనతో ఇందిరమ్మ ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు సోలార్ విద్యుత్ ప్లాంట్లు కేటాయిస్తుందని తెలిపారు. సోలార్ విద్యుత్ లో పెట్టుబడుల కోసం బ్యాంక్ లింకేజీ ఇప్పించడం, మహిళా సంఘాలు ఉత్పత్తి చేసిన విద్యుత్తును ప్రభుత్వమే కొనుగోలు చేయడం మహిళలకు ఎలాంటి ఒత్తిడి లేకుండా ఈ తరహా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ పథకం దేశంలోనే గొప్ప పథకంగా అభివర్ణించారు. రాబోయే ఐదేళ్లలో రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దబోతున్నామని వివరించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రతి సంవత్సరం 20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందజేస్తున్నామని, వారి తరఫున వడ్డీని ఆర్థిక శాఖ చెల్లిస్తుందని వివరించారు. ప్రపంచంలోనే పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌కు ప్రధానిగా బాధ్యతలు నిర్వహించిన ఇందిరాగాంధీ మహిళలు ఏ పనినైనా చేయగలరని నిరూపించారని తెలిపారు. 1959లో 15 మంది విద్యార్థినులతో ప్రారంభమైన సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాల ప్రస్తుతం 3000 మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం అభినంద నీయమని, ఈ కళాశాలలో చదివిన విద్యార్థినులు గొప్ప ప్రతిభను కనబరుస్తున్నారని అభినందించారు.



చోరీ సొత్తును చూపిస్తున్న పరిగి డిఎస్పీ

# దొరికిన కిలాడీ లేడీ

## పరిగి బస్టాండ్ వరుస చైన్ స్నాచింగ్‌లు

### రద్దీ ప్రాంతాలే లక్ష్యంగా చోరీలు : పరిగి డిఎస్పీ

**పరిగి, జనవరి 31, ప్రభాతవార్త:** రద్దీ ప్రాంతాల్లో, బస్టాండుల్లో వరుసగా చైన్ స్నాచింగ్, దొంగతనాలు చేసే కిలాడీ లేడీని పరిగి పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా, పరిగిలో డిఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పత్రికా సమావేశాన్ని నిర్వహించి, వివరాలు వెల్లడించారు. భువనగిరికి చెందిన అమూల్య అనే మహిళ, హైద్రాబాద్ కు చెందిన మహ్మద్ ఇక్బాల్ ఇద్దరు కలిసి రద్దీ ప్రాంతాల్లో దొంగతనాలు చేస్తున్నట్లు తమ దర్యాప్తులో తేలిందని పోలీసులు తెలిపారు. కిలాడి లేడీ అమూల్యను పోలీసులు అరెస్టు చేయగా, మరో నిందితుడు మహ్మద్ ఇక్బాల్ పరారీలో ఉన్నాడు .. కిలేడీ అమూల్య వద్ద నుండి దాదాపు 11 తులాల బంగారం, 80 వేల నగదు, ఒక సెల్ ఫోన్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల మొదటి వారంలో పరిగి బస్టాండ్‌లో జరిగిన వరుస చైన్ స్నాచ్చింగ్ ఘటనలు వీరిద్దరూ కలిసి చేశారని, గతంలోను ఇద్దరు కలిసి జిల్లాలో పలుచోట్ల చోరీలు చేసినట్లు పోలీసుల విచారణలో మహిళదొంగ తెలిపిందని, మహ్మద్ ఇక్బాల్ ప్రధాన సూత్రధారిగా ఉంటూ చోరీలు ఎలా చెయ్యాలో, ఎక్కడ చెయ్యాలో శిక్షణ ఇచ్చేవాడని మహిళ పోలీసులకు తెలిపిందని, మరో నిందితుడిని పట్టుకునేందుకు పోలీసు బృందం ప్రయత్నిస్తుందని డిఎస్పీ శ్రీనివాస్ తెలిపారు.

# వర్షాధార వ్యవసాయంపై ముగిసిన సదస్సు

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త :** వర్షాధార వ్యవసాయంపై అంతర్జాతీయ సమావేశం ముగిసింది. హైదరాబాద్‌లో శుక్రవారం నాడు స్థితిస్థాపకత, స్థిరమైన జీవనోపాధి కోసం మార్గాలను నిర్మించడం అనే అంశంతో ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐఎస్‌డిఎ అధ్యక్షుడు డాక్టర్ వికె సింగ్ మాట్లాడుతూ ఈసమావేశం వివిధ వర్గాల ప్రెజెంటేషన్ల కింద నిర్వహించబడిందని తెలియచేశారు. వర్షాధార వ్యవసాయం, స్థితిస్థాపకత, స్థిరమైన జీవనోపాధి కోసం మార్గాలు అనే అంశంపై చర్చ జరిగిందన్నారు. అంతేకాకుండా, వర్షాధార పంటల వ్యవస్థల కోసం పరిరక్షణ వ్యవసాయంపై సుదీర్ఘ చర్చ జరిపినట్లు వెల్లడించారు. మూడు రోజుల పాటు, వివిధ సంకేతికత ప్రధాన అంశంగా ప్రస్తావనకు వచ్చినట్లు వివరించారు. ముఖ్యంగా నీటిసేకరణ, సేకరించిన నీటిని సమర్థవంతంగా ఉపయోగించడం, నేల నీటి సంరక్షణ కోసం సాంకేతికతలు. నేల ఆరోగ్య నిర్వహణ. వాతావరణాన్ని తట్టుకునే పంటలు, పద్ధతులు తదిత వాటిపై సిఫార్సులను సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీహార్ వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ వైఛాన్సలర్ డాక్టర్ ఎ.కె.సింగ్ తదితరులతో పాటు, వివిధ దేశాలకు చెందిన దాదాపు 750 మంది ప్రతినిధులు, రైతులు, ఎన్జీవో, అధికారులుత పాల్గొన్నారు.

# నీళ్లపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నీచ రాజకీయం



శుక్రవారం తెలంగాణ జాగృతి సంస్థ సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

## జల రాజకీయం మానేసి ప్రభుత్వం వాస్తవాలు చెప్పాలి

### 'నీళ్లు-నిజాలు' రౌండ్‌టేబుల్ సమావేశంలో బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్

**హైదరాబాద జనవరి 31, ప్రభాతవార్త :** నీళ్ల విషయంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నీచ రాజకీయం చేస్తున్నదని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విరుచుకుపడ్డారు. నీటి విషయాల్లో రాజకీయం చేయడం మానేసి నిజాలు చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేసీఆర్‌పై అక్కసుతో కాళేశ్వరం ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేయడమే కాకుండా రైతులకు నీళ్లు ఇవ్వకుండా పొలాలను ఎండ బెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బురద రాజకీయానికి గోదావరి వరదను కూడా తట్టుకొని మేడిగడ్డ బ్యారేజీ మేరునగధీరుడిలా నిలబడిందని అన్నారు. తెలంగాణ జలవనరులు, ప్రాజెక్టులు 'నీళ్లు-నిజాలు'పై తెలంగాణ జాగృతి సంస్థ శుక్రవాం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా పలు తీర్మానాలు ఆమోదించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాసేందుకు నిర్ణయం తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ కేసీఆర్ పూర్తి చేసిన ప్రధాన ప్రాజెక్టుల్లో మిగిలి ఉన్న చిన్నచిన్న పనులను కాంగ్రెస్ ప్రభు త్వం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరించాలని ఆమె డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు లింక్-1 పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేవాలన్నారు. ఇరిగేషన్ అడ్వైజర్ పోస్ట్ నుంచి ఆదిత్యనాథ్‌దాస్‌ను తొల గించాలని ప్రభుత్వాన్ని కోరారు.

గోదావరి కృష్ణా పెన్నా లింక్ చేస్తూ ఏపి అక్రమంగా నిర్మిస్తోన్న పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుపై అపెక్స్ కౌన్సిల్ సమావేశంఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖ రాస్తామని అన్నారు.

కృష్ణా ట్రిబ్యునల్‌లో తెలంగాణకు బేసిన్, క్యాచ్‌మెంట్, కమాండ్ ఏరియా, డ్రాట్‌ప్రోన్ ఏరియా ప్రాతిపదికన 575 టీఎంసీల నికర జలాలు సాధించేలా సమర్థ వాదనలు వినిపించాలని సూచించారు. కృష్ణాజలాల్లో గోదావరి మళ్లింపు కింద మొత్తం 125 టీఎంసీల సాధనకు బ్రజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ఎదుట బలమైన వాదనలు వినిపించాలని ఆమె అన్నారు. గోదావరి మూసీ ప్రాజెక్టును మల్లన్న సాగర్ నుంచి కాకుండా తక్కువ ఖర్చుతో పూర్తయ్యే కొండపోచమ్మ సాగర్ నుంచి చేపట్టాలి. ఇరిగేషన్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేయడానికి ఏటా రూ.20 వేల కోట్లకు తగ్గకుండా బడ్జెట్ కేటాయించి ఖర్చు చేయాలని ఆమె కోరారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టును పూర్తిగా తెలంగాణ ప్రభుత్వ అధీనంలోకి తేవాలని అన్నారు. కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు అనుమతులు సాధించాలని కోరారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ మాజీ చైర్మన్ వి. ప్రకాశ్, సాగునీటి శాఖ మాజీ ఓఎస్డీ, విశ్రాంత ఇంజనీర్ శ్రీధర్ రావు దేశ్ పాండే, బిఆర్ఎస్ నేత పల్లె రవి కుమార్ గౌడ్, రిటైర్డ్ సీఈ ఖగేందర్,సీనియర్ జర్నలిస్టు కామెర నవీన్, తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్స్ ఫోరం మాజీ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తగ్గిన పత్తి ధరలు

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త :** రాష్ట్రంలో పత్తి ధరలు తగ్గడంతో రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది. రైతులకు మద్దతు ధర కల్పించి వారికి అండగా నిలవాల్సిన కాటన్ కార్పొరేషన్ రైతాంగాన్ని నష్టాలకు గురిచేస్తుదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఏడాది పత్తి క్వింటాలుకు రూ.4521 మద్దతు ధరను కేంద్రం ప్రకటించింది. అక్టోబర్ చివరి వారంలో పంట కొనుగోలు ప్రారంభం కాగా డిసెంబర్ నెలాఖరు వరకు మద్దతు ధరతో పంట కొనుగోలు చేశారు. అయితే పంట నాణ్యత సరిగా రావడం లేదంటూ సీసీఐ అధికారులు రూ.100 తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. తాము నాణ్యమైన పంటను విక్రయానికి తీసుకువస్తున్నామని రైతులు చెబుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో రైతులు భారీగా నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది. మార్కెటింగ్ శాఖ అధికారులు సైతం పట్టించు కోకపోవడంతో రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో పంటను సీసీఐకి విక్రయిస్తున్నారు. దీంతో పత్తికి మద్దతు ధరలు రాక రైతాంగం ఆందోళన చెందుతోంది.

# రాజ్యాంగంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ పెట్టాలి

## సిఎంను కోరిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** భారత రాజ్యాంగం ఏర్పడి 75 సంవత్స రాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శాసనసభలో ప్రత్యేక చర్చ జరపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. పంచాయతీ ఎన్నికలలో బీసీ రిజర్వేషన్‌ల పెంపునకు సంబంధించి ఫిబ్రవరి 7న శాసనసభ ప్రత్యేక సమావేశం నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు పత్రికల్లో చదివినట్లు కూనంనేని లేఖలో పేర్కొన్నారు. ఆ సమావేశాల్లో భాగంగా.. రాజ్యాం గం ఏర్పడి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో.. రాజ్యాంగం, దాని అమలు, విజయాలు, భవిష్యత్ కార్యాచరణ అనే అంశంపై ప్రత్యేక చర్చ పెట్టాలని ముఖ్యమంత్రిని కోరారు. కొద్దిరోజుల క్రితం ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో 75 సంవత్సరాల రాజ్యాంగంపై ఉభయ సభలు చర్చించిన విషయాన్ని గుర్తు చేశారు. కాబట్టి ఫిబ్రవరి 7న రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన శాసనసభ ప్రత్యేక సమావేశాల్లో .. ప్రత్యేకంగా ఒక రోజు కేటాయించి 75 ఏండ్ల భారత రాజ్యాంగంపై చర్చ జరపటం సముచితంగా వుంటుందని.. శాసనసభా నాయకులుగా ముఖ్యమంత్రి చొరవ చూపాలని కూనంనేని సాంబశివరావు లేఖలో కోరారు.

# ఆన్‌లైన్ రమ్మీ ఆడి అప్పులపాలై యువకుడి ఆత్మహత్య



భూష కార్తీక్ (ఫైల్)

**శంకరపట్నం, ప్రభాతవార్త:** శంకరపట్నం మండలం గద్దపాకకు చెందిన భూష కార్తీక్(25) ఆన్‌లైన్ రమ్మీ ఆడి ప్రాణాలు తీసుకున్నాడని ఎస్సై రవి తెలి పారు. ఆయన కథనం మేరకు.. శంకరపట్నం మండలం గద్దపాక గ్రామానికి చెందిన భూష కార్తీక్ ఆన్‌లైన్ రమ్మీ ఆడి డబ్బులు పోగొట్టుకున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన కార్తీక్ ఈనెల 28న పురుగులమందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్నేహితులు కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో, జమ్మికుంట ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని తండ్రి శంకర్ శుక్రవారం కేశవపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆన్‌లైన్ రమ్మీతో డబ్బులు పోగొట్టుకొని కార్తీక్ ఆత్మహత్య చేసుకున్నట్లు, మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

# కెసిఆర్‌వి ఉత్తరకుమార ప్రగల్భాలే

## పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫాంహౌస్‌లో కూర్చొని ఉత్తర కుమార ప్రగల్భాలు పలుకుతున్నారని పిసిసి అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ ఎద్దేవా చేశారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో ఆ పార్టీకి అభ్యర్థులు కూడా దొరికే పరిస్థితి లేకపోవడంతో కేసీఆర్ అభ్యర్థుల కోసం ఇటువంటి ఉత్తర కుమార ప్రగల్భాలు పలుకుతున్నారని దుయ్యబట్టారు. ప్రజలు ఫాంహౌస్ పాలన గడీల పాలన కోరుకోవడం లేదని మహేష్ అన్నారు. ప్రజా పాలన ఇందిరమ్మ రాజ్యాన్ని కోరుకుంటున్నారని ఆయన వివరించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో సాధించలేని ప్రగతిని కాంగ్రెస్ ఏడాది పాలనలో సాధించడంతో ఆయన దిక్కుతోచక మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఆయన వాస్తవ పరిస్థితులకు భిన్నంగా మాట్లాడుతున్నారని ఎకసెక్కాలు చేశారు. ఇప్పటికే ఢిల్లీ లిక్కర్ స్కాంలో కూరుకుపోయిన కేసీఆర్ కుమార్తె కవితపై ఇప్పుడు మరో లిక్కర్ స్కాం ఆరోపణలు రావడంతో ఆయన ఆ అంశాన్ని పక్కదారి పట్టించేలా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు.

2023 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు గద్దెదింపినా, 2024 పార్ల మెంట్ ఎన్నికల్లో ఒక్క సీటూ దక్కకపోయినా గుణపాఠం నేర్వని కేసీఆర్ ఫాం హౌస్‌లో పగటి కలలు కంటున్నారని దుయ్యబట్టారు. అసెంబ్లీకి రాకుండా ప్రతిపక్ష నేతగా విఫలమైన కేసీఆర్, కాంగ్రెస్ విఫలమైందని వ్యాఖ్యానించడం హాస్యా స్పదం. కాంగ్రెస్ ఏడాది పాలనలో 50 వేలకుపైగా ఉద్యోగాలు భర్తీ చేయడం ఆయనకు కనిపించడం లేదా? కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పులతో రాష్ట్ర ఖజానా ఖాళీ అయిన ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీ, రైతు భరోసా, వరికి బోనస్, ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌ది అని స్వోత్కర్షలు చెప్పుకున్నారు.

బీఆర్ఎస్ పదేళ్ల పాలనతో రేషన్ కార్డుల కోసం నిరుపేదలు ఎదురుచూస్తే పట్టించుకోని కేసీఆర్, కాంగ్రెస్ ప్రభుత్వం 40 లక్షల వరకు రేషన్ కార్డులు ఇస్తుంటే తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధితో బీఆర్ఎస్ ఉనికికే ప్రమాదం ఏర్పడడంతో, రాబోయే స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీకి అభ్యర్థులే కరువైన నేపథ్యంలో ఆయన కాంగ్రెస్‌పై అవాకులు చెవాకులు పలుకుతున్నారు. ప్రజలు ఛీకొట్టినా కేసీఆర్ వ్యవహార శైలి, మాటతీరులో మార్పు రాకుంటే రాబోయే స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీకి మరోసారి భంగపాటు తప్పదు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై, ఏడాది కాంగ్రెస్ పాలనపై చర్చకు ఎన్నిసార్లు సవాలు విసిరినా స్పందించని కేసీఆర్ పామ్‌హౌస్‌లో కూర్చొని ఉత్తర కుమార ప్రగల్బాలు పలుకుతున్నారని అన్నారు.

# ఎంపికైన జూనియర్ లెక్చరర్లకు నియామకపత్రాలు ఇచ్చేలా చూడాలి

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీకి అభ్యర్థుల విజ్ఞప్తి

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్‌సీ) ద్వారా ఎంపికైన 1392 జూనియర్ లెక్చరర్స్ (జేఎల్)కి వెంటనే నియామక పత్రాలు అందించేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీకి ఎంపికైన అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన జాన్ వెస్లీని శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపిన సెలెక్టెడ్ అభ్యర్థులు తమ సమస్యను పరిష్కరించేలా చూడాలని వినతిపత్రం సమర్పించారు. జాన్‌వెస్లీని కలిసిన వారిలో వివిధ యూనివర్సిటీల నుండి జూనియర్ లెక్చరర్ పోస్టుకు ఎంపికైన అభ్యర్థులు డాక్టర్ జి లింగానాయక్, ఏ వేణు రావు, జి ముత్యాలు, బొజ్య నాయక్, వీణా చారి, సుమన్, రాజశేఖర్, అభిషేక్, వినయ్ ఉన్నారు. ఈ సందర్భంగా వారు .. టీజీపీఎస్సీ ద్వారా 15 సంవత్సరాల తర్వాత రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఖాళీగా ఉన్న 1392 జూనియర్ లెక్చరర్స్ పోస్టులకు 2022లో నోటిఫికేషన్ ఇచ్చి, 2023లో రాత పరీక్ష నిర్వహించారని తెలిపారు. అనంతరం 2024 జూలైలో మెరిట్ జాబితా ప్రకటించి.. తుది ఫలితాలు విడుదల చేశారన్నారు. కానీ ఇప్పటి వరకు తమకు నియమకపత్రాలు అందచేయలేదన్నారు. డీఎస్సీ-2024 నిర్వహించిన 55 రోజుల్లో ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి నియామకపత్రాలు అందజేసిందని తెలిపారు. రాష్ట్రం లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల అభివృద్ధికి.. ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంలో ముందుంటామని తెలియజేస్తూ తమకు నియామకపత్రాలు అందచేసేలా చూడాలని జాన్‌వెస్లీని కోరారు.



ప్రజావాణిలో దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న డా.చిన్నారెడ్డి.

# ప్రజావాణికి అందిన దరఖాస్తులు 9,307

## వీటిలో 7,100 ఇందిరమ్మ ఇళ్ల కోసమే..

**హైదరాబాద్ (బేగంపేట) జనవరి 31, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 9307దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ది శాఖకు సంబంధించి 211 దరఖాస్తులు, విద్యుత్‌శాఖకు సంబంధించి 160 దరఖాస్తులు, రెవెన్యూ సమస్యలకు సంబంధించి 43 దరఖాస్తులు, ప్రవాసీ ప్రజావాణీకి సంబంధించి 1దరఖాస్తు వచ్చాయి. పౌర సరఫరాల శాఖకు సంబంధించి 1,736 దరఖాస్తులు (రేషన్‌కార్డుల కోసం)దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 56దరఖాస్తులు అందాయి.రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ జి.చిన్నారెడ్డి కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్‌కు వచ్చినవారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో చిన్నారెడ్డి ఫోన్‌లో మాట్లాడారు. పలు సమస్యలను తక్షణమే పరిష్కారమయ్యేలా చిన్నారెడ్డి చర్యలు తీసుకున్నారు.

# కులాంతర వివాహితుల భద్రతకు ప్రత్యేక చట్టం తేవాలి

## తుంగతుర్తి కుల దురహంకార హత్యను తీవ్రంగా ఖండిస్తున్నాం: సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** కులాంతర వివాహం చేసుకున్నవారి భద్రత కోసం ప్రత్యేక చట్టం తేవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. తుంగతుర్తి మండలం అన్నారం గ్రామంలో జరిగిన కుల దురహంకార హత్యను తీవ్రంగా ఖండిస్తున్నట్టు వెస్లీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఐదు నెలల క్రితం దళితుడైన వడ్లకొండ కృష్ణ, బీసీ కులానికి చెందిన భార్గవి కులాంతర వివాహం చేసుకున్నారని.. దాంతో తమ కుటుంబ పరువు పోయిందనే నెపంతో భార్గవి కుటుంబ సభ్యులు కృష్ణను హత్య చేశారని గుర్తు చేశారు. కృష్ణను హత్య చేసిన నిందితులపై గతంలో అనేక కేసులు న్నాయని.. వారిని అరెస్టుతోనే సరిపెట్టకుండా, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి.. కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. భార్గవికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు, భద్రత కల్పించాలని.. అదేవిధంగా కృష్ణ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చట్టాలెన్నొచ్చినా కులాంతర వివాహం చేసుకున్నవారిపై హత్యలు, దాడులు, బహిష్కరణలు జరుగుతున్నాయని.. వాటిని నియంత్రించడంలో ప్రభుత్వాలు, రక్షణ వ్యవస్థలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కులాంత వివాహాలు చేసుకున్న వారి కోసం ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే 45 కుల దురహంకార హత్యలు జరిగాయని గుర్తు చేశారు. ఇటువంటి ఘటనలు జరిగిన వెంటనే నిర్ణీత కాల వ్యవధిలో విచారణ జరిపి.. బాధితులకి భరోసా ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు.

# రంజీలోనూ స్టార్స్ ఫెయిల్


రోహిత్ శర్మ


రిషబ్ పంత్


శ్రేయస్ అయ్యర్


కెఎల్ రాహుల్


యయశ్వి జైస్వాల్

## రాణించ లేని ప్లేయర్లు
### దేశవాళీ పట్ల నో సీరియస్

**న్యూఢిల్లీ;** బిసిసిఐ అల్టిమేటం జారీ చేయడం వల్ల టీమ్ఇండియా స్టార్ ప్లేయర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రిషభ్ పంత్, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, యశస్వీ జైస్వాల్, రవీంద్ర జడేజా, శుభమన్ గిల్ ఇటీవల రంజీ ట్రోఫీ బరిలో నిలిచారు. ఇటీవల కాలంలో సీనియర్లు రోహిత్, విరాట్ సహా కుర్రాళ్లు సైతం ఫామ్‌కోల్పోవడం వల్ల ఆటగాళ్లంతా దేశవాళీ టోర్నీల్లో కచ్చితంగా ఆడాలని నిబంధన పెట్టింది. ఈ క్రమంలో రోహిత్ సహా పలువురు ఇప్పటికే రంజీలో ఓ మ్యాచ్ ఆడేశారు. కోహ్లీ, రాహుల్ గురువారం ఢిల్లీ తరఫున బరిలోకి దిగారు. అయితే ఇక్కడే అందరికీ ఓ ప్రశ్న తలెత్తుతోంది. రంజీలో ఆడాలని బిసిసిఐ నిబంధన మేరకు స్టార్ ప్లేయర్లంతా బరిలోకి దిగినా, ఈ టోర్నీకి వీళ్లిచ్చిన ప్రాధాన్యం ఎంత అనే ప్రశ్న తలెత్తుతోంది. వాళ్లు దీన్ని ఏమాత్రం సీరియస్‌గా తీసుకోలేదనేది ఫలితాలను బట్టి అర్థమవుతోంది. ఈ సీజన్‌లో వీళ్లంతా ఒక మ్యాచ్‌కే పరిమితం అవ్వడం, అందులోనూ పెద్దగా రాణించకపోవడం వల్ల దేశవాళీలో బరిలోకి దిగి ఏం లాభం అనే అభిప్రాయం తలెత్తుతోంది. రోహిత్, యశస్వి జైస్వాల్, శ్రేయస్ అయ్యర్ గత వారం జమ్ము కశ్మీర్‌తో రంజీ మ్యాచ్‌లో బరిలోకి దిగారు. కానీ, ఈ ముగ్గురూ పేలవ ప్రదర్శనే చేశారు. వరుసగా రెండు ఇన్నింగ్స్‌ల్లో రోహిత్ 3, 28, జైస్వాల్ 4, 26, శ్రేయస్ 11, 17 పరుగులకు పరిమితమయ్యారు. మరోవైపు ఢిల్లీ తరఫున ఆడిన రిషబ్ పంత్ సైతం రెండు ఇన్నింగ్స్‌ల్లో 1, 17 పరుగులే చేశాడు. పంజాబ్‌కు ప్రాతినిధ్యం వహించిన శుభ్‌మన్ గిల్ తొలి ఇన్నింగ్స్‌లో విఫలమైనా, రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీ సాధించాడు. ఇక జడేజా బౌలింగ్‌లో రాణించాడు. ఇక చానాళ్ల తర్వాత గురువారం రంజీ మ్యాచ్ బరిలోకి దిగిన రాహుల్ విఫలం అయ్యాడు. క్రీజులో సెటిల్ అయినట్లే కనిపించిన ఈ కర్నాటక బ్యాటర్ మంచి ప్రారంభాన్ని భారీ స్కోరుగా మలచలేకపోయాడు. హర్యానా, కర్నాటక జట్ల మధ్య జరిగిన ఈ మ్యాచ్‌లో రాహుల్ 37 బంతులు ఎదుర్కొన్నాడు. 4 ఫోర్ల సాయంతో 26 పరుగులు చేశాడు. అయితే ఎవరెలాంటి ప్రదర్శన చేశారన్నది పక్కన పెడితే, వీళ్లంతా ఈ సీజన్లో ఒక్క మ్యాచ్‌కే పరిమితం కావడం ఇప్పుడు చర్చనీయాంశం అవుతోంది. మరికొన్ని రోజుల్లో ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం కానున్న నేపథ్యంలో, ఆ టోర్నీ ప్రాక్టీస్ శిబిరంలో పాల్గొనడం కోసం వీళ్లంతా తర్వాతి రంజీ మ్యాచ్‌కు దూరమైనట్లు చెబుతున్నారు.



## తొలి టెస్టులో పట్టుబిగిస్తున్న ఆస్ట్రేలియా
### 610 పరుగులు వెనుకబడిన శ్రీలంక

**న్యూఢిల్లీ;** శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో ఆస్ట్రేలియా పట్టు బిగిస్తోంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక 15 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 44 పరుగులు చేసింది. దీంతో లంక ఇంకా ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 610 పరుగులు వెనుకబడి ఉంది. గాలే వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో లంక బ్యాటర్లు ఒషాడోఫెర్నాండో (7), దిముత్ కరుణరత్నె (7), ఏంజెలో మాథ్యూస్ (7) అవుట్ కాగా, దినేశ్ చండీమల్ (9 బ్యాటింగ్), కమిందు మెండిస్ (13 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. అంతకు ముందు ఆస్ట్రేలియా 154 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 654 పరుగులు చేసి తమ తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. రెండో రోజు ఆటలో ఆసీస్ స్టార్ ప్లేయర్ ట్రావిస్ హెడ్ అద్భుతమైన క్యాచ్‌తో మెరిశాడు. స్టన్నింగ్ క్యాచ్‌తో శ్రీలంక వెటరన్ ఏంజెలో మాథ్యూస్‌ను హెడ్ పెవిలియన్‌కు పంపాడు. లంక ఇన్నింగ్స్ 10వ ఓవర్ వేసిన ఆసీస్ స్పిన్నర్ నాథన్ లియాన్ మూడోబంతిని మాథ్యూస్‌కు ఆఫ్ బ్రేక్ డెలివరీగా సంధించాడు. ఆ లూపీ డెలివరీని మాథ్యూస్ ఫ్రంట్ ఫుట్ డిఫెన్స్ ఆడేందుకు ప్రయత్నం చేశాడు. కానీ బంతి బ్యాట్ ఎడ్జ్ తీసుకుని షార్ట్-లెగ్ ఫీల్డర్ కుడివైపునకు వెళ్లింది. ఈ క్రమంలో అక్కడేఉన్న హెడ్ తన కుడివైపునకు లాంగ్‌డైవ్ చేస్తూ సింగిల్ హ్యాండ్‌తో క్యాచ్ అందుకోవడంతో మాథ్యూస్ (7) నిరాశతో మైదానాన్ని వీడాడు. కాగా ఈ మ్యాచ్‌లో ఆసీస్ బ్యాటర్లలో ఓపెనర్ ఉస్మాన్ ఖ్వాజా (352 బంతుల్లో 232 పరుగులు, 16 ఫోర్లు, 1సిక్స్) కెరీర్లో తొలి డబుల్ సెంచరీ నమోదు చేసుకోగా, అరంగ్రేట ఆటగాడు జోస్ ఇంగ్లిస్ (94 బంతుల్లో 102 పరుగులు, 10 ఫోర్లు, 1 సిక్స్), స్టీవ్ స్మిత్ (251 బంతుల్లో 141 పరుగులు, 12 ఫోర్లు, 2సిక్సులు) సెంచరీలతో మెరిశారు. ఇక ఆస్ట్రేలియా ఇప్పటికే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు అర్హత సాధించింది.


శ్రీకాంత్


శంకర్

### థాయ్‌లాండ్ మాస్టర్స్ బ్యాడ్మింటన్‌లో..
## క్వార్టర్స్‌లోకి శ్రీకాంత్, శంకర్

**న్యూఢిల్లీ;** థాయ్‌లాండ్ మాస్టర్స్-300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత ప్లేయర్లు కిడాంబి శ్రీకాంత్, శంకర్ ముత్తుస్వామి సుబ్రమణియన్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. అలాగే ఇదే టోర్నమెంట్‌లో మహిళల సింగిల్స్ విభాగంలో రక్షిత శ్రీ రామరాజ్ క్వార్టర్ ఫైనల్ బెర్తును ఖరారు చేసుకుంది. బ్యాంకాక్‌లో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో శ్రీకాంత్ 21-19, 21-15తో హాంకాంగ్‌కు చెందిన జేసన్ గుణవాన్‌పైన, అలాగే శంకర్ 9-21, 21-10, 21-17తో ఇండోనేసియాకు చెందిన చికో ద్వివర్దోయోపైన, మహిళల సింగిల్స్ విభాగంలో రక్షిత శ్రీ 21-15, 21-12తో చైనీస్ తైపీకి చెందిన క్లా టాంగ్ టుంగ్‌పై గెలుపొందారు.

ఇక మిక్స్‌డ్ డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో భారత్‌కు చెందిన ప్లేయర్లు గద్దె రుతిక్వ శివాని-రోహన్ కపూర్ ద్వయం 19-21, 15-21తో థాయ్లాండ్‌కు చెందిన రచాపోల్- నాథమోన్ జంట చేతిలో ఓడిపోయింది.

### మహిళల అండర్ 19 వరల్డ్ కప్‌లో..
# టైటిల్ పోరుకు భారత్

- సెమీస్‌లో 9 వికెట్ల తేడాతో ఇంగ్లండ్ ఓటమి
- ఫిబ్రవరి 2న ఫైనల్ పోరు



**న్యూఢిల్లీ;** ఐసిసి మహిళల అండర్-19 టి20 ప్రపంచ కప్-2025 టోర్నమెంల్‌లో ఇంగ్లండ్‌పై జరిగిన సెమీఫైనల్ పోరులో భారత్ ఘన విజయం సాధించింది. కౌలాలంపూర్‌లోని బేయూమస్ ఓవల్ స్టేడియంలో శుక్రవారం జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ తన జోరు కొనసాగించింది. లీగ్ దశ, సూపర్ సిక్స్ దశల్లో సత్తా చాటుతూ జైత్రయాత్ర యాత్రను కొనసాగించిన భారత్ అమ్మాయిలు సెమీ ఫైనల్లోనూ అదరగొట్టారు. ఫలితంగా వరుసగా రెండోసారి భారత్ ఈ ఐసిసి టోర్నీ ఫైనల్లో అడుగుపెట్టింది. ఈ రెండో సెమీ ఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఇంగ్లండ్ తొలుత బ్యాటింగ్ చేసింది. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 113 పరుగులు చేసింది. ఓపెనర్ డెవీనా పెరిన్ 45 పరుగులతో సత్తా చాటగా, మరో ఓపెనింగ్ బ్యాటర్ జెమీమా స్పెన్స్ మాత్రం 9 పరుగులకే పరిమితమైంది. ఇక కెప్టెన్ అబీ నోర్‌గ్రోవ్ 30 పరుగులతో రాణించగా, లోయర్ ఆర్డర్‌లో అమూ సురేన్‌కుమార్ 14 పరుగులతో అజేయంగా నిలిచింది. మిగతా వాళ్లలో ట్రూడీ జాన్సన్ డకౌట్ కాగా, చార్లెట్ స్టబ్స్ (4), కేటీ జోన్స్ (0), ప్రిషా తానావాలా (2), చార్లెట్ లాంబర్ట్ (0) కూడా పూర్తిగా విఫలమయ్యారు. భారత బౌలర్లలో పరుణిక సిసోడియా, వైష్ణవిశర్మ ఒక్కొక్కరూ 3 వికెట్లతో చెలరేగగా, ఆయుశీ శుక్లా 2 వికెట్లు పడగొట్టింది. ఇక స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టు కేవలం ఒక్క వికెట్ నష్టపోయి పని పూర్తి చేసింది. ఓపెనర్ జి. కమలిని అర్ధ శతకం (50 బంతుల్లో 56 రన్స్, నాటౌట్)తో మెరవగా, గొంగడి త్రిష 29 బంతుల్లో 35 పరుగులు చేసింది. అదే సమయంలో త్రిషను ఇంగ్లండ్ బౌలర్ ఫోబే బ్రెట్ ఔవుట్ చేయగా, కమలినికి తోడుగా వన్‌డౌన్‌లో ఆడిన సనికా చాల్కె 11 పరుగులతో అజేయంగా నిలిచింది. 15వ ఓవర్లో కమలిని ఫోర్ బాదడంతో భారత్ విజయం ఖరారైంది.

### మహిళల అండర్ 19 టి20 ప్రపంచ కప్‌లో..
## ఫైనల్స్‌కు దక్షిణాఫ్రికా

**న్యూఢిల్లీ;** ఐసిసి మహిళ అండర్-19 టీ20 వరల్డ్ కప్-2025 టోర్నీలో సౌతాఫ్రికా ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. ఆస్ట్రేలియా మహిళా జట్టును ఓడించి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. వరల్డ్ కప్ తాజా ఈవెంట్లో ఇప్పటికే గ్రూప్1 నుంచి భారత్, ఆస్ట్రేలియా, గ్రూప్2 నుంచి దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్ సెమీ ఫైనల్స్‌కు చేరాయి. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం సౌతాఫ్రికా ఆస్ట్రేలియా మధ్య తొలి సెమీ ఫైనల్ మ్యాచ్ జరిగింది. కౌలలంపూర్లోని బేయూమస్ ఓవల్ మైదానంలో టాస్ గెలిచిన ఆసీస్ అండర్ 19 మహిళా జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. అయితే, సౌతాఫ్రికా బౌలర్ల దెబ్బకు కంగారు జట్టు బ్యాటర్లు ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయారు. ఓపెనర్లలో ఇనెస్ మెకియోన్ డకౌట్ కాగా, గ్రేస్ లియాన్స్ 2 పరుగులే చేసి అవుటైంది. ఇక వన్డౌన్‌లో వచ్చిన కెప్టెన్ లూసీ హామిల్టన్ 18 పరుగులు చేయగా, మిగతా వాళ్లలో ఎలియనోర్ లారోసా (7), హస్రత్ గిల్ (1), ఛ్లోయే ఐన్స్‌వర్త్ (1), లిలీ బాసింగ్‌వైట్ (2), టెగాన్ విలియమ్సన్ (3) పూర్తిగా విఫలమయ్యారు.

అయితే, మిడిలార్డర్ బ్యాటర్ కాయిమే బ్రే 36 పరుగులతో రాణించగా, ఎల్లా బ్రిస్కో మెరుపు ఇన్నింగ్స్ ఆడింది. 17 బంతుల్లో 4 ఫోర్ల సాయంతో 27 పరుగులతో అజేయంగా నిలిచింది. వీరిద్దరి కారణంగా ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 105 పరుగులు చేయగలిగింది. ఇక సౌతాఫ్రికా బౌలర్లలో ఆష్లేవాన్ విక్ 4 వికెట్లతో చెలరేగగా, ఎంతబిసెంగ్ నిని, కెప్టెన్ కైలా రెయ్‌నెకె, షేష్నీ నాయుడు ఒక్కో వికెట్ పడగొట్టారు. ఇక స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన సౌతాఫ్రికాకు ఓపెనర్ జెమ్మా బోతా (24 బంతుల్లో 37 రన్స్) శుభారంభం అందించగా, మరో ఓపెనర్ సిమోనే లౌరెన్స్ (5) మాత్రం నిరాశపరిచింది. వన్‌డౌన్ బ్యాటర్ ఫే కౌలింగ్ (7) కూడా విఫలం కాగా, కైలా కెప్టెన్ ఇన్నింగ్స్ బాధ్యతాయుతంగా ఆడి 26 బంతుల్లో 26 పరుగులు చేసింది.

# రికార్డుస్థాయిలో ఐఫోన్ల సేల్స్

**న్యూఢిల్లీ, జనవరి 31:** భారత్‌లో ఆపిల్ విక్రయాలు జోరందుకున్నాయి. గతంలో ఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయిలో విక్రయాలు నమోదయ్యాయి. ఈ విషయాన్ని కంపెనీ సిఇఒ టిమ్ కుక్ శుక్రవారం వెల్లడించాడు. అదే సమయంలో భారత్‌లో అత్యధికంగా అమ్ముడైన స్మార్ట్‌ఫోన్ మోడల్‌గా అవతరించిందన్నారు. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో ఐఫోన్ రికార్డు స్థాయిలో అమ్మకాలను నమోదు చేసిందని టిమ్ కుక్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఐ ఫోన్ రెండో అతిపెద్ద స్మార్ట్‌ఫోన్ మార్కెట్ అని పేర్కొన్నారు. ఇక పిసిలు, ట్యాబ్లెట్లకు మూడో అతిపెద్ద మార్కెట్‌గా ఆపిల్ నిలిచిందన్నారు. భారత్‌లో అత్యధికంగా అమ్ముడైన స్మార్ట్‌ఫోన్ మోడల్‌గా ఐఫోన్ నిలవడం ఇదే తొలిసారి. భారత్‌తో పాటు అమెరికా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, జపాన్ దేశాల్లో వీటి విక్రయాలు జోరందుకున్నట్లు కుక్ తెలిపారు. కౌంటర్ పాయింట్ రీసెర్చ్ ప్రకారం 2024లో విలువపరంగా ఆపిల్ 23 శాతం, శాంసంగ్ 22 శాతం మార్కెట్ వాటాతో నిలిచాయి. వివో 16శాతం, ఒప్పో 14శాతం, షావోమి 9శాతం వాటాతో తర్వాత స్థానాల్లో నిలిచాయి. ఆపిల్ ప్రత్యేకంగా భారత్‌దేశంపై ఆసక్తిగా ఉందని టిమ్‌కుక్ తెలిపారు. ఆపిల్ ఇంటెలిజెన్స్‌ను ఇంగ్లీష్‌తో సహా మరిన్ని భాషలకు సపోర్ట్ చేసేలా తీసుకొస్తామని వెల్లడించారు. భారత్‌లో ఎంటర్‌ప్రైజ్ విభాగం నుంచి



ఆపిల్‌కు బలమైన డిమాండ్ ఉందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, 2023 ఏప్రిల్‌లోనే ఢిల్లీ, ముంబైలో రెండు రిటైల్ స్టోర్లను ప్రారంభించింది. ఈ స్టోర్లకు వచ్చిన ఆదరణ నేపథ్యంలో విస్తరణ దిశగా అడుగులు వేస్తోంది. త్వరలోనే బెంగళూరు, పుణె, ఢిల్లీ-ఎన్‌సిఆర్, ముంబైలో మరో నాలుగు స్టోర్లు ప్రారంభించనున్నట్లు ప్రకటించింది.

## వినియోగం పెంచితేనే ఎకానమీకి బూస్ట్

**న్యూఢిల్లీ, జనవరి 31:** మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టాక పూర్తి సంవత్సరానికి ప్రవేశపెడుతున్న బడ్జెట్‌పై సర్వత్రా ఆసక్తి చూపుతోంది. వృద్ధిరేటు అంచనాలు క్షీణించిన వేళ, దీన్ని తిరిగి గాడిన పెట్టేందుకు చర్యలు తీసుకోక తప్పని పరిస్థితి. ముఖ్యంగా ప్రజల కొనుగోలు శక్తిని పెంచడం ప్రధానమైన టాస్క్ ఇందులో భాగంగానే వేతన జీవులకు ఊరటనిచ్చే అంచనాలు ఉన్నాయి. దీనితో పాటు అన్ని వర్గాల వినిమయాన్ని పెంచాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జీడీపీ వృద్ధి రేటు 6.4 శాతంగా నమోదు కావొచ్చని కేంద్ర గణాంక కార్యాలయం అంచనా వేసింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇది 8.2 శాతంగా ఉంది. దేశీయ వృద్ధి అంచనాలు నాలుగేళ్ల కనిష్ఠ స్థాయికి చేరిన వేళ నిర్మల సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో వేతన జీవులకు పన్ను ఊరట కల్పించడం ద్వారా ఆర్థిక వ్యవస్థకు ఊతం ఇవ్వొచ్చని ఎక్కువ మంది ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఓ వైపు ద్రవ్యోల్బణాన్ని అదుపుచేస్తూనే వృద్ధికి చర్యలు తీసుకోవడంతో కూడిన వ్యవహారమేనని అభిప్రాయపడుతున్నారు. వినియోగ వ్యయానికి, దేశాభివృద్ధికి మధ్య ప్రత్యక్ష సంబంధం ఉంటుంది. ఈ వ్యయాలు ఎంత ఎక్కువగా పెరిగితే అభివృద్ధి అంతగా ఊపందుకుంటుంది. దాంతో పరిశ్రమలు కార్మికశక్తిని పెంచుకోవాల్సి వస్తుంది. వారి ఆదాయాలు పెరిగి జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. ఫలితంగా స్థూల దేశీయోత్పత్తి



పెరుగుతుంది. ఇదంతా ఒక చక్రంలా పనిచేస్తుంది. కాబట్టి దేశవినియోగంపై ఆధారపడి ఉంటుంది. ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై పెట్టుబడులు పెరగాలని ఆర్థికనిపుణులు సూచిస్తున్నారు. వృద్ధికి చర్యలు చేపడతారన్న అంచనాలతో ఈ సారి బడ్జెట్‌పై వేతనజీవులు గంపెడాశలు పెట్టుకున్నారు. ముఖ్యంగా కొత్త పన్ను విధానంలో శ్లాబుల సవరణ, రిబేట్ పెంపు, స్టాండర్డ్ డిడక్షన్ పెంపు ఉన్నాయి. ప్రస్తుతం పన్ను విధానంలో ఉన్న రూ.75 వేల స్టాండర్డ్ డిడక్షన్ పరిమితిని లక్ష రూపాయలకు పెంచాలని కొత్త పన్ను నిపుణులు కోరుతున్నారు.

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, జనవరి 31:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా నాలుగోరోజు లాభాల్లో ముగిసాయి. అంతర్జాతీయ సానుకూల సంకేతాల మధ్య ఉదయం లాభాల్లో ప్రారంభమైన మార్కెట్లు రోజంతా అదే బాటలోనే పయనించాయి. ఐటి, ఆటో రంగ షేర్లలో కొనుగోళ్లతో సూచీలు రాణించాయి. దీంతో మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 740 పాయింట్లు పెరిగి 77,500.57 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 258 పాయింట్లు పెరిగి 23,508 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.86.61 వద్ద స్థిరపడింది. ఎల్అండ్‌టి, ఇండస్ ఇండ్ బ్యాంకు, నెస్లే ఇండియా, టైటాన్ కంపెనీ, టాటా స్టీల్,



టాటా మోటార్స్, ఐటిసి, హిందుస్థాన్ యూనిలీవర్, మారుతి సుజుకి, ఏసియన్ పెయింట్స్ వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. భారతీఎయిర్‌టెల్, బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్‌ఫైనాన్స్, ఐసిఐసిఐబ్యాంకు, కోటాక్ మహీంద్రా బ్యాంకు వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి.

# వాణిజ్యం

## నేటి నుంచి మారుతున్న రూల్స్

**ముంబై, జనవరి 31:** సామాన్యులపై ప్రభావం చూపే అనేక ప్రకటనలు ఫిబ్రవరిలో ఉన్నాయి. కేంద్రాల్లోని ప్రకటనలతో పాటు ఆర్బీఐ బడ్జెట్ రేట్లపై నిర్ణయాలు, యూపీఐ నిబంధనల్లో కొత్త మార్పులు అమల్లోకి రానున్నాయి. వీటితో పాటు అంశాలు ఫిబ్రవరిలో చోటు చేసుకుంటున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న బడ్జెట్ (యూనియన్ బడ్జెట్ 2024) ప్రవేశపెట్టనున్నారు. ఇందులో ఎలాంటి మార్పులు ఉండబోతున్నాయోనని దేశ ప్రజలు ఎంతో ఆశతో ఉన్నారు. ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు ఊరట, నిరుద్యోగులకు భరోసా, కిసాన్ సమ్మాన్ నిధి పెంపు వంటి అంచనాలు ఉన్నాయి. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోనుందో తెలియాలంటే గంటలు ఆగాల్సిందే. 2023 ఫిబ్రవరి నుంచి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో రేటును 6.5 శాతం వద్ద కొనసాగిస్తూనే ఉంది. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడంతో ఫిబ్రవరి 7న నిర్వహించే ఆర్బీఐ ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపిసి) ప్రకటన వడ్డీ రేట్ల తగ్గింపు ఉండే అవకాశం ఉందని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. అంచనాల కంటే వృద్ధి నెమ్మదించడం, కమిటీలో కొత్త సభ్యులు చేరికల కారణంగా ఈ సారి వడ్డీ రేట్ల కోతనే ఆశలు మళ్లీ చిగురించాయి. డిజిటల్ చెల్లింపులకు మరింత భద్రతపెంచే దిశగా నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) ముందడుగు వేసింది. ఇందులో భాగంగా యూపీఐ లావాదేవీలకు సంబంధించి కొత్త నిబంధనను తీసుకొచ్చింది. యూపీఐ లావాదేవీ ఐడీ కచ్చితంగా ఆల్ఫానమరికా ఉండేలా చూడాలని పేమెంట్ ప్లాట్‌ఫామ్‌లకు సూచించింది. ఐడీలో అంకెలు,అక్షరాలు మాత్రమే ఉండాలని, స్పెషల్ క్యారెక్టర్లుఉంటే లావాదేవీలను అనుమతించబోమని ప్రకటించారు. ఫిబ్రవరి 1 నుంచి ఈ నిబంధన అమల్లోకి రానుంది. దాదాపు అన్ని ప్లాట్‌ఫామ్‌లు ఇప్పటికే ఈ నిబంధనలను పాటిస్తున్నాయి. ఒకవేళ పాటించకపోతే మీ లావాదేవీ ఆగిపోయే అవకాశం ఉంది. కాబట్టి మీ యాప్‌ను అప్‌డేట్ చేయండి. మరిన్ని వివరాలకు మీ కస్టమర్‌లను సంప్రదించండి. దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ కార్లధరల పెంపును తాజాగా ప్రకటించింది. ఫిబ్రవరి 1 నుంచి ఈ పెంపు అమల్లోకి వచ్చింది. సెలెరియా, ఇన్విక్టో, వ్యాగన్‌ఆర్, స్విఫ్ట్, ఎసయూవీ బ్రెజా, విటారా, ఆల్టో, ఎక్స్‌ప్రెసో, బాలెనో, కాంపాక్ట్ ఎస్యూవీ, డిజైర్




ఇలా అన్ని మోడళ్లపై ధరలు పెంపు ఉంటాయి. కారు మోడల్ ఆధారంగా అత్యధికంగా రూ.32,500 వరకు పెంపు ఉన్నట్లు ఇటీవలే ప్రకటించింది. ప్రతి నెలా ఒకటో తేదీన చమురు సంస్థలు ఎల్పీజీ సిలిండర్ ధరలను సవరిస్తుంటాయి. గృహ అవసరాలకు వినియోగించే సిలిండర్లతో పాటు వాణిజ్య సిలిండర్ ధరలను అంతర్జాతీయ మార్కెట్ ధరలకు అనుగుణంగా సవరిస్తుంటాయి. ఈ సారి ఎలాంటి మార్పులు చేస్తారో చూడాలి.

## కరెంటు ఛార్జీల భారం ఇబ్బందికరం: సిఇఎ అనంత నాగేశ్వరన్

**ముంబై, జనవరి 31:** రాష్ట్రాలు వ్యాపార రంగంలోని సంస్థలపై కరెంటు ఛార్జీలను భారీ మోపుతున్నాయని చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్ అనంత నాగేశ్వరన్ అభిప్రాయపడ్డారు. ఆర్థిక సర్వే 2025 విడుదల అనంతరం ఆయన విలేకర్లతో సమావేశమయ్యారు. మారుతున్న భౌగోళిక రాజకీయ సమీకణలు చాలా కీలకమని పేర్కొన్నారు. మార్పులో గ్లోబలైజేషన్ శక్తిగా ఆయన.. ప్రపంచ స్థాయిలో జీవన ప్రమాణాలను, అనుసంధానతను పెంచింది. వ్యయాలను తగ్గించిందని అభివర్ణించారు. ప్రపంచ స్థాయిలో చైనా అత్యంత వేగంగా ఎదుగుతోందని నాగేశ్వరన్. కేవలం 10 ఏళ్ల కాలంలోనే ప్రపంచంలోనే 70 శాతం సౌరశక్తి ఆధారిత విద్యుత్తు తయారీ కేంద్రంగా మారింది. సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి పరిశ్రమలపై నియంత్రణలను తగ్గించాలని ఆయన అభిప్రాయపడ్డారు. వేగవంతమైన ఆర్థిక వృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంస్కరణలను చేసి.. చిన్న, మధ్యతరగతి సంస్థలు వ్యయ నియంత్రణలతో, పోటీగా నిర్వహించేలా తయారు చేయాలి అని పేర్కొన్నారు. ప్రధాన భారత్‌లో చాలా రాష్ట్రాల వ్యాపారాలపై అత్యధిక కరెంటు ఛార్జీల భారం మోపుతోంది. ఈ వియత్నాం, బంగ్లాదేశ్ వంటి దేశాలతో మనం పోటీ పడే పరిస్థితి లేకుండా పోతుంది. వియత్నాంలో పరిశ్రమలకు అనుకూలమైన ఈ ఛార్జీలుఉన్నాయి. వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి ఉంది. ఈ రంగంలో బలమైన వృద్ధి నమోదైతే, జీడీపీ వృద్ధిరేటులో 0.75 శాతం నుంచి 1 శాతం వరకు ఉంటుంది. 2026



నాటికి ప్రతి పిల్లవాడికి ప్రాథమిక అక్షరాస్యత, గణితం వచ్చేలా చేయాలన్న లక్ష్యంతో నైపుణ్యం భారత్ కార్యక్రమంపై దృష్టిపెట్టారు. దీని వల్ల బిహార్, గుజరాత్ వంటి చోట్ల సానుకూల ఫలితాలు వచ్చాయి. భారత్‌లో గత పదేళ్లకు పైగా మౌలిక వసతుల అభివృద్ధిపై దృష్టిసారించడం సానుకూలఫలితాలను ఇచ్చింది. సరికొత్త రైళ్లు, ఎయిర్ పోర్టు, ఓడరేవులు అందుబాటులోకి రావడంతో టర్న్ అరౌండ్ టైం 4 గంటల నుంచి 30 గంటలకు తగ్గింది. విద్యుత్తు రంగంలో ఉత్పత్తి పెరుగుదల, డేటా వ్యయం తగ్గింపు, టెలికాంప్రా ఇన్‌స్కాషన్‌లో కీలక విజయాలు. తప్పుడు వాణిజ్య ప్రకటనలు, సెలబ్రిటీల ఎండార్స్‌మెంట్‌లు, అస్పష్టమైన లేబులింగ్‌లు ఆందోళనకరం. ముఖ్యంగా అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్‌ను ఈ విధానాలలో అమ్మడం వినియోగదారుల ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీసే ముప్పు ఉంది. కేన్సర్లు, శ్వాస సంబంధ సమస్యలు, గుండెజబ్బులు, జీర్ణకోశ సమస్యల ముప్పు పొంచి ఉంది. ఈ యేడాది తొలి అర్ధ భాగంలో ఆర్థిక వృద్ధి 6శాతం ఉంది. ద్వితీయార్థంలో మరింత బలపడినట్లు అంచనా వేస్తున్నాం.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.